జిల్లాలో ఆక్వా రంగం కోలుకోలేని దెబ్బతింది. సీడ్ మోసంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రొయ్య పిల్లలను ఉత్పత్తి చేసే హేచరీలు వారిని దెబ్బకొట్టాయి. నమ్మించి నట్టేట ముంచాయి. నాసిరకం సీడ్‌ను సరఫరా చేయడంతో రైతులు రూ.లక్షల్లో పెట్టుబడులు కోల్పోయారు. చెరువుల్లో రొయ్యలు ఎదుగుదల లేకపోవడం, మధ్యలో చనిపోతుండటంతో లబోదిబోమంటున్నారు. హేచరీల నిర్వహణపై ప్రభుత్వానికి పూర్తిగా పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వాహకులదే ఇష్టారాజ్యమవుతోంది. రైతులు ఒకపక్క గుల్లవుతుండగా హేచరీల యజమానులు మాత్రం రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. నాసిరకం సీడ్‌తో నష్టపోయిన రైతులు.. హేచరీల నుంచి పరిహారం ఇప్పించాలని, కానిపక్షంలో ప్రభుత్వం సాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.



కొత్తపట్నం వద్ద మోనోడాన్ రొయ్యలు సాగుచేసిన చెరువు



- చెరువుల్లో ఎదుగుదల లేని రొయ్యలు
- ఎకరాకు రూ.5లక్షలు పోయినట్లే!
- హేచరీలపై పర్యవేక్షణ లేకపోవడమే కారణం
- పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు

మోనోడాన్.. ముంచెన్!

నాసిరకం సీడ్‌తో ఆక్వా రైతులకు అపారనష్టం

ఒంగోలు నగరం, జూలై 30: జిల్లాలోని ఆక్వా రైతులు మళ్లీ కుదేలయ్యారు. ప్రతిసారీ వైరస్ కారణంగానో, లేక ధరలు పడిపోవడం వల్లో దెబ్బతినే ఆక్వా రంగం ఈసారి నాసిరకం సీడ్‌తో అతలాకుతలమవుతోంది. గత కొన్నేళ్లుగా టైగర్ రకం రొయ్యల సాగువైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. వెనామీ రకం రొయ్యలకు డిమాండ్ తగ్గటంతో టైగర్ (మోనోడాన్)పై దృష్టిసారించారు. గత ఐదేళ్లుగా జిల్లాలో ఈ రకం సాగు పెరుగుతూ వస్తోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కొత్తపట్నం, టంగుటూరు, సింగరాయకొండ, ఉలవపాడు, ఒంగోలు, చినగంజాం, నాగులుప్పలపాడు, వేటపాలెం, చీరాల మండలాల్లో దాదాపు 25వేల హెక్టార్లలో ఆక్వా సాగు జరుగుతోంది. ఇందులో సగానికిపైగా టైగర్ రకం రొయ్యలనే రైతులు సాగుచేస్తున్నారు.

1న ప్రత్యేక సమావేశం

రైతులకు నాసిరకం సీడ్‌ను విక్రయించిన హేచరీల నుంచి నష్టపరిహారం ఇప్పించాలన్న డిమాండ్ జిల్లా ఆక్వా రైతుల సంక్షేమ సంఘం నుంచి వస్తున్న నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించారు. హేచరీల యజమానులు, ఆక్వా రైతు సంఘం నాయకులతో ఆగస్టు ఒకటో తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో జరిగే ఈ సమావేశంలో రైతులు, అధికారులు, హేచరీల నిర్వాహకులు పాల్గొననున్నారు.

మోనాడాన్.. చనిపోతున్నాయి

జిల్లాలో రైతులు నెల్లూరు, గూడూరు, కరేడు ప్రాంతాల నుంచి రైతులు మోనోడాన్ కంపెనీ రొయ్య పిల్లలను తెచ్చి సాగు చేపట్టారు. అయితే ఈ రకం వేసిన చెరువుల్లో పిల్లలు చనిపోతున్నాయి. సగానికి సగం కూడా చెరువులో ఉండటం లేదు. బతికిన సగం పిల్లల్లో కూడా ఎదుగుదల లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వెనామీ రకం సీడ్ చెరువుల్లో లక్షల్లో వేస్తారు. టైగర్‌లోని మోనోడాన్ రకం అయితే ఎకరం విస్తీర్ణంలో 30వేల పిల్లలను మాత్రమే వదులుతారు. వేసినవి కూడా మొత్తం బతక్కపోవడం, బతికి ఉన్న రొయ్యల్లో ఎదుగుదల లేకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది. వెనామీ రకం రొయ్యలను 100 కౌంట్‌లో తీసినా గిట్టుబాటవుతుంది. అదే టైగర్‌లోని మోనోడాన్ రకం రొయ్యలను 30లోపు కౌంటులో తీస్తేనే ఖర్చులు చేతికి వస్తాయి. అలా తీసుకు రావాలంటే రైతులు ఐదు నెలలకుపైగా చెరువుల్లో ఉంచి మేత వేయాల్సి ఉంటుంది. అయినా ఆ కౌంట్‌కు ఎదగకపోవడంతో రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. జిల్లాలో టైగర్ రకం రొయ్యల్లో మోనోడాన్ కంపెనీకి చెందిన పిల్లలు సాగు చేసిన రైతులు భారీగా నష్టపోయారు. గత రెండేళ్లుగా నష్టాల్ని చవిచూస్తూనే ఉన్నారు.

మోనోడాన్ రకం రొయ్యలను సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.5లక్షల మేర నష్టపోయారు.

ధర ఎక్కువ ... నాణ్యత తక్కువ

మోనోడాన్ సీడ్‌ను హేచరీల యజమానులు రైతులకు ఎక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఇతర రకం సీడ్ 50 గ్రాముల లోపు ఉంటుండగా, మోనోడాన్ రొయ్య గరిష్ఠంగా 100 గ్రాముల బరువు పెరుగుతుంది. దీంతో సహజంగానే ఆ రకం రొయ్యలకు మార్కెట్లో డిమాండ్ అధికం. దీంతో ఎక్కువ మంది రైతులు టైగర్‌లోని మోనోరకం సాగుకే మొగ్గుచూపుతున్నారు. దీంతో హేచరీల యజమానులు సీడ్ ధరలను అమాంతం పెంచేసి విక్రయిస్తున్నారు. ఒక్కో పిల్ల రేటు గరిష్ఠంగా 90పైసలకు విక్రయిస్తున్నారు. ఈ లెక్కన ఆక్వా రైతులు సీడ్ కొనుగోలుకే రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఇంత ధర పెట్టి కొనుగోలు చేసినా నాసిరకం సీడ్‌నే సరఫరా చేస్తున్నారు. తెచ్చిన పిల్లల్లో 20శాతం మాత్రమే చెరువుల్లో బతుకుతున్నాయి. సాధారణంగా మోనోడాన్ కంపెనీ రకం సీడ్‌ను ఆరు నెలలపాటు పెంచితే 100 గ్రాములకు పెరుగుతాయి. ఇప్పుడు ఆరు నెలలకు 50 గ్రాముల బరువు కూడా పెరగడం లేదు. దీంతో రైతులు మేత, ఇతర నిర్వహణ ఖర్చులు పెరిగిపోయి తీవ్రంగా నష్టపోయారు. ఎదుగుదల లోపించడంతోపాటు వ్యాధులు కూడా చుట్టుముడుతున్నాయి. వైట్‌స్పాట్, వైట్‌గట్, ఇహెచ్‌పీ వైరస్‌లు రొయ్యలకు సోకుతున్నాయి. దీంతో చెరువును మధ్యలోనే తీసేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

చోద్యంచూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

హేచరీల నిర్వాహకులు కొందరు రొయ్యల రైతులకు నాసిరకం సీడ్‌ను సరఫరా చేస్తూ నిలువునా మోసం చేస్తున్నారు. అయితే ఈ మొత్తం వ్యవహారాన్ని పర్యవేక్షించాల్సిన మత్స్యశాఖ అధికారులు కానీ, కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ కానీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. తరచూ హేచరీలను తనిఖీ చేస్తూ నాసిరకం సీడ్ తయారీని అరికట్టాల్సిన అధికారులు ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు మృగ్యమయ్యాయి. జిల్లా మత్స్యశాఖకు తగినంత మంది అధికారులు, సిబ్బంది ఉన్నా హేచరీల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని రైతులు విమర్శిస్తున్నారు.



మోనోడాన్ రకం రొయ్యలు

విద్యా పథకాలకు మహనీయుల పేర్లు

పాతవాటిని మార్చిన కూటమి ప్రభుత్వం

ఒంగోలు (విద్య), జూలై 30 : పాఠశాల, కళాశాల విద్యలో విద్యార్థులకు అమలుచేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాల పేర్లను కూటమి ప్రభుత్వం మార్చేసింది. గత ప్రభుత్వంలో జగనన్న పేరుతో అమలైన ఈ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టి వారిని గౌరవించింది. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా మూడు పథకాలకు పేర్లు ప్రకటించింది. పాఠశాల విద్యార్థులకు ఇప్పటి వరకూ జగనన్న గోరుముద్ద పేరుతో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం పేరును డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా మార్చింది. జగనన్న విద్యాకానుక పేరుతో విద్యార్థులకు అందిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇకపై సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్రగా అమలు చేయనుంది. జగనన్న ఆణిముత్యాలు పేరుతో విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను అబ్దుల్‌కలాం ప్రతిభా సేవా పురస్కారంగా ప్రభుత్వం మార్పు చేసింది.



మారిన మధ్యాహ్న భోజనం మెనూ

- పాఠశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన మెనూను ప్రభుత్వం మార్చింది.
- సోమవారం కూరగాయల పలావ్, కోడిగుడ్ల కూర, వేరుశనగ చిక్కీ
- మంగళవారం పులిహోర, దొండకాయ పచ్చడి, రాగిజావ, ఉడికించిన కోడిగుడ్డు
- బుధవారం కూరగాయల అన్నం, ఆలూకుర్మ, ఉడికించిన కోడిగుడ్లు, వేరుశనగ చిక్కీ
- గురువారం సాంబార్ బాత్/లెమన్ రైస్, టమోటా పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు
- శుక్రవారం అన్నం, ఆకుకూరపప్పు, ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగ చిక్కీ
- శనివారం ఆకుకూర అన్నం, పప్పుచారు, రాగిజావ, స్వీట్ పొంగల్
- వంట నిర్వాహకులు, హెచ్‌ఎంల అనుమతిలో విద్యార్థులకు సరిపోయేలా అన్నం, గుడ్లు, చిక్కీలు ఇవ్వాలి. వంట చేసే ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచాలి. వంటకు ముందు నిర్వాహకులు విధిగా యూనిఫాం ధరించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రజాభిప్రాయం... గందరగోళం

- సీఆర్‌జడ్ పరిధి తగ్గించాలన్న ప్రతిపాదనను వ్యతిరేకించిన మత్స్యకారులు
- కార్యక్రమాన్ని నిలిపివేసిన అధికారులు

కొత్తపట్నం (ఒంగోలు నగరం) జూలై 30 : కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్ పరిధిని తగ్గించే దిశగా జరుగుతున్న అభిప్రాయ సేకరణ అర్ధంతరంగా ఆగిపోయింది. కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు మంగళవారం కొత్తపట్నం బీచ్‌లో ప్రజాప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కోస్టల్ జోన్ మేనేజ్‌మెంటు ప్లాన్ ఖరారు చేసేందుకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ, అటవీ శాఖలు దీన్ని చేపట్టాయి. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి, పొల్యూషన్ బోర్డు అధికారి రాఘవరెడ్డి, తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. అయితే ఈ అభిప్రాయ సేకరణను అందరికీ తెలియజేయకుండా రహస్యంగా నిర్వహిస్తున్నారంటూ టీడీపీ నాయకులు మత్స్యకారులను కూడగట్టారు. వారు పెద్ద సంఖ్యలో బృందావనం బీచ్ రిసార్టు వద్దకు చేరుకున్నారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా వైసీపీ నాయకులతో కుమ్మక్కై ఈ అభిప్రాయ సేకరణ జరుపుతున్నారంటూ ధ్వజమెత్తారు. టీడీపీ మండల అధ్యక్షుడు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు జంపాని రామచంద్రరావు, మత్స్యకారులు అధికారులను నిలదీశారు. అభిప్రాయ సేకరణ విషయం మీకైనా తెలుసా అంటూ కొత్తపట్నం తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్డీవోలకు ఫోన్ ద్వారా సంప్రదించారు. వారు తమకు తెలియదని చెప్పడంతో మత్స్యకారులు, టీడీపీ నాయకులు మరింత ఆగ్రహంతో ఊగిపోయారు. రహస్యంగా జరుపుతున్న ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని, వెంటనే అధికారులు ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని కోరారు. మత్స్యకారులు ఎక్కువ సంఖ్యలో చేరడంతో అధికారులు కార్యక్రమాన్ని వాయిదా వేసి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా అధికారులకు మత్స్యకారులకు మధ్య పెద్దఎత్తున వాగ్వాదం జరిగింది. వైసీపీ నాయకులతో అధికారులు కలిసి ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో సీఆర్‌జడ్ పరిధిని తగ్గించేందుకు కుట్ర జరుగుతుందని మత్స్యకారులు ఆరోపించారు. తీరప్రాంతంలో నివాసం ఉండేవారిని కాకుండా శింగరాయకొండలో సీఫుడ్స్ కంపెనీలో పనిచేసే ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని ఈ కార్యక్రమానికి పిలిపించి తప్పుడు సమాచారం ప్రభుత్వానికి పంపాలని చూస్తున్నారని మత్స్యకారులు మండిపడ్డారు.



అధికారులు వెళ్లిపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

మరో వేసవి

- జిల్లావ్యాప్తంగా పెరిగిన ఎండలు.. ఆపై వేడిగాలులు
- ఒంగోలులో 38.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- నాలుగైదు రోజుల్లోనే ఐదు డిగ్రీలు పెరుగుదల

ఒంగోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అత్యధిక ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తూ కొన్నిచోట్ల వరదలు కూడా ముంచెత్తుతున్నాయి. కానీ జిల్లాలో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. అధిక ప్రాంతాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఒకరకంగా వేసవిని తలపిస్తోంది. వడగాలులు కూడా వీస్తున్నాయి. గత వారంరోజులుగా జిల్లాలో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నాలుగురోజుల వ్యవధిలో ఒంగోలు నగరంలో ఏకంగా ఐదు డిగ్రీల మేర ఉష్ణోగ్రత పెరిగింది. ఈనెల 27న ఒంగోలులో 34 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా మంగళవారం అది ఏకంగా 38.8డిగ్రీలకు చేరింది. సాధారణంగా జిల్లాలో ఈ సమయంలో వాతావరణం చల్లగా ఉంటుంది. పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30 నుంచి 34 డిగ్రీల లోపు నమోదవుతాయి. తరుచూ జల్లులు పడుతూ వాతావరణం చల్లబడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే మరింత ఆహ్లాదకరంగా ఉంటుంది. ఖరీఫ్ సీజన్ పంటల సాగుతోపాటు పశుగ్రాస పైర్లు, ఇతరత్రా వాటితో గ్రామాల్లోని పొలాలు పచ్చదనం పరుచుకుంటాయి. అదే పట్టణాలలో అయితే రెండు, మూడు రోజులకు ఒకసారి అయినా జల్లులు పడుతూ జనజీవనం కొంత ఇబ్బందికరంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం జిల్లాలో అందుకుభిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. నాలుగైదు రోజులుగా పరిస్థితి పూర్తిగా మారింది.



40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు

జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో వానజాడ లేకపోగా ఎండల తీవ్రత పెరిగింది. పలుచోట్ల 40డిగ్రీలకు చేరువలో ఎండలు కాస్తుండటంతోపాటు వడగాలులు కూడా వీస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్న సమయంలో సంతనూతలపాడు, చీమకుర్తి, పొన్నలూరు మండలాల్లో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సగానికిపైగా మండలాల్లో 37డిగ్రీల కన్నా అధికంగా ఎండ కాచింది. ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఎండల తీవ్రత ఉంటోంది. ఎండలకు వేడిగాలులు, ఉక్కపోత తోడు కావడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

డ్వామా పీడీపై విచారణ

- జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉద్యోగులు
- వివరాలు సేకరించిన జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 30: జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ అర్జున్‌రావుపై వచ్చిన ఆరోపణలపై జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ విచారణ చేశారు. ప్రకాశం భవన్‌లోని తన చాంబర్‌లో మంగళవారం రాత్రి చేపట్టిన విచారణకు అర్జున్‌రావుతో పాటు జిల్లాలోని డ్వామా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది భారీగా తరలివచ్చారు. పీడీగా అర్జున్‌రావు వచ్చిన తర్వాత తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఉద్యోగులు జేసీ వద్ద ఏకరువు పెట్టినట్లు సమాచారం. మండలాల వారీగా టార్గెట్ పెట్టి వసూళ్లు చేస్తున్నారని, ఇవ్వకపోతే మానసికంగా ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆయన తనిఖీలకు వస్తే కనీసం రూ.లక్ష వరకు మామూళ్లు అడుగుతున్నారని ఆరోపించినట్లు తెలిసింది. అంతకు ముందు పీడీ అర్జున్‌రావును కూడా విచారించారు. కాగా విచారణ కోసం భారీగా డ్వామా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తరలిరావడంతో కలెక్టరేట్ కోలాహలంగా మారింది. తాము పనిచేసే అధికారి వేధింపులు తట్టుకోలేక ఉద్యోగులు తరలిరావడంపై విస్తృత చర్చ నడిచింది.



విచారణకు హాజరైన డ్వామా పీడీ



జేసీ చాంబర్ వద్ద విచారణకు హాజరైన డ్వామా ఉద్యోగులు

తహసీల్దార్లకు నేడో, రేపో పోస్టింగ్‌లు

- జిల్లాలో 28 మంది రిపోర్టు
- మరో ఆరుగురు రిలీవ్ కాని పరిస్థితి

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 30: సార్వత్రిక ఎన్నికల్లో ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు ప్రారంభమైంది. ఇక్కడ పనిచేస్తున్న ఇతర జిల్లాలకు చెందిన 34మంది తహసీల్దార్లను కలెక్టర్ రిలీవ్‌చేయగా, మన జిల్లాకు చెందిన తహసీల్దార్లు అక్కడ రిలీవ్ అయ్యారు. గుంటూరు, బాపట్ల, నెల్లూరు జిల్లాల నుంచి 34 మంది తహసీల్దార్లు మన జిల్లాకు రావాల్సి ఉంది. ఇప్పటివరకు 28 మంది తహసీల్దార్లు వచ్చారు. మరో ఆరుగురిని ఆయా జిల్లాల్లో ఇంకా రిలీవ్ చేయలేదు. ఇప్పటికే ఆయా మండలాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లను రిలీవ్ చేసి డిప్యూటీ తహసీల్దార్లకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. దీంతో జిల్లాకు వచ్చిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు ప్రారంభించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా దీనిపై దృష్టిసారించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పరిశీలన చేపట్టారు. అంతా పూర్తయ్యాక ఆ ఫైల్‌ను పరిశీలించి కలెక్టర్‌కు అందజేయనున్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళ, బుధవారాల్లో వారికి పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్నారు. గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి రావాల్సిన ఆరుగురుని అక్కడ ఇంకా రిలీవ్ చేయలేదు. వారందరూ కలెక్టరేట్‌లోని పలు సెక్షన్లలో పనిచేస్తుండటంతో కొత్త తహసీల్దార్లు బాధ్యతలు స్వీకరించాక వారిని రిలీవ్ చేయనున్నట్లు సమాచారం. వారు వచ్చి ఇక్కడ రిపోర్టు చేసిన తర్వాత వారికి కూడా ఆయా మండలాల్లో తహసీల్దార్లుగా పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.



అంతా ఖాళీనే..!

- కాలక్షేపం చేస్తున్న ఎయిడెడ్ టీచర్లు
- ఆయా స్కూళ్లలో పిల్లల్లేరు
- సర్దుబాటును పట్టించుకోని విద్యాశాఖ



ఒంగోలు (విద్య), జూలై 30: జిల్లాలో పిల్లలు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు ఖాళీగా ఉంటూ కాలక్షేపం చేస్తున్నారు. పాఠాలు చెప్పేందుకు పిల్లలు లేకపోవడంతో వీరిని ఖాళీగా కూర్చోబెట్టి ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోంది. నిబంధనల ప్రకారం పాఠశాలల్లో పిల్లలు లేకపోతే వాటిని తాత్కాలికంగా మూసివేసి అక్కడ పనిచేసే టీచర్లను పిల్లలు ఉన్న స్కూళ్లకు సర్దుబాటు చేస్తారు. అయితే విద్యాశాఖ అధికారులు ఆ పనిచేయకపోవడంతో టీచర్లు పాఠశాలల్లోనే ఉంటున్నారు. కొమరోలు, కంభం, గిద్దలూరు మండలాల్లోని కొన్ని ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. విద్యార్థులు లేకపోతే అక్కడి టీచర్లను పిల్లలు ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయాలని డీఈవో సుభద్ర మండల విద్యాధికారులను ఆదేశించినా ఆచరణలో ఫలితం కనిపించలేదు. ఈ మండలాల్లో సుమారు 20మంది టీచర్లు పిల్లలు లేక ఖాళీగా పాఠశాలలకు కాపలా కాస్తూ అక్కడే తిష్ఠవేస్తున్నారు. ప్రతినెలా లక్షలాది రూపాయల జీతాలు చెల్లిస్తూ వారితో పనిచేయించుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. సంతకాల శ్రమకు జీతాలు చెల్లిస్తూ ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తున్నారు. విద్యాశాఖాధికారి దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇచ్చిన హామీలకు
కట్టుబడిన కూటమి ప్రభుత్వం
• టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని


మాట్లాడుతున్న బాలాజీ

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 30: తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తెలిపారు. మంగళవారం ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాలాజీ మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు అమలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనానికి అవసరమైన పథకాలను కూడా ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకర్‌బాబు సూపర్‌సిక్స్ పథకాలపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలాగే పాస్ పుస్తకాలకు, హద్దురాళ్ళపై జగన్ ఫొటోల కోసం కోట్ల రూపాయల ప్రజాధానాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అన్నీ కులాల వారికి సామాజిక న్యాయం చేశారని పేర్కొన్నారు. ఎనిమిది మంది బీసీలకు మంత్రి పదవులు ఇచ్చి పెద్దపీట వేశారని, ఈ విషయం ఎంపీ విజయసాయిరెడ్డి మర్చిపోయినట్లున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పలువురునాయకులు పాల్గొన్నారు.

సిమెంటు బల్లలు బహూకరణ


సిమెంటు బల్లలను అందజేస్తున్న దాతలు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 30 : ఒంగోలు నగరంలోని మినీ స్టేడియంలో జడ్పీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అక్కడకు విచ్చేసే వాకర్స్ కోసం సిమెంట్ బల్లలను బహూకరించారు. మంగళవారం స్థానిక స్టేడియం ఆవరణంలోని వాకింగ్ ట్రాక్ వద్ద వాటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభ్యులు అప్పలరాజు, రాధాకృష్ణ, లింగారెడ్డిలు మాట్లాడుతూ నేటి రోజుల్లో అందరికీ ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగిందన్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు, వృద్ధులు, మహిళలు వందల సంఖ్యలో వాకింగ్ చేయడానికి విచ్చేస్తుండగా, మధ్యలో విశ్రాంతి తీసుకోవడానికి అవసరమైన బల్లలను తాము అందించినట్లు తెలిపారు.

రేపు టంగుటూరులో ఉచిత వైద్య శిబిరం

టంగుటూరు, జూలై 30 : మక్కెన వెంకటకృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చేనెల 1న టంగుటూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు మంగళవారం తెలిపారు. జనరల్ మెడిసిన్ వైద్యుడు ఎం.హనుమంతరావు, ఎముకలు, కీళ్ల వైద్యుడు డి.మహేష్‌కుమార్, మహిళా వైద్యులు దివ్య యాగంటి, విప్రియాంక హాజరవుతారని చెప్పారు. ఉదయం 7 నుంచి 10గంటల వరకు వైద్యపరీక్షలు చేస్తారని తెలిపారు. అవసరమైన మందులు ట్రస్టు ఉచితంగా అందజేస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


నోటుపుస్తకాలను అందజేస్తున్న ఎంఈవో

జరుగుమల్లి (కొండపి), జూలై 30 : నాల్‌సాఫ్ట్ అధిపతి నల్లూరి వెంకటశేషయ్య చేస్తున్న సాయాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరాలని ఎంఈవో బత్తుల నాగేంద్రవదన్ సూచించారు. మండలంలోని చతుకుపాడు ఎంపీ స్కూల్ విద్యార్థులకు వెంకటశేషయ్య అందజేసిన నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బాక్స్‌లను ఎంఈవో పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి. శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు పిడికిటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.360


కొనసాగుతున్న పొగాకు వేలం

టంగుటూరు, జూలై 30 : టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.360 పలికింది. టంగుటూరు, జరుగుమల్లి, సాధువారిపాలెం, వావిలేటిపాడు గ్రామాల రైతులకు సంబంధించిన 947 బేళ్లను అధికారులు మంగళవారం వేలానికి అనుమతించారు. అందులో 844 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.205 నిలకడగా కొనసాగింది. సరాసరి ధర రూ.300.80 దక్కింది. కొనుగోళ్లలో 25 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


పుస్తకాలను అందజేస్తున్న బీజేపీ నేతలు

సింగరాయకొండ, జూలై 30 : కలికివాయి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బీజేపీ నేతలు మంగళవారం పుస్తకాలు, పెన్నులు, విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్‌బాబు, ప్రియా రాధిక, మల్లికార్జున, శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

బీచ్ వద్ద అవాంఛనీయ సంఘటనలు
జరగకుండా చూడాలి : ఎస్పీ



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ దామోదర్

కొత్తపట్నం(ఒం గోలునగరం) జూలై 30: తీరంలోని బీచ్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. మంగళవారం ఆయన కొత్తపట్నంలోని పోలీస్‌స్టేషన్, మెరైన్ పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, రాత్రి బీట్ల పనితీరును నిరంతరం మానిటరింగ్ చేయాలని, చెడునడత కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఎస్ఐ సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా పొందూరు ఎల్ఐ స్కీం

ఏడాది క్రితం విద్యుత్ సామగ్రి చోరీ • పట్టించుకోని వైసీపీ పాలకులు, అధికారులు • సాగుకు దూరమైన ఆయకట్టు రైతులు



స్కీం వద్ద చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్, పక్కనే ఉన్న షెడ్డు

పొందూరు (టంగుటూరు), జూలై 30 : మండలంలోని పొందూరులో ఉన్న శ్రీవెంకటేశ్వర అభ్యుదయ ఎత్తిపోతల పథకం (లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం) నిరుపయోగంగా మారింది. ఏడాది క్రితం పథకానికి సంబంధించిన విద్యుత్ పరికరాలు చోరీకి గురయ్యాయి. అప్పటి వైసీపీ పాలకులు, అధికారులు స్పందించకపోవడంతో రైతులు గత సంవత్సరం సాగుకు దూరమయ్యారు. ఈ ఏడాదైన మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. పొందూరులోని శ్రీవెంకటేశ్వర అభ్యుదయ ఎత్తిపోతల పథకాన్ని 1977లో నిర్మించారు. అప్పటి నుంచి గత ఏడాది వరకూ ఇది పనిచేసింది. దీనికింద 250 మంది రైతులకు సంబంధించిన 530ఎకరాల ఆయకట్టు ఉంది. రైతులు ప్రధానంగా పొగాకు, శనగ, కంది, జొన్న తదితర పంటల సాగు చేస్తూ వచ్చారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని పరికరాలు చోరీ

పొందూరు ఎత్తిపోతల పథకానికి సంబంధిచిన విద్యుత్ పరికరాలు ఏడాది క్రితం చోరీకి గురయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్‌తోపాటు లోపల ఉండే రాగి, ఇతరత్రా వైర్లను దొంగలు అపహరించారు. వీటి విలువ రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకూ ఉంటుందని అంచనా. చోరీ జరగ్గానే స్కీం పర్యవేక్షకుడు పమిడి నాగేశ్వరరావు నేతృత్వంలో రైతులు ఐడీసీ అధికారులకు సమాచారం ఇచ్చారు.

ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ..

ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఏడాదిగా దాన్ని మూలనపడేశారు. వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని చోరీ జరిగిన వెంటనే ఐడీసీ అధికారులను రైతులు కోరగా వారు వింత సమాధానం చెప్పారు. 'ప్రస్తుతం మాకు జీతాలు రావడమే కష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో మమ్మల్ని నమ్ముకొంటే ప్రయోజనం లేదు. విద్యుత్‌శాఖ అధికారులను కలవండి' అని సెలవిచ్చారు. దీంతో ఆయకట్టు రైతులు విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించారు. వారు కూడా సానుకూలంగా స్పందించలేదు. ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది ఐడీసీ వారే కనుక దాని మరమ్మతుల బాధ్యత కూడా వారిదేనని తేల్చి చెప్పారు. దీంతో రైతులు మిన్నకుండిపోయారు. గత ఏడాది మునిలో నీరు కూడా లేకపోవడంతో పంటల సాగును విరమించుకున్నారు. ప్రస్తుతం కొత్తప్రభుత్వం అధికారంలోకి రావడంతో పథకాన్ని వినియోగంలోకి తీసుకువస్తారన్న నమ్మకంతో ఉన్నారు. ఆదిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

ఎస్పీ దామోదర్

ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పోలీసులకు అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది, పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 30: అత్యవసర సమయంలో అందించే సీపీఆర్ విధానం ద్వారా ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ ఈ విధానంపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. మంగళవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలోని పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పోలీసు ఐబ్బందికి బేసిక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ, సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ కార్డియాక్‌అరెస్ట్‌తో ఈ రోజుల్లో ఎక్కువగా మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితులో ఎక్కువగా పోలీస్ వారు తమ విధి నిర్వాహణలో ప్రమాదానికి గురైన వ్యక్తిని నిస్సహాయంగా చూస్తూ ఉండకుండా తమవంతుగా సహాయం చేయడానికి సీపీఆర్ విధానం (కార్డియో పల్మనరీ రెసుస్కిటషన్) అనే ప్రక్రియ ద్వారా బాధితుడిని కాపాడే అవకాశం ఉంటుందన్నారు. విపత్కర సమయంలో సహాయం చేసేందుకు జనం భయపడుతుంటారని, కానీ పోలీసుగా విధుల్లో ఉన్నవారికి ఈ సేవ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. పోలీసులు తమ విధుల్లో అత్యంత ఒత్తిడికి లోనవుతుంటారని, తమ తోటి సిబ్బంది ఇలాంటి ప్రమాదానికి గురైనపుడు సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. డాక్టర్ ఎం.వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారంగా భారతదేశంలో సుమారు నాలుగు నుంచి ఐదు లక్షల మంది సంవత్సరానికి గుండె సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నారని, వారిలో 27 శాతం మంది సడన్‌గా వచ్చే కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోతున్నారని చెప్పారు. అయితే సీపీఆర్ చేయడం ద్వారా గుండెపోటుకు గురైన వ్యక్తిని ప్రాథమికంగా ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. డాక్టర్ భానుమతి మాట్లాడుతూ పోలీసు వారికి ఇటువంటి శిక్షణ అందించడానికి తాము సిద్ధంగా ఉండటంతోపాటు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. హాస్పిటల్ సీవోవో డాక్టర్ హరికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆస్టర్ రమేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి భవిష్యత్‌లో మరెన్నో ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన కల్పించడాని సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం వన్‌టౌన్, టూటౌన్, తాలూకా, ట్రాఫిక్, సీసీఎస్, ఏఆర్, పోలీసు సిబ్బందికి అవగాన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఆస్టర్ రమేష్ సిబ్బంది కోటేశ్వరరావు, ప్రవీణ్, రాజేష్, రవితేజ, అనిల్, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

వయోవృద్ధుల సహాయసంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలి • ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి మస్తాన్ డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సంఘ నాయకులు, దివ్యాంగులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 30 : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంధ విద్యార్థులకు తక్షణమే పాఠ్యపుస్తకాలను ముద్రించి అందజేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాల ముద్రణలో అక్రమాలకు పాల్పడిన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కుమార్‌రాజాపై చర్యలు తీసుకోవాలన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. 2017లో కేంద్రప్రభుత్వం ఒక రూ.1.40కోట్లు వెచ్చించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంధ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ముద్రించే రెండు ప్రింటింగ్ యంత్రాలను కేటాయించిందన్నారు. ఆ యంత్రాలు ప్రింటింగ్ చేసుకునేందుకు వీలుగా బృందావన్ గార్డెన్స్ నాల్గవ లైన్‌లో అప్పటి ముఖ్యమంత్రి, ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు రూ.35లక్షలు కేటాయించి బ్రెయిలీ ప్రిటింగ్ ప్రెస్ భవనాన్ని నిర్మించారని చెప్పారు. 2018 వరకు రాష్ట్రవ్యాప్తంగా పుస్తకాలు అందగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్ళ పాటు ఒక్క విద్యార్థికి పుస్తకాలు అందలేదని ఆరోపించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండెల నాసర్‌జీ మాట్లాడుతూ విభిన్న ప్రతాభావంతుల ఎండీగా ఉన్న కుమార్ రాజా అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వీటన్నింటిపై టీడీపీ కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యుడైన ఎండీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విద్యాసంవత్సరంలో అంధ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ముద్రించి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విజువల్ ఛాలెంజ్ యువజన రాష్ట్ర అధ్యక్షుడు లక్కిపోగు రత్నరాజు మాట్లాడుతూ బ్రెయిలీ ప్రెస్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉన్న హారిక, అక్కడ ఉన్న సిబ్బందిని, విద్యార్థులను అవమానిస్తూ దూషిస్తున్నారని ఆరోపించారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంధ విద్యార్థులు నాగూర్‌బాషా, ఇంటూరి అశోక్‌బాబు, కిషోర్, ప్రసన్నకుమార్, ఏసుదాస్, అనిల్, శివశంకర్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు అందుబాటులో లేకుండా చూడాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



ప్రసంగిస్తున్న కలెక్టర్ అన్సారియా, కమిషన్ సభ్యురాలు ప్రద్మావతి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 30: బాలలు మాదక ద్రవ్యాలు వినియోగించకుండా, అవి వారికి అందుబాటులో లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యాసంస్థలు, ఇతర బహిరంగ ప్రదేశాలలో ఏరూపంలోనూ మాదక ద్ర వ్యాలు వారికి అందుబాటులో లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంద న్నారు. వీటికి అలవాటు పడిన వారిని వాటి నుంచి విముక్తి కల్పించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఆయా విభాగాలపై ఉందని పేర్కొన్నారు. విద్యాసంస్థలు, హాస్టళ్ళు, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యపరంగా, సామాజికపరంగా ఎదరయ్యే అనార్థాలకు వారికి వివరించాలన్నారు జువైనల్ జస్టిస్ చట్టంపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ బయటి పిల్లలతో పాటు విద్యాసంస్థల్లో ఉంటున్న వారు కూడా మాదకద్రవ్యాలను వినియోగిస్తున్న సంఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తుందన్నారు. హాస్టళ్లలోని పిల్లల ప్రవర్తనను వార్డెన్లు నిశితంగా గమనిస్తుండాలని తెలిపారు ఈ దిశగా పర్యవేక్షించాలని ఆయాశాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. బాలలకు డ్రగ్స్ వినియోగం ఉన్నట్లు గుర్తిస్తే వారికి సరైన కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు బాధితుల వివరాలను సంబంధిత శాఖలకు తెలియజేయాలని జీజీహెచ్ వైద్యులను ఆదేశించారు. సమావేశంలో బాలలసంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ, అధికారులు మాధురి, దినేష్‌కుమార్, శ్రీధర్‌రావు, లక్ష్మానాయక్, జగన్నాథరావు, అంజల, అర్చన, నారాయణ, సురేష్‌కుమార్, సుభద్ర, జ్యోతి, అనిత, జేజేబీ సభ్యురాలు మసుద, జిల్లా ప్రొబేషనరీ అధికారి బాలప్రభాకర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఉచితంగా బాలలకు వైద్యసేవలు


చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 30: జాతీయ హెల్త్ మిషన్ రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం మంగళవారం ఒంగోలులోని జీజీహెచ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాల వయస్సులోపు పిల్లల్లో నాలుగు ప్రధాన లోపాలను గుర్తించారు. 4డీ (డిఫెక్ట్, డిసీజెస్, డెఫిషియన్సీ, డవలప్‌మెంటల్ డిలేస్) తోపాటు మరో 30 రకాల సమస్యలను గుర్తించి వాటికి అవసరమైన ఉచితంగా వైద్య సేవలను అందిస్తామని డాక్టర్ జి.భగీరథ వెల్లడించారు. ఈ సెంటర్‌లో 14మంది ప్రత్యేక శిక్షణ పొందిన చిన్నపిల్లల వైద్య సిబ్బంది పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్, దంతవైద్యులు, ఫిజియోథెరపీ, చిన్నపిల్లల మానసిక నిపుణులు, స్పెషల్ ఎడ్యుకేటర్, స్పీచ్‌థెరపీ, పలువురు ఉంటారని తెలిపారు. పుట్టుకతో ఉన్న లోపాలకు ఉచితంగా చికిత్స అందిస్తామని తెలిపారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగాం కింద డీఈఐసీ కేంద్రంలో అందించే వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు.

అవీ..ఇవీ..

అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములు కావాలి


అన్నదానం చేస్తున్న ఈదర హరిబాబు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 30 : జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా పేదల ఆకలి తీర్చడం అభినందనీయమని జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు పేర్కొన్నారు. జనసేన పార్టీ నాయకుడు జడ బాలనాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో ఒంగోలులోని డొక్కా సీతమ్మ క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఈదర ప్రారంభించి మాట్లాడారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. పార్టీ శ్రేణుల సంక్షేమం కోసం చేపట్టిన జనసేన క్రియాశీలక సభ్యత్వాన్ని అందరూ తీసుకోవాలని కోరారు. వచ్చేనెల 5వ తేదీ వరకు సభ్యత్వ నమోదును పెంచినందున పార్టీ శ్రేణులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు(విద్య), జూలై 30: పాలిసెట్-24 రెండు విడతల అడ్మిషన్ల కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మిగిలిపోయిన సీట్లు భర్తీ చేసేందుకు బుధవారం ఒంగోలులోని కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి కంపార్టుమెంటల్‌గా పాసైన వారు, పాలిసెట్ రాయని వారు కూడా స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందేందుకు అర్హులన్నారు. కళాశాలలో ఆటోమొబైల్‌లో 53సీట్లు, సివిల్‌లో 95 సీట్లు, మెకానికల్‌లో 91 సీట్లు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో 49 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన కోరారు.

చౌకధరల దుకాణాల స్థాయి పెంపుపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 30: దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చౌకధరల దుకాణాల వృద్ధి, స్థాయి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీశాఖ సహాయకమంత్రి నిబుబెన్‌జయంతిభాయ్ బంభానియ సమాధానం ఇస్తూ ప్రజాపంపిణీ వ్యవస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి బాధ్యతపై నిర్వహిస్తాయన్నారు. సేకరణ, నిల్వ, రవాణా రాష్ట్రాలకు కేటాయింపు తదితర చర్యలపై భారత ఆహార సంస్థ బాధ్యత తీసుకుంటుందని తెలిపారు. డీలర్లకు కొత్త నైపుణ్యాల అభివృద్ధికి పలు కార్యక్రమాలను రూపొందించేందుకు కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ అన్వేషణలు జరుపుతుందని వివరణ ఇచ్చారు.

పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), జూలై 30: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగ ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్మీ మాజీ అధికారి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయిలో రాణించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో మంచిపట్టు సాధించి ఉన్నతలక్ష్యాలకు చేరుకోవాలని చెప్పారు. విద్యార్థులు నూతన ఆలోచనలతో తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి
• డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), జూలై 30: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబరు 5న నిర్వహించనున్న గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానం చేసేందుకు అర్హులైన ఉపాధ్యాయులు ఆగస్టు 5లోపు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల ఉపాధ్యాయులు మూడు విభాగాల్లో అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలి. అర్హులైన టీచర్లు నేరుగా సంబంధిత ఎంఈవోలకు దరఖాస్తులను సమర్పించాలన్నారు. మండల విద్యాశాఖాధికారులతో ఏర్పాటు చేసిన స్థాయి కమిటీ దరఖాస్తులను పరిశీలించి డివిజన్ స్థాయి కమిటీకి పంపుతారు. తరువాత ఎంపిక చేసిన వాటిని డీఈవో కార్యాలయానికి సమర్పిస్తారు. జిల్లా స్థాయి కమిటీ ఎంపిక చేసిన దరఖాస్తులను పాఠశాల విద్యాకమిషనర్ కార్యాలయానికి పంపుతామని సుభద్ర పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ టీడీపీ నాయకుడు మృతి

మద్దిపాడు, జూలై 30: వెల్లంపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నందిపాడుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు మండవ శ్రీనివాస రావు మృతి చెందారు. ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా ఆయనను మెరుగైన వైద్యం ఒంగోలులోని కిమ్స్‌లో చేర్పించారు. అయితే సోమవారం రాత్రి శ్రీనివాసరావు చనిపోయారు. ఆయన మరణవార్త నందిపాడు గ్రామం, టీడీపీ కార్యకర్తలలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. కాగా మంగళవారం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మండవ రంగారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, నాయకులు చింతల శ్రీనివాసరావు, దేవబత్తిన ప్రసాద్, రావి నరసింహారావు, ఆర్.ఉమామహేశ్వరరావు, శుద్దపల్లి అనిల్ తదితరులు శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

బాలిక వైద్యానికి ఆర్థికసాయం

ఒంగోలు(కల్చరల్), జూలై 30: అనారోగ్యంతో బాధపడుతున్న బాలిక వైద్యానికి సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ మేరకు చెక్కును మంగళవారం ఒంగోలులో ట్రస్ట్ చైర్మన్ షేక్ షహనాజ్, కార్యదర్శి సర్దార్‌బాషా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపట్ల జిల్లా స్టువర్టుపురంనకు చెందిన మేడ్రిగట్టి దుర్గ కుమార్తె చారున్ అనారోగ్యంతో బాధపడుతుండగా ట్రస్ట్ ద్వారా దాత పోలవరపు అనిల్ సహకారంతో ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్‌గా పార్వతి

ఒంగోలు(విద్య), జూలై 30: పాఠశాల విద్యాడైరెక్టర్ కార్యాలయంలో కీలకమైన జాయింట్ డైరెక్టర్ సర్వీసెస్(జేడీఎస్)గా జిల్లాకు చెందిన పయ్యావుల పార్వతి నియమితులయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్యా ముఖ్యకార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యా డైరెక్టర్ హోదాలో ఉన్న పార్వతిని జేడీఎస్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు జేడీఎస్‌గా పనిచేసిన మువ్వా రామలింగంకు పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వానికి రిపోర్టు చేయమన్నారు. ఆయన పనిచేసిన కాలంలో రామలింగం నిర్ణయాలు కొన్ని వివాదాస్పదమయ్యాయి. ఉపాధ్యాయుల సిఫార్సుల బదిలీల్లో రామలింగం కీలకంగా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. ఈ బదిలీల్లో భారీగా నగదు చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. డైరెక్టర్ కార్యాలయంలో రామలింగం సర్వంతానై వ్యవహరించారన్న అపవాదు కూడా ఉంది.

రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టు మృతి


మృతిచెందిన అంజయ్య

మద్దిపాడు, జూలై 30: గుర్తు తెలియని వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం వెంకటరాజుపాలెం సమీపంలో జరిగింది. కొరిశపాడు మండలం దైవాలరావూరుకు చెందిన కొప్పోలు అంజయ్య(68) తన బైక్‌పై ఒంగోలు నుంచి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అంజయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

మద్దిపాడు, జూలై 30: ట్రాక్టర్ ఢీకొని మోటార్‌సైక్లిస్టుకు గాయాలైన సంఘటన రాచవారిపాలెం అడ్డరోడ్డు దగ్గర మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం, రాచవారిపాలెంకు చెందిన లంకెల మల్లిఖార్జున్ మోటార్‌సైకిల్‌పై తన స్వగ్రామం వెళుతుండగా ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో మల్లిఖార్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుని చికిత్స నిమిత్తం ఒంగోలులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 30 : ఒంగోలు, సూరారెడ్డిపాలెం రైల్వేస్టేషన్ల మధ్య గుర్తి తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ పోలీసులు మంగళవారం గుర్తించారు. మృతుని వయస్సు 30-40 మధ్య ఉంటుందని, రైలులో నుంచి జారిపడి మరణించినట్లుగా భావిస్తున్నారు. జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 9440904870కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్రానైట్ ఫ్యాక్టరీల సమస్యను పరిష్కరించాలి

• ఎమ్మెల్యే బీఎన్‌కు వినతి చేసిన యజమానులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, జూలై 30 : సమ్మెలోకి వెళ్తున్న 3సీఎం శ్లాబుల పాలిషింగ్ యూనిట్ ఫ్యాక్టరీ యజమానులు మంగళవారం ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ని ఒంగోలులో కలిశారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకంగాను, ప్రభుత్వ నిర్ణయాలకు విభేదిస్తూ సమ్మెలోకి వెళ్లటంలేదని తెలిపారు. బయ్యర్లు సిండికేట్ అయ్యి శ్లాబుల రేట్లు గణనీయంగా తగ్గించటంతో తమకు గిట్టుబాటు కావడం లేదని చెప్పారు. విధిలేని పరిస్థితుల్లో ఫ్యాక్టరీలు మూసివేస్తున్నామని తెలిపారు. బయ్యర్లతో మాట్లాడి తమ సమస్యను పరిష్కరించాలని విజయ్‌కుమార్‌ని యజమానులు కోరారు. దానికి ఎమ్మెల్యే బీఎన్ సానుకూలంగా స్పందించటంపై యజమానులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సురేష్, మందా రామారావు, ప్రసాదరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సుల రద్దు

దొనకొండ, జూలై 30 : విత్తన, పురుగుమందుల ఎరువుల చట్టాలకు లోబడి వ్యాపారం చేసుకోవాలని, నిబంధనలను అతిక్రమిస్తే సంబంధిత దుకాణాల లైసెన్సుల రద్దుకు సిఫార్సు చేస్తామని జిల్లా అంతర్గత తనిఖీ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.నీరజ చెప్పారు. దొనకొండలోని నాలుగు విత్తనాల దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని విత్తనాలను అధిక ధరలకు అమ్మరాదని, కొనుగోలు చేసిన వాటికి రసీదులు తప్పకుండా ఇవ్వాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, కంపెనీల అనుమతి పత్రాలను తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న విత్తనాల ప్యాకెట్లకు స్టాక్ బుక్‌లో ఉన్న వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, సిబ్బంది విన్నిబాబు, రవితేజ, నిర్వాహకులు గాలయ్య, సురేష్‌లు ఉన్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తికి గాయాలు

వెలిగండ్ల, జూలై 30 : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం వెలిగండ్ల పంచాయతీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరా ల మేరకు... వెలిగండ్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి సుబ్బారెడ్డి తన పొలంలో ట్రాక్టర్‌తో విద్యుత్ స్తంభాన్ని పక్కకు తీయిస్తున్న సమయంలో డ్రైవర్ రివర్స్ గేర్ వేశాడు. దీంతో ట్రాక్టర్ వెనక్కి వస్తూ సుబ్బారెడ్డి పైకి ఎక్కడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సమాచారం ఇవ్వడంతో కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించినట్టు సమాచారం.

ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవానికి
దొనకొండ జడ్పీ పాఠశాల ఎంపిక

దొనకొండ, జూలై 30 : దేశ రాజధాని ఢిల్లీలో ఆగస్టు 15వ తేదీన జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనేందుకు దొనకొండ జడ్పీ పాఠశాల ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు చెప్పారు. ఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో జరిగే ఈ వేడుకల్లో పాఠశాలల నుంచి ఒక ఉపాధ్యాయుడు, ఒక విద్యార్థి పాల్గొననున్నారు. రాష్ట్రం నుంచి మొత్తం ఐదు పీఎంశ్రీ పాఠశాలలు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. అందులో ప్రకాశం జిల్లా తరపున దొనకొండ జడ్పీ పాఠశాల ఎంపిక కాగా గణిత ఉపాధ్యాయుడు షేక్ చాంద్‌బాషా, పదో తరగతి విద్యార్థి హర్షసాయినాథ్‌లు ఎంపికైనట్లు తెలిపారు.

చీరాల బ్యాంకులో సీఐడీ విచారణ

చీరాలటౌన్, జూలై 30 : చీరాల పట్టణంలోని ఓ బ్యాంకులో మంగళవారం సీఐడీ విచారణ చేపట్టింది. ఈ బ్యాంకులో ఓ ఉద్యోగి రూ.100 గ్రాముల గోల్డ్‌ను అపహరించి, బంధువుల పేరుతో తిరిగి రూ.కోటికి పైగా రుణం పొందారు. అయితే ఆ బ్యాంకుకు సంబంధించిన ఇద్దరు మేనేజర్‌లు ఆడిటింగ్ నిర్వహించగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. దీంతో వారు విషయాన్ని సీఐడీకి అప్పగించడంతో అధికారులు మంగళవారం విచారణ నిర్వహించారు. ఈక్రమంలోనే సుమారు ఆరుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

2న భైరవకోనలో షాపుల లీజు వేలం

సీఎస్‌పురం(పామూరు), జూలై 30 : మండలంలోని అంబారం కొత్తపల్లి గ్రామంలోని భైరవకోన ఆలయం పరిధిలో షాపుల నిర్వహణకు ఆగస్టు 2వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లీజు కాలం పరిధి 2025 మే 31వ తేదీ వరకు ఉంటుందని, ఫ్యాన్సీ ఐటమ్, ఫొటోలు, సీడీ లు, అమ్ముకొనేహక్కు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనే లీజు హక్కులకు వేలం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

వెంకటేశ్వరకాలనీలో ఉద్రిక్తత

మామ, కోడలి మధ్య ఘర్షణ
మామ కూతురి ఇంటికి వెళ్లి బంధువుల వాగ్వివాదం
అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఏఎస్సై
ఆయన దాడిచేశారని రోడ్డెక్కిన కోడలి బంధువులు
ఎస్సై చొరవతో ఆందోళన విరమణ
పరస్పర కేసులు నమోదు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ, జూలై 30 : సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో సోమవారం రాత్రి మామ, కోడలు ఘర్షణ పడ్డారు. కుటుంబ తగాదా కాస్తా చివరకు పోలీసుల వైపు మళ్లింది. ఎస్సై టి.శ్రీరాం కథనం మేరకు.. కుటుంబ కలహాల నేపథ్యంలో మామ మాలకొండయ్య, కోడలు సుకన్య మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా మాలకొండయ్య కర్రతో సుకన్యను కొట్టడంతో కంటి కింద రక్తగాయమైంది. దీంతో ఇరువురూ రాత్రి 11 గంటల సమయంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడానికి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు ఆసుపత్రికి వెళ్లాలని సూచించగా ఉదయాన్నే మళ్లీ వస్తామని వెనుదిరిగి ఇంటికి చేరుకున్నారు. సుకన్యపై దాడి విషయాన్ని తెలుసుకొని మంగళవారం ఉదయం ఆమె బంధువులు వెంకటేశ్వరకాలనీకి చేరుకున్నారు. మాలకొండయ్య కోసం వెతుకుతూ కాలనీలోని ఆయన కుమార్తె ఇంటికి వెళ్లారు. అక్కడ ఆమెకు, సుకన్య బంధువుల మధ్య వివాదం జరిగింది. దీంతో ఆమె విషయాన్ని తన భర్త మురళికి ఫోన్ చేసి చెప్పింది. ఆయన వెంటనే డయల్ 100కు ఫోన్ చేశారు. దీంతో పోలీసులు వెంకటేశ్వరకాలనీకి చేరుకున్నారు. ఆసమయంలో పోలీసుల వెంట ఉన్న మురళిపై సుకన్య బంధువులు దాడికి ప్రయత్నించారు. అక్కడే ఉన్న ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా వారించే క్రమంలో కొందరిని చొక్కాపట్టుకొని పక్కకు లాగారు. పోలీసుల ముందే దాడికి పాల్పడితారా అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇరువర్గాల వారికి సర్దిచెప్పి తిరిగి స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు ఒకవైపు ఒత్తాసు పలుకుతున్నారని, ఏఎస్సై మహబూబ్‌బాషా తమపై దాడిచేశా రని ఆరోపిస్తూ సుకన్య బంధువులు వెంకటేశ్వర కాలనీ ఎదురు ఉన్న ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. ఏఎస్సైను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీరాం హుటాహుటిన అక్కడికి చేరుకొని సుకన్య, వారి బంధువులతో మాట్లాడారు. స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తానని సర్దిచెప్పారు. దీంతో శాంతించిన వారు ధర్నాను విరమించారు. అనంతరం సుకన్య, మాలకొండయ్యను కందుకూరు ఏరియా ఆసుపత్రికి పంపించారు. ఆసుపత్రిలో ఇరువురూ ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు పరస్పర కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలి

• సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 30: జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్ల నిధులు కేటాయించాలని, వెనుకబడిన జిల్లాల జాబితాలో జిల్లాను చేర్చినట్లు కేంద్ర ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీపీఎం జిల్లా కమిటీ తీర్మానించింది. మంగళవారం ఒంగోలులోని సుందరయ్యభవన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్ మాట్లాడారు. మూడు జిల్లాల నుంచి మూడు ప్రాంతాలను కలిపి ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి జిల్లా వెనుకబడే ఉందని, పాలకపక్షాలు ఏవి కూడా జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో వ్యవహరించలేదని విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని, రామతీర్థం, పాలేటిపల్లి, సంఘమేశ్వర రిజర్వాయర్లు పూర్తి చేయాలని, కనిగిరి నిమ్జ్, దొనకొండ పారిశ్రామిక కారిడర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామిగా ఉన్నందున జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను సాధించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీవీకొండారెడ్డి సమావేశంలో ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐఎంఎల్ నాయకురాలు లలితకుమారి, కిసాన్‌మోర్చా కన్వీనర్ చుండూరి రంగారావు, పలు సంఘాల నాయకులు సుబ్బారావు, రఫీ, పేరయ్య, మారెళ్ళ సుబ్బారావు, ఎస్‌కే.మాబు, జి.రమేష్, బాలకోటయ్య, వినోద్, ముసలారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటికి రూ.4లక్షలు కేటాయింపు హర్షణీయం

సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం అభినందనీయం • టీడీపీ మండలాధ్యక్షుడు మనోజ్‌కుమార్



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

నాగులుప్పలపాడు, జూలై 30: పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద మనస్సుతో ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల నిధులు కేటాయించడం అభినందనీయమని టీడీపీ మండలాధ్యక్షుడు మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. అలాగే ఇల్లు లేని నిరుపేదలకు 3 సెంట్లు స్థలాన్ని ప్రకటించటం హర్షణీయమని చెప్పారు. మంగళవారం అమ్మనబ్రోలులోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పేదల పట్ల సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్త శుద్ధి మరో మారు రుజువైదన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు కేటాయించటంతో పాటు ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల నిధులను అందిస్తామని పేర్కొనడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. తద్వారా ప్రతి పేదవాని సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అలాగే రూ.4 వేలకు పింఛను పెంపుపై లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. రాజధానిగా అమరావతి కోసం కేంద్ర రూ.15 వేల కోట్ల నిధులను కేటాయించారని వివరించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రజావ్యతిరేక పాలన కొనసాగించారని, వేల కోట్ల రూపాయలు దోపిడీ చేశారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక, ఇనుము, సిమెంట్ ధరలు పెరగడంతో ఇల్లు నిర్మించుకోవడం కష్టతరంగా మారిందన్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని సీఎం చంద్రబాబు పేదలకోసం పలు నిర్ణయాలు తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల కోశాధికారి మెట్టు సుబ్బయ్య నాయుడు, సంతనూతలపాడు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు స్వర్ణ కిషోర్‌బాబు, గద్దే త్యాగరాజు, బూత్ ఇన్‌చార్జి సిరిమళ్ళ ఏలియా, శ్యామ్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయిని హత్య కేసులో వీడిన మిస్టరీ

కేబుల్ టెక్నీషియన్‌ను పట్టుకున్న పోలీసులు
డబ్బు ఆశతోనే ఘాతుకానికి పాల్పడినట్లు అంగీకరించిన నిందితుడు
వివరాలు వెల్లడించిన డీఎస్పీ జగదీష్ నాయక్

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూలై 30 : సుమారు పది రోజులుగా చర్చనీయాంశంగా మిగిలిన విశ్రాంత ఉపాధ్యాయిని హత్య కేసులో మిస్టరీ వీడింది. పలుమార్లు విచారించినా అందీఅందనట్లు జారుకున్న నిందితుడు కేబుల్ టెక్నీషియన్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ జగదీష్ నాయక్ వివరాలు వెల్లడించారు. అమరావతికి చెందిన పిల్లి లలితమ్మ(78) అలియాస్ ధర్మవరపు లలిత తెలుగు ఉపాధ్యాయిని. భర్త వెంకట రామారావు కూడా విశ్రాంత ఉపాధ్యాయుడు. చాలాకాలం కిందటే ఆయన మృతి చెందారు. వృత్తి రీత్యా చాలాకాలంగా దంపతులు ఈపూరుపాలెం బూదాటివారి వీధిలోని జెండా చెట్టు వద్ద నివాసం ముంటూ స్థిరపడ్డారు. ఈనేపథ్యంలోనే 2004లో స్థానిక బాయ్స్ హైస్కూల్‌లో ఉద్యోగ విరమణ పొంది అప్పటి నుంచి ఆమె ఒంటరిగా ఉంటున్నారు. పెద్ద కుమారుడు కల్యాణ్ ఈశ్వరబాబు ఫ్రాన్స్‌లో ఉద్యోగం, చిన్న కుమారుడు సామ్రాట్ కాలిఫోర్నియాలో ఉద్యోగం, కుమార్తె దోష వర్షిత విజయవాడలో నివాసముండగా, ఆమె భర్త అక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. లలితమ్మ చుట్టుపక్కల వారితో ఎంతో మర్యాదగా ఉండేవారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. ఎంతో ఉన్నతంగా ఉన్న ఈమె ఒంటరిగా ఉండే సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ నెల 23వ తేదీన మధ్యాహ్న సమయంలో సమీపంలోని తోటవారి పాలెం వీవర్స్ కాలనీకు చెందిన కేబుల్ టెక్నీషియన్ పోసా ఆంజనేయులు టీవీ రిపేర్ చేసేందుకు ఇంట్లోకి వచ్చాడు. ఆ సమయంలో ఒంటరిగా కూరగాయలు కోసుకుంటూ ఉన్న లలితమ్మను చూశాడు. ఆమె వద్ద డబ్బు అధికంగా ఉంటుందని దురాశ చెందాడు. దీంతో ఇంట్లో ఉన్న కత్తితో ఆమెపై దాడిచేసి గొంతులో కత్తి దింపి హత మార్చాడు. ఇంట్లో అన్ని ప్రాంతాల్లో వెదకగా రూ.9500 మినహా నగదు కనిపించలేదు. వాటితోనే సర్దుకుని జారుకున్నాడు. గ్రామంలోనే దర్జాగా తిరుగుతూ టీవీ మరమ్మతులు చేసుకుంటూ ఉన్నాడు.

పోలీసులు రంగప్రవేశం

హత్య విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ తుషార్ డూడీతో సహా సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు అందరూ రంగంలోకి దిగారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. 100 మందికి పైగా విచారణ చేశారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఎంతో ఉన్నతంగా అభివృద్ధి చెందిన ప్రాంతంలో కనీసం ఒక్క సీసీ కెమెరా కూడా లేకపోవడంతో హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. దీంతో సుమారు 40 మంది పోలీసులు రంగంలోకి దిగి ఆధారాలు సేకరించే పనిలో సుమారు 10 రోజులుగా మునిగి పోయారు.

నిందితుడిని గతంలోనే పలు మార్లు విచారణ

నిందితుడు పోసా ఆంజనేయులు అతనితో కలిసి పనిచేసే అశోక్‌ను పలుమార్లు పోలీసులు విచారణ చేశారు. ఈక్రమంలో ఆంజనేయులు అందీఅందనట్లు జారుకుంటూ పోలీసుల దృష్టిని మరలించాడు. అయితే తిరిగి తిరిగి కేసు మళ్లీ ఇతని చుట్టే తిరుగుతుండడంతో అతడు ఆ రోజు ధరించిన డ్రెస్‌ను సీజ్ చేశారు. వాటిని పరీక్షించారు. అవి అప్పటికే ఉతికి ఉండడంతో పోలీసులకు పరిస్థితి అంతుబట్ట లేదు. ఎట్టకేలకు వీటి శాంపిల్స్ కలెక్ట్ చేసి రెండు దఫాలుగా ల్యాబ్‌కు పంపగా నిర్ధారణ జరిగింది. వెంటనే మంగళవారం నిందితుడుని అరెస్ట్ చేసి, ఘటనకు పాల్పడిన కత్తి, వాహనం, డ్రెస్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసులను, ఎస్‌బీ, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక



జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో సెలక్టర్లు

మేదరమెట్ల, జూలై 30: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 19 క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు పీడీసీఏ ప్రధాన కార్యదర్శి కారుసుల నాగేశ్వరరావు తెలిపారు. కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలోని ఆర్ఎస్‌సీఏ క్రికెట్‌స్టేడియంలో మూడు రోజులపాటు 29 మంది క్రీడాకారులకు పోటీలు నిర్వహించి వారిలో 16 మందితో కూడిన జట్టును మంగళవారం ఎంపిక చేశామన్నారు. మరో నలుగురిని స్టాండ్‌బైగా తీసుకున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 1వ తేదీ నుంచి మంగళగిరి పేరెచర్ల నరసరావుపేటలో నిర్వహించే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీసీఏ ఉపాధ్యక్షుడు జవహర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా క్రికెట్ జట్టుకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు పోటీల్లో మంచి ప్రతిభ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో జీజీ హనుమంతరావు, కొల్లా మధు, కోచ్ వంశీ, ఏసీఏ కోచ్‌లు సుధాకర్ చంద్రశేఖర్, బాబూరావు పాల్గొన్నారు.

ముగిసిన వైద్యశిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

కొత్తపట్నం(ఒంగోలు నగరం) జూలై 30: కొత్తపట్నంలో ఐదు రోజుల పాటు జరిగిన శ్రీనాంచారమ్మ తల్లి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఒంగోలులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని మంగళవారం ఆసుపత్రి అధినేత డాక్టర్ వంశీకృష్ణ మంగళవారం ముగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు సాయంత్రం ఆరు గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ శిబిరాన్ని ప్రతి రోజు నిర్వహించి తిరునాళ్ళకు వచ్చిన భక్తులకు వైద్య సేవలు అందించామన్నారు. దాదాపు 500 మంది భక్తులకు వైద్య సేవలను అందించినట్లు చెప్పారు. వైద్యులు శాంతకుమారి, కొప్పుల పల్లవ్ వైద్య సేవలు అందించారన్నారు. భక్తులకు వైద్య సేవలు అందిటచటంతో పాటు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేసినట్లు చెప్పారు.

పశు పథకాలను సద్వినియోగించుకోవాలి



పశుగ్రాస విత్తనాలను అందజేసిన జేడీ బేబీరాణి

చీమకుర్తి, జూలై30 : పశు పోషకులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను, సబ్సిడీలను సద్వినియోగపరచుకోవాలని పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి కోరారు. మండలంలోని చంద్రపాడు గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంర్ధకశాఖ సంయుక్తంగా మంగళవారం ఉచిత గర్భకోశవ్యాధుల చికిత్స వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జేడీ బేబీరాణి, డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ రవి, డీడీ రమేష్, ఏడీ లావణ్యకుమారి రైతులకు పశువుల్లో వచ్చే గర్భకోశవ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పశుగ్రాసవిత్తనాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు మనురూప్, ప్రశాంతి, చిరంజీవి, ప్రతాపరెడ్డి, కృపారావు, టీడీపీ నాయకులు దొడ్డా వెంకట్రావు, దొడ్డా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.2.44 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 30 : మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆరాధన మహోత్సవాలు సందర్భంగా రూ.2,44,650 ఆదాయం వచ్చినట్లు చైర్మన్ చినఆదినారాయణ, ఈవో గిరిరాజు నరసింహబాబు మంగళవారం తెలిపారు. మహాప్రాకార నిర్మాణానికి రూ.35,143 విరాళంగా వచ్చినట్లు పేర్కొన్నారు.


నీరు లేక గిడచబారిన పత్తి

ప్రశ్నార్థకంగా ఖరీఫ్ సాగు

● నీరు లేక ఎండుముఖం పడుతున్న పత్తిపైరు ● అదును దాటిన కానరాని వానజాడ ● బీళ్లుగా మారిన భూములు

పెద్ద దోర్నాల, జూలై 30: ఆగస్టు మాసం వస్తున్నా చేసేందుకు పనులు లేక, వ్యవసాయ భూములు బీళ్లుగా మారుతున్నాయి. దీంతో మండల రైతాంగం గుబులు చెందుతోంది. ఇప్పటికే సాగు చేసిన పత్తి పైరు కళ్లముందే ఎండుముఖం పడుతుండడంతో రైతులు కుమిలి పోతున్నారు. మరోవైపు మడుల్లో పోసిన మిరప నారు వారం పదిరోజుల్లో ఏతకు రానుంది. దీంతో ఏం చేయాలో పాలు పోక ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలోని పశ్చిమ ప్రాంతం దోర్నాల మండలంలో నేటికీ పదునైన వాన కురవలేదు. వ్యవసాయ భూములన్నీ దుక్కులు చేసి ఎరువులు వేసి, గొర్రు, గుంటకలు తోలి సాగుకు సిద్ధం చేసుకున్నారు. అయితే మరో వైపు వర్షాభావం రైతుల సహనానికి పరీక్ష పెడుతోంది. ఆకాశంలో మబ్బులు ఊరించి ఉసూరు మనిపించాయి. కనీసం చెట్టు క్రింద కూడా తేమ కాలేదు. మరో వైపు పలు జిల్లాలో వరదలు ముంచెత్తుతుంటే ఇక్కడ తాగేందుకు నీళ్ల లభించడం లేదని రైతులు వాపోతున్నారు. వర్షాభావంతో బోరుబావులు ఒట్టిపో యాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో గ్రామాల్లో వాడుక నీటి కోసం రోజూ యుద్ధమే చేయాల్సి వస్తోంది. ట్యాంకర్లపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. వెంటాడుతోన్న వర్షాభావం తో జలకళ లేక చెరువులన్నీ బీటలు వారాయి. సాధారణంగా వాతావరణం అనుకూలిస్తే ఈ పాటికి పొలాలన్నీ పచ్చని పైర్లతో కళకళ లాడుతుండేవి. రైతులు, రైతు కూలీ లు ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో ఉండేవారు. పను ల్లేక కూలీలు ఇంటికే పరిమితమయ్యారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వెలి బుచ్చారు. కొన్ని గ్రామాల్లో సమీప నల్లమల అటవీ ప్రాంతంలో లభించే మాడపాకులు సేకరిస్తూ, ఆ ఆకులను కొనుగోలు చేసి విస్తర్లుగా తయారు చేసి కుటుంబ పోషణ చేసుకుంటున్నారు. ప్రధానంగా చెంచు గిరిజనులకు మాడపాకులు కొంత తోడ్పాటునిస్తున్నాయి. వానదేవుడు కరుణ కోసం రైతాంగం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

మండలంలో ఇప్పటికే 700 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఆ పైరు పంట దశకొచ్చింది. బెట్టకు పూత పిందె రాలుతోందని రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన చిరుజల్లులకు పదును కాకపోయినా పలువురు రైతులు కంది విత్తారు. అయితే తర్వాత వానలు కురవక పోగా ఎండలు మండిపోతూ వడగాలి వీస్తోంది. ఉన్న పదును కూడా ఆవిరై కందులు సరిగ్గా మొలకెత్తవని బాధపడుతు న్నారు. ఇప్పటికైనా సరైన వాన కురిస్తే కొంత మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వరదనీళ్లు సముద్రం పాలు

ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం చుట్టూ అడవులున్నా, సమీపంలోనే కృష్ణానది పారుతున్నా ఏటికేడు కరువు తాండవిస్తోంది. ప్రకృతి వనరులను సద్వినియోగపర్చు కుంటే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం చేసుకో వచ్చునేది మేధావులు అభిప్రాయపడతున్నారు. ఈ క్రమంలోనే రూపుదాల్చుకున్నదే వెలిగొండప్రాజెక్టు నిర్మాణం. కాగా నిర్మాణం పూర్తికి జరిగే జాప్యానికి ఏ కారణాలే మైనప్పటికీ, ప్రజలు భారీగా నష్ట పోతున్నారు. వందల కోట్లను కోల్పోతున్నారు. రాజకీయ కోణాలు పక్కన పెడితే నిర్మాణం పూర్తయి ఉంటే ప్రస్తుతం వచ్చిన వరదనీరు


ఎండిన చెరువు

సముద్రం పాలు కాకుండా నల్లమల రిజర్వాయర్లకు చేరేవని, బోరుబావులన్నింటికీ పుష్కలంగా భూగర్భ జలాలు అందేవని రైతులు చెబుతున్నారు. తద్వారా తాగునీరు, సాగునీరు లభించేవని, రైతులకు చేతినిండా పనులుండేవని పేర్కొంటున్నారు.వ్యవసాయ భూములన్నీ పచ్చని కళను సంతరించుకునేవని ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడంపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి


ఎస్ఎండీ యూసఫ్

ఎర్రగొండపాలెం, జూలై 30 : ఎర్రగొండపాలేనికి చెందిన టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ యూసఫ్ (67) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కొన్ని నెలలుగా మెదడు సంబధిత వ్యాధికి హైదరాబాద్‌లో శస్త్రచికిత్స చేయించుకున్నారు. సోమవారం రాత్రి అస్వస్థతగా ఉండడంతో ఎర్రగొండపాలెంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందారు. యూసఫ్ 1983 నుంచి టీడీపీలో క్రియాశీలక పదవుల్లో ఉన్నారు. 1994 నుంచి 1999 మధ్య రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టరుగా ఉన్నారు. సీనియర్ టీడీపీ నాయకులు యూసఫ్ మృతితో ఎర్రగొండపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బుధవారం స్థానిక ఖబర్‌స్థాన్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ట్యాంకర్ కింద పడి వ్యక్తి మృతి

ఎర్రగొండపాలెం, జూలై 30: ట్రాక్టర్ ట్యాంకర్ కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మండలంలోని కొలుకుల గ్రామం వద్ద మంగళవారం చోటుచేసుకొంది. చిన్నకొలుకుల గ్రామానికి చెందిన గజ్జెల చెన్నయ్య (35) ద్విచక్రవాహనం పై దద్దనాల ఆంజనేయస్వామి దర్శనం చేసుకొని, తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా కొలుకులకు చెందిన ట్రాక్టర్ ట్యాంకర్ ఎదురుగా వస్తోంది. దీంతో ట్యాంకర్‌ను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడింది. ట్యాంకర్ టైరు చెన్నయ్య పై నుంచి వెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి చిన్న బ్రహ్మయ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

బేస్తవారపేట, జూలై30: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై బేస్తవారపేట జంక్షన్ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. సుమారు(45) సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి నాలుగు రోజులుగా ఈ ప్రాంతంలో తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. టీ తాగి రోడ్డు దాటుతుండగా పులివెందుల నుంచి ఖమ్మం జిల్లాకు పచ్చిమిర్చి లోడ్‌తో వెళ్తున్న బోలోరో వాహనం ఆయన్ను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టాపర్లకు సన్మానం

గిద్దలూరు, జూలై 30 : రాచర్లలోని మోడల్ స్కూల్, కేజీబీవీలలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లలో మంచి మార్కులు సాధించిన టాపర్లను మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి ఎ.చంద్రమౌళి, ఎంఈవోలు శివకోటేశ్వరరావు, గిరిధరశర్మ, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ సుధాకర్, మాలకొండమ్మ, రిటైర్డ్ హెచ్ఎం ఎం.రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

అధికారులతో సమీక్షలో ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, జూలై 30: ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాలల్లోని గ్రామాలకు రూ.25కోట్ల సీసీ రోడ్డులు వేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అధికారులకు సూచించారు. మంగళవారం మార్కాపురంలోని తన కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, పశువైద్యాశాఖధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లకు మహర్దశ పట్టనుందన్నారు. అస్తవ్యాస్థంగా వున్న రోడ్డుల మరమ్మతులకు, నూతనంగా కావాల్సిన సీసీ రోడ్డులకు ప్రణాళికబద్ధంగా ప్రతి పాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నియోజకవర్గంలో అధ్వానంగా వున్న ఆర్అండ్‌బీ రోడ్డులను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. మినీ గోకులాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో


అధికారులతో సమీక్షిస్తున్న ఎరిక్షన్‌బాబు

పీఆర్ డీఈ మద్దుల సుబ్బారెడ్డి, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

సమాజ పోకడల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 30: సమాజంలో పెరిగిపోతున్న అనేక రకాల ఉపద్రువాలు, ఉన్మాదాల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని న్యాయవాది పైడిమర్రి రామచంద్ర అన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక రెడ్డి డిగ్రీ మహిళా కళాశాలలో మండల న్యాయ సేవాధికార సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది రామచంద్ర మాట్లాడుతూ మానవ శరీరంలోని అవయవాలను అమ్ముకోవడానికి వెట్టిచాకిరులు చేయించడానికి మానవులను అక్రమంగా రవాణా చేసే గ్యాంగ్‌లు సమాజంలో పనిచేస్తున్నాయన్నారు. మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అటువంటి వారు తారసపడితే


మాట్లాడుతున్న న్యాయవాది రామచంద్ర

తల్లిదండ్రులకు తెలిపి సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది రామయ్య, కరస్పాండెంట్ సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : రాజ్యాంగం ప్రకారం మనకు లభించిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోకుండా సక్రమమార్గంలో పయనించి బంగారు భవిష్యత్తును ఏర్పరచుకోవాలని న్యాయవాది మోడి పిచ్చయ్యయాదవ్ అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక సాయిచైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మంచిని మాత్రమే గ్రహించి చెడు జోలికి పోకూడదని పేర్కొన్నారు. సంఘ వ్యతిరేకశక్తులు మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా మసులుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది రైడర్‌బాబు, కరస్పాండెంట్ రంగస్వామిరెడ్డి, పారాలీగల్ వలంటీర్ మధుసూదన్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ రంగారావుకు ఎమ్మెల్యే ముత్తుముల పరామర్శ


రంగారావును పరామర్శిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 30 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పల్నాడు జిల్లా వైద్యవిధాన పరిషత్ హాస్పిటల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రంగారావును ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పరామర్శించారు. కర్నూలులోని మెడికోవర్ ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతుండగా మంగళవారం అక్కడికి వెళ్లి పరామర్శించారు. రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను, కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట గిద్దలూరు టీడీపీ మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు చేరెడ్డి జయరామిరెడ్డి, విశ్వనాథరెడ్డి కుసుమాల మహనందియాదవ్, మండ్ల శేఖర్, దేశబోయిన వెంకటరాజు, తదితరులు ఉన్నారు.

పాతవిద్యుత్తు స్తంభాలు చోరీ

ఎర్రగొండపాలెం, జూలై 30 : మండలంలోని అమానిగుడిపాడు విద్యుత్తు ఉపకేంద్రంలో నిల్వ ఉంచిన 104 పాత విద్యుత్తు స్తంభాలు చోరీకి గురయ్యాయని ఏఈ అల్లూరయ్య మంగళవారం సాయంత్రం తెలిపారు. ఎపీ ట్రాన్సుకోకు చెందిన పాత విద్యుత్తు స్తంభాలు అమానిగుడిపాడు ఉపకేంద్రంలో నిల్వ ఉంచారని తెలిపారు. ఈ ఘటనపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ అల్లూరయ్య తెలిపారు. బరువైన ఈ స్తంభాలు ఎప్పుడు చోరీకి గురయ్యాయో, ఎలా పోయాయో విచారణలో తేలాల్సి ఉంది.

అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఫిర్యాదు


ప్రభుత్వ భూమిలోని అక్రమ నిర్మాణం

పొదిలి, జూలై 30 : నగర పంచాయతీ పరిధిలోని తోళ్ల మడుగు వాగులో నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని దసరి రవిచంద్ర ఆర్అండ్‌బీ డీఈఈ కృష్ణకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 479లో ప్రభుత్వ రోడ్డును ఆక్రమించి యోగయ్య అనే వ్యక్తి రేకుల షెడ్డు వేశాడన్నారు. వర్షం పడినప్పుడు దాసరి రవిచంద్ర, ఝాన్సీరాణికిల సర్వే నెంబరు 396-7లో ఉన్న 0.96 సెంట్ల భూమి కోతకు గురువుతుందన్నారు. అంతేకాకుండా తమ భూమిలోకి వెళ్లే రహదారిని ఆక్రమించి మట్టిపోశాడని తెలిపారు. ఇదేమని అడిగితే నిర్లక్ష్యపు సమాదానం చెబుతున్నాడని రవి ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన యోగయ్యపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును తొలగించి తమకు న్యాయం చేయాలని కోరారు.

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

పొదిలి, జూలై 30 : కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎర్రగొండపాలెం ఏడీఏ నీరజ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అనుమతిలేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు జరిపితే చర్యలతోపాటు అపరాధం విధిస్తామన్నారు. మంగళవారం పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్స్, బిల్లుబుక్, స్టోర్ ఆఫ్‌సప్లై, స్టాకు వివరాలను పరిశీలించారు. అనుమతులు లేకుండా, సరైన పత్రాలు లేకుండా ఉన్న రూ.2.91 లక్షల విలువైన విత్తనాలను గుర్తించి సీజ్ చేశామన్నారు. వాటికి సరైనపత్రాలు సమర్పించిన తరువాత మాత్రమే అమ్మకాలు జరపాలన్నారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. కనుక రైతుకు నష్టం కలిగించే కల్తీ విత్తనాలు అమ్మరాదని తెలిపారు. ఈ తనిఖీలో వ్యవసాయాధికారి షేక్ జైన్‌లుబ్దీన్ పాల్గొన్నారు.

మోసంపై కేసు నమోదు

మార్కాపురం, జూలై 30: తనవద్ద పనిచేస్తూ రూ.8 లక్షలు మోసానికి పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ సమాచారం మేరకు పెప్సీ కంపెనీ ప్రతినిధి అయిన జీసుప్రియ వద్ద డి.ప్రసాద్ సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కంపెనీకి సంబందించిన ప్రొడక్ట్‌లను రిటైల్ షాప్‌లకు అమ్ముతున్నాడు. అమ్మకాలకు సంబందించిన విషయంలో రూ.8 లక్షలను మేనేజర్ షాపుల యజమానుల నుంచి వసూలు చేసుకుని తన వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు గుర్తించారు. డబ్బులు ఇవ్వమని అడిగితే తనకు సంబందంలేదని చెబుతున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నారు.

నకిలీ పట్టాలపై కేసు నమోదు

మార్కాపురం, జూలై 30: తనకు ఇవ్వాల్సిన బాకీ అడిగితే నకిలీ పట్టాలు ఇచ్చి మోసం చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పట్టణ పోలీసుల కథనం మేరకు కొండారెడ్డి కాలనీలో నివాసముండే ఆర్.సరిత అదే ప్రాంతానికి చెందిన రెడ్డెపోగు గురవయ్య వద్ద కంభం పట్టణంలో ఒక స్థలం కొనేందుకు రూ.25 లక్షలు ఇచ్చింది. అక్కడ కొన్న స్థలం హైవే రోడ్డులో పోయినందున మార్కాపురంలోని సాయిబాబా గుడివద్ద మరొక స్థలాన్ని రాయించి ఇచ్చాడు. కానీ ఆ స్థలం కూడా వేరే వారి పేరుపై ఉందని తెలుసుకున్న బాధితురాలు ప్రశ్నించగా కొండేపల్లి రహదారిలో ఒక పట్టాను ఇచ్చాడు. అదీ నకిలీ పట్టా తెలియడంతో మోసపోయానని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై రెహమాన్ తెలిపారు.

పట్టువస్త్రాల కొనుగోలుపై అవగాహన అవసరం

సిల్క్‌బోర్డు ఫీల్డ్ అసిస్టెంట్ అలీ జిన్నా

మార్కాపురం వన్‌టౌన్, జూలై 30: అసలైన పట్టును గుర్తించి వస్త్రాలు కొన్నప్పుడే పట్టు రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేల మంది గిరిజనుల కుటుంబాలకు సరైన ఉపాధి దొరుకుతుందని సిల్క్‌బోర్డు ఫీల్డ్ అసిస్టెంట్ అలీ జిన్నా అన్నారు. పట్టువస్త్రాలను కొనుగోలు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కేంద్ర జౌళిమంత్రిత్వ శాఖ, కేంద్ర సిల్క్ బోర్డ్‌వారి సిల్క్‌మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్‌కు చెందిన కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో శ్రీసాధన డిగ్రీ కళాశాలలో


అవగాహన కల్పిస్తున్న అలీ జిన్నా

మంగళవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా అలీజిన్నా మాట్లాడు తూ.. భారతదేశ పట్టుకు మంచి విలువ ఉందని అన్నారు. మంచి పట్టును గుర్తిస్తే భవిష్యత్ తరాలకు మంచి పట్టును అందించవచ్చన్నా రు. ఈ సందర్భంగా పట్టు వస్త్రాలు కొనడంలో తీసుకోవాల్సిన జాగ్రత్త లు, వివిధ రకాల పట్టు దారాలు గుర్తించే విధానం అసలు, నకిలీ పట్టు గుర్తించే శాస్త్రీయ విధానా లను ప్రయోగ పూర్వకంగా విద్యార్థులతో నేరుగా చేయించి నిరూపించారు. కార్యక్రమంలో సిల్క్ బోర్డు వైసీఎం రఘుపతి, కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్, క్యాంపస్ శిక్షణా విభాగం సమన్వయకర్త పవన్ కుమార్, పరిశోధన విభాగం సమన్వయకర్త శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

భూసార పరీక్షలతో మంచి దిగుబడులు


పొలంబడిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

గిద్దలూరు టౌన్, జూలై 30 : భూసార పరీక్షలతో భూమి సాంద్రతను తెలుసుకుని తద్వారా పంటలను సాగు చేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయా ధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సంజీవరాయునిపేట గ్రామంలో కందిపంటలో పొలంబడి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికర ఆదాయం, నాణ్యమైన దిగుబడి పొందవచ్చన్నారు. సహజసిద్ధ వనరులతో పంటలు సాగు చేయడం, భూసార పరీక్షలను బట్టి ఎరువులను వినియోగించడం, విత్తనశుద్ధితో చీడపీడలను నివారించడం వంటివి చేయాలన్నారు. రసాయన పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. మట్టి నమూనాలు ఏ విధంగా తీయాలి, విత్తనశుద్ధి, మొలకశాతం ఏ విధంగా చూడాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రవి, శ్రీకాంత్, రవిచంద్రుడు పాల్గొన్నారు.

డ్రైవర్లకు, క్లీనర్లకు వేతనాలు పెంచాలి


మాట్లాడుతున్న శ్రీనివాసులు

గిద్దలూరు, జూలై 30 : స్కూలు బస్సు డ్రైవర్లు, క్లీనర్లకు వేతనాలను వెంటనే పెంచాలని ఆల్‌ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గిద్దలూరు ప్రాంతలోని ప్రైవేటు స్కూల్ బస్ డ్రైవర్స్ క్లీనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణారంగ కార్మికులపై అనుసరిస్తున్న విధానాల వలన కార్మికుల జీవన స్థితిగతులు అధ్వానంగా తయారువుతున్నాయని, ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరల వలన, పెరుగుతున్న విద్య, వైద్య ఖర్చుల వలన ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెరుగైన వేతనాలు చెల్లించే ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, డ్రైవర్స్ క్లీనర్స్ ప్రతినిధులు పిచ్చిరెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు అబ్దుల్‌రహీబ్, నాగభూషణం, పీరయ్య, జయరావు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాల సమర్పణ

గిద్దలూరు, జూలై 30 : మండలంలోని ముండ్లపాడు గ్రామంలో మంగళవారం పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవ వైభవంగా నిర్వహించారు. తొలుత ముండ్లపాడులోని బొడ్డురాయికి 108 కలిశాలతో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు బోనాలు ఎత్తుకుని పోలేరమ్మ దేవాలయానికి వెళ్ళి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

శుభదిన్ విందు భోజనం స్ఫూర్తిదాయకం

కంభం, జూలై 30 : పుట్టిన రోజు,పెళ్లిరోజు, నామకరణం, షష్టిపూర్తి తదితర శుభదినాలలో విద్యార్థులకు విందుభోజనం అందించడం శుభపరిణామమని ఎంఈవో మాల్యాద్రి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం శుభదిన్‌ను పురష్కరించుకుని దాతలు విద్యార్థులకు ఫలహారాలు అందించారు. దాతలుగా హెచ్ఎం మాల్యాద్రి, ఉపాధ్యాయులు సలీమ్‌భాషా, సత్యరామారావు పండ్లు, కారాలు, అరటిపండ్లు అందించారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

బేస్తవారపేట, జూలై 30: బేస్తవారపేట మండలంలో గత ఏడాది చేసిన ఉపాధి పనులపై ఆడిట్ నిర్వహిస్తున్నారు. సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి పనులు పరిశీలించి, కూలీలతో, రైతులతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నారు. త్వరలో జరిగే మండల సభలో ఆడిట్ విషయాలు వెల్లడిస్తామన్నారు.

పాఠశాలల్లో ఎంఈవో తనిఖీ


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో నాయక్


త్రిపురాంతకం, జూలై 30: మండలంలోని మూడు పాఠశాలలను ఎంఈవో కేటీ. మల్లిఖార్జుననాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మేడపి మెట్ట, మేడపి ఎస్టీ, పాతఅన్నసముద్రం ప్రాథమిక పాఠశాలలను పరిశీలించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు పదిమంది లోపే ఉండడంతో ఎన్‌రోల్‌మెంట్ పెంచే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. డ్రాపవుట్ విద్యార్థులతోపాటు ఏ పాఠశాలలోనూ చేరని విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమాలలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న షబానా

మార్కాపురం వన్‌టౌన్, జూలై 30: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యాక్షురాలు షేక్ షబానా అన్నారు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌లో 'అమ్మపేరిట మొక్క' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మార్కాపురం రూరల్, జూలై 30: మండలంలోని వేములకోట గ్రామంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మంగళవారం సబ్ యూనిట్ అధికారి నాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమలు మురికిలో పెరగకుండా ఉండాలంటే వాటి మీద కిరోసిన్ చల్లడం గానీ మలాథియాన్ పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం స్వర్ణలత, వైద్య సిబ్బంది ప్రత్యూష, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకు సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

కనిగిరిలో ఆగస్టు 15న ప్రారంభానికి ఏర్పాట్లు


ప్రారంభానికి సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

కనిగిరి, జూలై 30 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న అన్న క్యాంటీన్ కనిగిరిలో నూతన సొబగులు అద్దుకుని ఆగస్టు 15వ తేదీ ప్రారంభానికి సిద్ధమవుతుంది. 2014లో అధికారం లో ఉన్నప్పుడు టీడీపీ ప్రభుత్వం రూ.5లకే ఉదయాన్నే అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రికి భోజనం పెట్టేవారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న కాంటీన్‌లను ఎత్తివేసి పేదల కడుపు కొట్టింది. తాజాగా 2024 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం తిరిగి అన్న క్యాంటీన్‌లను ప్రెందాగస్టు నుంచి ప్రారంభించనుంది. స్థానిక తీగలగొందిలో 2014లో అన్నక్యాంటీన్‌గా నిర్వహించిన భవనాన్ని సచివాలయం కింద మార్చేసి వైసీపీ ప్రభుత్వం పేదలపై అక్కసు వెళ్లగక్కింది. తిరిగి ప్రస్తుతం అదే భవనంలో క్యాంటీన్ నిర్వహించేందుకు ఆ భవనానికి రంగులు వేయటంతోపాటు విద్యుత్ లైట్లు, వడ్డణ పాత్రలు, సెల్ఫ్ మీల్స్ స్టాండ్‌లను తిరిగి బాగు చేయించి సిద్ధం చేస్తున్నారు. దీంతో పేదలు, కూలీలు, వృద్ధులు కళ్లల్లో సంతోషం నింపింది.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు ఆనందదాయకం

దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


డాక్టర్ లక్ష్మీని సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

దర్శి, జూలై 30 : గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను టీడీపీ కూటమి ప్రభుత్వం రద్దు చేయటం ఆనందదాయకమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చెప్పారు. మంగళవారం దర్శిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రైతుల భూములను అడ్డగోలుగా లాక్కునేందుకు వైసీపీ పాలకులు దుర్మార్గమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్టును తెచ్చారన్నారు. వారి అరాచకాలను చూసి తమ భూములకు రక్షణ లేకుండా పోయిందని ప్రజలు ఆందోళనలు చెందుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఊపిరి పీల్చుకున్నారని చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలపై మాజీ సీఎం జగన్ బొమ్మను ముద్రించటం వలన రాష్ట్ర ఖజానాకు రూ.700 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. ఫొటోల పిచ్చితో జగన్ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటకు కట్టుబడి పాసుపుస్తకాలపై రాజముద్ర వేసి రైతులకు అందిస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు సుదీర్ఘ అనుభవంతో ప్రజారంజక పాలన కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం అన్నీ వర్గాల ప్రజలు సంతోషంగా, ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్ స్టీవెన్, కమిషనర్ వై మహేశ్వరరావు, దర్శి పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు పాల్గొన్నారు.

చెత్త సేకరణ వాహనం ప్రారంభం

దర్శి నగర పంచాయతీలో చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన నూతన వాహనాన్ని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మంగళవారం ప్రారంభించారు. అంతకుముందు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ దర్శి నగర పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. దర్శి పట్టణాన్ని మోడల్ టౌన్‌గా మారుస్తామన్నారు.

ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకలకు దొనకొండ జడ్పీ పాఠశాల ఎంపిక


ఢిల్లీకి వెళ్లే ఉపాధ్యాయుడు, విద్యార్థితో హెచ్‌ఎం

దొనకొండ, జూలై 30 : భారతదేశ రాజధాని ఢిల్లీలో ఆగస్టు 15వ తేదీన జరగనున్న స్వాతంత్ర్య దిన వేడుకల్లో పాల్గొనేందుకు దొనకొండ జడ్పీ పాఠశాల ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు చెప్పారు. ఢిల్లీలో భారత ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో జరిగే ఈ వేడుకల్లో పాఠశాలల నుంచి ఒక ఉపాధ్యాయుడు, ఒక విద్యార్థి పాల్గొననున్నారు. రాష్ట్రం నుంచి మొత్తం ఐదు పీఎంశ్రీ పాఠశాలలు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. అందులో ప్రకాశం జిల్లా తరఫున దొనకొండ జడ్పీ పాఠశాల ఎంపిక కాగా గణిత ఉపాధ్యాయుడు షేక్ చాంద్‌బాషా, పదో తరగతి విద్యార్థి హర్షసాయినాథ్‌లు ఎంపికైనట్లు తెలిపారు.

నారాయణ స్వామి ఆలయ ఆదాయం రూ.2.44 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 30 : మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆరాధన మహోత్సవాలు సందర్భంగా రూ.2.44.650 ఆదాయం వచ్చినట్లు చైర్మన్ కిమ్మినేని చినఆదినారాయణ, ఈవో గిరి రాజు నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.95.540 లడ్డు ప్రసాదం ద్వారా రూ.75.640, శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.33.211, మహాప్రాకార నిర్మాణానికి రూ.35.143, శాశ్వత పూజలకు విరాళంగా రూ.5.116 వచ్చినట్లు తెలిపారు.

మూలనపడ్డ చెత్త సంపద తయారీ కేంద్రాలు

వైసీపీ పాలకుల అసమర్థతతే ప్రధాన కారణం


బొట్లపాలెంలో సంపద తయారీ కేంద్రంలో ఎత్తుకెళ్లిన రేకులు

దర్శి, జూలై 29 : బహుళ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఐదేళ్లుగా మూలనపడ్డాయి. వైసీపీ పాలకుల అసమర్థత, నిర్లక్ష్యం వలన ఈ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కోట్లాది రూపాయల ప్రజాధనం నిరుపయోగమైంది. కేంద్రాల వద్ద మెటీరియల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్తున్నారు. మండలంలో 25 కేంద్రాలను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. ఆ సమయంలో అన్నీ కేంద్రాల్లో చెత్తనుంచి సంపద ప్రారంభించారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో 2019 నుంచి కేంద్రాల గురించి పట్టించుకున్న నాథుడు లేడు. ఈ క్రమంలో ఆ కేంద్రాల్లో సామగ్రి దొరికింది దొరికినట్లు దోచుకుపోతున్నారు. మండలంలోని బొట్లపాలెంలో రేకులను అపహరించుకెళ్లారు. టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావటంతో ఎంతో ఉపయోగకరమైన ఈ కేంద్రాలను మళ్లీ ఆరంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిరుపయోగంగా మారిన కేంద్రాల పరిస్థితి గురించి ఈవోఆర్డీ గుత్తా శోభన్‌బాబును వివరణ కోరగా మండలంలో 25 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దేవవరం, పోతవరం గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు పథకంలో చేర్చటంతో అక్కడ నిర్మించిన కేంద్రాలు పనిచేస్తున్నట్లు చెప్పారు. బొట్లపాలెంలో ఊరికి దూరంగా ఉన్నందున రేకులు అపహరించుకెళ్లారని చెప్పారు. అక్కడ కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి స్థల సేకరణ చేస్తున్నామన్నారు. త్వరలో అన్నీ పంచాయతీల్లో చెత్తనుంచి సంపద కేంద్రాల తయారీలను వినియోగంలోకి తెస్తామన్నారు.

మురుగునీటి కుళాయి చుట్టూ శుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కుళాయి చుట్టూ శుభ్రం చేసిన దృశ్యం

తాళ్లూరు, జూలై 30 : మండలంలోని మన్నేపల్లి పంచాయతీ లింగాలపాడు గ్రామంలో మురుగునీటిలో ఉన్న కుళాయి చుట్టూ గ్రామ పంచాయతీ అధికారులు మంగళవారం శుభ్రం చేశారు. మురుగునీటిలో కుళాయి అన్న కథనం ఈనెల 28న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. ఈవోఆర్‌డీ ఆదేశానుసారం గ్రామసర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు మురుగు నీటికొళాయి పైపు ఎత్తుగా చేసి, చుట్టూ సిమెంట్ వరవేశారు. ఆప్రాంతంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా శుభ్రపరిచారు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సుల రద్దు

జిల్లా అంతర్గత తనిఖీ సహాయ వ్యవసాయ సంచాలకులు నీరజ


రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి నీరజ

దొనకొండ, జూలై 30 : విత్తన, పురుగుమందుల ఎరువుల చట్టాలకు లోబడి వ్యాపారం చేసుకోవాలని, నిబంధనలను అతిక్రమిస్తే సంబంధిత దుకాణాల లైసెన్సుల రద్దుకు సిఫార్సు చేస్తామని జిల్లా అంతర్గత తనిఖీ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.నీరజ చెప్పారు. దొనకొండలోని నాలుగు విత్తనాల దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని విత్తనాలను అధిక ధరలకు అమ్మరాదని, కొనుగోలు చేసిన వాటికి రసీదులు తప్పకుండా ఇవ్వాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, కంపెనీల అనుమతి పత్రాలను తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న విత్తనాల ప్యాకెట్లకు స్టాక్ బుక్‌లో ఉన్న వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, రైతుభరోసా కేంద్రాల సిబ్బంది విన్నిబాబు, రవితేజ, విత్తనాల దుకాణాల నిర్వాహకులు మన్నెం గాలయ్య, సురేష్‌లు ఉన్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తికి గాయాలు


ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

వెలిగండ్ల, జూలై 30 : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం వెలిగండ్ల పంచాయతీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... వెలిగండ్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి సుబ్బారెడ్డి తన పొలంలో ట్రాక్టర్‌తో విద్యుత్ స్తంభాన్ని పక్కకు తీయిస్తున్న సమయంలో డ్రైవర్ రివర్స్ గేర్ వేశాడు. దీంతో ట్రాక్టర్ వెనక్కి వస్తూ సుబ్బారెడ్డి పైకి ఎక్కడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 సమాచారం ఇవ్వడంతో కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించినట్టు సమాచారం.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


ఎక్స్‌కవేటర్‌తో మురుగునీరును తొలగించే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పామూరు, జూలై 30 : వర్షాకాలపు సీజన్‌లో రోగాలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో పుట్టారెడ్డి చెప్పారు. రోగాలకు కేరాఫ్ ఖాళీ స్థలాలు అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటిని ఎక్స్‌కవేటర్‌తో మురుగునీరును బయటకు తోడే కార్యక్రమాన్ని పరిశీలించారు. మురుగునీరు, వర్షపునీరు వెళ్లేందుకు అవసరమైన కచ్చా కాలువలను తీయించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

మురుగునీరు నిల్వ ప్రాంతాల్లో వదిలిన ఆయిల్‌బాల్స్

పామూరు పంచాయతీ పరిధిలోని ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో ఉన్న మురుగు నీటి నిల్వల్లో పంచాయతీ సిబ్బంది మంగళవారం ఆయిల్ బాల్స్ వదిలారు. ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా యజమానులు చూసుకోవాలని, ఒక వేళ నిల్వ ఉంటే చర్యలు తీసుకుంటామని ఈవోఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఖాళీ స్థలాల్లో దోమల ఉద్ధృతిని నివారించేందుకు దోమల మందును పిచికారీ చేయించి, వాటి లార్వా నివారణకు ఆయిల్ బాల్స్‌ను వదిలారన్నారు.

బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలి


పార్థసారథితో కెనరాబ్యాంక్ మేనేజర్ ఫయాత్

సీఎస్‌పురం(పామూరు), జూలై 30 : కెనరా బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందజేస్తున్నామని, బ్యాంక్ అభివృద్ధికి సహకారం అందించాలని మేనేజర్ ఎస్‌కే ఫయాత్ కోరారు. మండలంలోని శీలంవారిపల్లిలోని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల కార్యదర్శి కదిరి పార్థసారథిని బ్యాంక్ ఉద్యోగులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా తమ బ్యాంక్‌లో లభిస్తున్న సేవలు, డిపాజిట్‌లపై ఇస్తున్న వడ్డీ రేట్ల గురించి వివరించారు. దేశంలోనే అతిపెద్ద బ్యాంక్ జాబితాలో కెనరా బ్యాంక్ 3వ స్థానంలో ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో షేక్ బజాజ్ బుజ్జి, గోను చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

2న భైరవకోనలో షాపుల నిర్వహణకు లీజు వేలం

సీఎస్‌పురం(పామూరు), జూలై 30 : మండలంలోని అంబారం కొత్తపల్లి గ్రామంలోని భైరవకోన ఆలయం పరిధిలో షాపుల నిర్వహణకు ఆగస్టు 2వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి తెలిపారు. లీజు కాలం పరిధి 2025 మే 31వ తేదీ వరకు ఉంటుందని, ఫ్యాన్సీ ఐటమ్, ఫొటోలు, సీడీ లు, అమ్ముకొనేహక్కు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనే లీజు హక్కులకు వేలం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న టీడీపీ నేత కాశిరెడ్డి తదితరులు

వెలిగండ్ల, జూలై 30 : విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులంతా బాగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని నియోజకవర్గ టీడీపీ నాయకులు శ్యామల కాశిరెడ్డి ఆకాంక్షించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి నాయకులు, అధికారులు సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కాశిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెరిగే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. తదనుగుణంగా నాణ్యమైన విద్య అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డెపాలెంలో నీటి సమస్యను పరిష్కరించాలి


కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

పామూరు, జూలై 30 : పామూరు పరిధిలోని వడ్డెపాలెం(రాంనగర్)లో నెల రోజుల నుంచి వీధి కుళాయిలకు సాగర్ నీరు రాకపోవడంతో ట్యాంకర్‌తో నీళ్లను కొనుగోలు చేస్తున్నామని ఆ కాలనీవాసులు చెప్పారు. వారు నీటి సమస్యను పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డిని మంగళవారం జనసేన మండల అధ్యక్షులు దరిశి ఏడుకొండలు ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై రహీముల్లా, సందానిబాషా, వెంగళశెట్టి బాబురావు, బండారు రాజు, నాని, మల్లి రాయుడు పాల్గొన్నారు.

చీరాల బ్యాంకులో సీఐడీ విచారణ

పెద్ద ఎత్తున గోల్డ్ గోల్‌మాల్ చేసిన ఉద్యోగి

రూ. కోటికి పైగా స్వాహా జరిగినట్లు సమాచారం

చీరాలటౌన్, జూలై 30 : చీరాల పట్టణంలోని ఓ బ్యాంకులో మంగళవారం సీఐడీ విచారణ చేపట్టింది. ఈ బ్యాంకులో ఓ ఉద్యోగి రూ. 100 గ్రాముల గోల్డ్‌ను అపహరించి, బంధువుల పేరుతో తిరిగి రూ.కోటికి పైగా రుణం పొందారు. అయితే ఆ బ్యాంకుకు సంబంధించిన ఇద్దరు మేనేజర్‌లు ఆడిటింగ్ నిర్వహించగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. దీంతో వారు విషయాన్ని సీఐడీకి అప్పగించడంతో అధికారులు మంగళవారం విచారణ నిర్వహించారు. ఈక్రమంలోనే సుమారు ఆరుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు అధికారులు వెల్లడించాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మద్దిపాడు, జూలై 30 : గుర్తు తెలియని వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొని వృద్ధుడు మృతి చెందారు. ఈ సంఘటన మంగళవారం వెంకటరాజుపాలెం సమీపంలో జరిగింది. కొరిశపాడు మండలం దైవాలరావూరికి చెందిన కొప్పోలు అంజయ్య(68) తన బైక్‌పై ఒంగోలు నుంచి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అంజయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై మహేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

మేదరమెట్ల, జూలై 30 : ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 19 క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు పీడీసీఏ ప్రధాన కార్యదర్శి కారుసుల నాగేశ్వరరావు తెలిపారు. కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలోని ఆర్‌ఎస్‌సీఏ క్రికెట్‌స్టేడియంలో మూడు రోజులపాటు 29 మంది క్రీడాకారులకు పోటీలు నిర్వహించి వారిలో 16 మందితో కూడిన జట్టును మంగళవారం ఎంపిక చేశామన్నారు. మరో నలుగురిని స్టాండ్‌బైగా తీసుకున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 1వ తేదీ నుంచి మంగళగిరి పేరెచర్ల నరసరావుపేటలో నిర్వహించే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీసీఏ ఉపాధ్యక్షుడు జవహర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా క్రికెట్ జట్టుకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు పోటీల్లో మంచి ప్రతిభ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో జీజీ హనుమంతరావు, కొల్లా మధు, కోచ్ వంశీ, ఏసీఏ కోచ్‌లు సుధాకర్ చంద్రశేఖర్, బాబూరావు పాల్గొన్నారు.



గంజాయ్.. యువత జోగుతోంది. ఆ మత్తులో నేరాలకు పాల్పడుతోంది. చదువుకునే విద్యార్థులు కూడా బానిసలుగా మారారు. గతంలో ఎక్కడో మారుమూల రహస్యంగా తాగడం, విక్రయించడం జరిగేది. కానీ వైసీపీ హయాంలో గంజాయి తాగడం, విక్రయించడం అనేవి విచ్చలవిడిగా మారాయి. గొడవలు, ఘర్షణలు చివరకు హత్యలు, అత్యాచారాలకు గంజాయే కారణమని పలువురు వాపోయినా నాటి పాలకులకు పట్టలేదు. ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గంజాయి మహమ్మారిని ఓ సవాల్‌గా స్వీకరించింది. పలు ప్రాంతాల్లో ఇప్పటికే పలువురిని అరెస్టు చేసి పదుల కేజీల్లో గంజాయిని స్వాధీనం చేసుకున్నా.. ఆ మహమ్మారి ఇంకా వేళ్లూనుకునే ఉంది. నాటి ప్రభుత్వంలో గంజాయిని విచ్చలవిడి చేయగా నేడు కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం హోం మంత్రి అనిత ఎస్పీలతో దీనిపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఎస్పీలు రంగంలోకి దిగి గంజాయి మత్తును వదిలించాలని ఆదేశాలు జారీ చేశారు.

గంజాయి.. సవాల్

నాడు విచ్చలవిడి.. నేడు కట్టడికి చర్యలు

- వైసీపీ హయాంలో విస్తరించిన మహమ్మారి
- గంజాయిమయంగా ఉమ్మడి గుంటూరు జిల్లా
- విద్యాసంస్థలు సహా అన్ని చోట్ల యథేచ్ఛగా విక్రయాలు
- రోజూ పదుల సంఖ్యలో కేసులు నమోదు.. పలు అరెస్టులు
- హోంమంత్రి అనిత సమీక్షతోనైనా గంజాయి మత్తు వదిలేనా

కొరవడిన తనిఖీలు

గతంలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టేది. వైసీపీ ప్రభుత్వం ఎస్ఈబీ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి హడావుడి చేయడం తప్ప మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలేవీ లేవు. గతంలో ఎక్సైజ్, పోలీస్ శాఖలే సమర్థవంతంగా గంజాయి విక్రయాన్ని నియంత్రించాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, వారం వారం తనిఖీలు నిర్వహించి గంజాయి, తదితర మత్తు పదార్థాలను పట్టుకునేవారు. అక్రమార్కులు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో గంజాయిని తరలించడానికి ప్రయత్నించినా ప్రభుత్వ యంత్రాంగం కన్నుగప్పి తరలించడం సాధ్యమయ్యేది కాదు. కానీ వైసీపీ వచ్చాక నేరుగా అధికార పార్టీ నేతలు, కార్య కర్తలే ఈ అక్రమాల్లో భాగస్వాములయ్యా రు. దీంతో అధికారులు కూడా చూసీ, చూడనట్లు వ్యవహరించడం మొదలు పెట్టారు. ఫలితంగా గడిచిన ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లా గంజాయి హబ్‌లా మారిపోయింది.

కేసులు పెట్టినా.. తగ్గేదేలేదు

రెండు మూడు నెలల్లో పదుల సంఖ్యలో కేసులు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అంత వరకు గంజాయి విషయంలో పట్టీపట్టనట్లుగా ఉన్న పోలీసులు జూలు విదిల్చారు. గంజాయి విక్రయాలను కట్టడి చేసేందుకు దాడులు, అరెస్టులకు రంగంలోకి దిగారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ప్రతి రోజూ పదుల సంఖ్యలో గంజాయి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. పోలీసులు కేసులు పెట్టడం, నిందితులను అరెస్టు చేయడం, మళ్లీ గంజాయి విక్రయాలు జరగడం, మళ్లీ అరెస్టులు చేయడం.. సర్వసాధారణంగా మారింది. కేసులు పెడుతున్నా గంజాయి విక్రయాలు మాత్రం తగ్గడం లేదు. కేసుల దారి కేసులదే.. తమ దారి తమదే అన్నట్లుగా గంజాయి విక్రయదారులు చెలరేగి పోతున్నారు.



ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ముగ్గురు యువకు లను అరెస్టు చేసిన పోలీసులు (ఫైల్)

ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలు నియోజకవర్గ పర్యటనల్లో గంజాయి సమస్యపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా గంజాయి గురించే ప్రజలు ఎమ్మెల్యేల ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్నారు. గంజాయి మత్తులో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని వివరిస్తున్నారు. మొత్తం మీద కూటమి ఎమ్మెల్యేలకు గంజాయి సమస్య షాకుల మీద షాకులు ఇస్తోంది. స్థానిక సమస్యల కంటే అధిక సంఖ్యలో గంజాయి సమస్యపై ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో గంజాయి నియంత్రణ కోసం ఎమ్మెల్యేలు, పోలీసు యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకున్నా గంజాయి విక్రేతలు సవాలు విసురుతున్నారు. గంజాయి సమస్య పరిష్కారం కోసం ఏకంగా జిల్లా ఎస్పీలకు ఎమ్మెల్యేలు కూడా ఫిర్యాదులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద పోలీసులు అరెస్టు చేసిన గంజాయి విక్రయ దారులు (ఫైల్)

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో గంజాయి పడగ విప్పి బుసలు కొడుతోంది. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా అంతటా మహమ్మారి విస్తరించింది. వైసీపీ హయాంలో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల విక్రయాలపై కనీసస్థాయి నియంత్రణ కూడా లేకపోవడంతో ఎక్కడంటే అక్కడ గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.200కి విద్యార్థులకు విక్రయిస్తున్నారు. కళాశాల సమీపంలో ఉండే చిన్న చిన్న బడ్డీ కొట్లు, కూడళ్లను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రేతలు చెలరేగిపోతున్నారు. సాక్షాత్తూ మాజీ ముఖ్యమంత్రి నివాసం ఉంటున్న తాడేపల్లి గంజాయి విక్రయాలకు కేంద్ర బిందువుగా మారినా నాటి పాలకులకు పట్టలేదు. అత్యాచారాలు, హత్యలు చోటు చేసుకున్నా ప్రభుత్వంలో స్పందనలేదు. మంగళగిరి, తాడేపల్లిలో స్కూలు, కళాశాల స్థాయి విద్యార్థులను సైతం గంజాయి విక్రేతలు వదల్లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కిందటేడాది తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన ముగ్గురు ఇంటర్మీడియట్ విద్యార్థులు గంజాయి మత్తులో కృష్ణాయపాలెం వంతెన వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి అక్కడికక్కడే మరణించారు. కాగా గుంటూరులో గంజాయి దొరకని వీధి లేదంటే ఆశ్చర్యం లేకపోవచ్చు. ప్రతి డివిజన్లో ఏదో మూల గంజాయి దొరుకుతోంది. స్వర్ణభారతినగర్ ప్రాంతంలో గంజాయి విక్రయాలపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఎన్నికలకు ముందు ఓ మహిళ ఢిల్లీకి వెళ్లి బొటన వేలు కోసుకున్న విషయం తెలిసిందే. వైసీపీకి చెందిన ఓ ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఈ మహమ్మారి గుంటూరులో అల్లుకుపోయిందని అధికారపార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించినా నాటి ప్రభుత్వంలో స్పందనలేదు. పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి, అమరావతి, క్రోసూరు, నరసరావుపేట, పిడుగురాళ్లలో మైదాన ప్రాంతాల్లో కూడా గంజాయి విచ్చల విడిగా దొరుకుతోంది. బాపట్ల జిల్లా సూర్యలంకలో పర్యా టక ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో, చీరాల నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాల్లో గంజాయి విచ్చల విడిగా దొరుకుతోంది. ఒకప్పుడు నాటుసారా విక్రయాలు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ఇప్పుడు గంజాయి యథేచ్ఛగా అందుబాటులో ఉంది. బాపట్ల, చీరాలలోని విద్యా సంస్థలను టార్గెట్ చేసి గంజాయి విక్రేతలు విద్యార్థులను గంజాయికి బానిసలుగా చేస్తున్నారు. వీటిపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం, అధికార యం త్రాంగం గంజాయి నిర్మూలనకు ప్రయత్నిస్తోంది. కానీ గంజాయి అడుగడుగునా సవాలు విసురుతోంది. ఈ పరిస్థితుల్లో మంగళవారం హోంమంత్రి అనిత ఎస్పీలతో జరిగిన సమీక్షలో గంజాయి కట్టడి ప్రధాన అంశమైంది. గంజాయి మత్తును వదిలించేందుకు కఠిన చర్యలు తీసు కోవాలని ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిస్థితు ల్లో గంజాయి కట్టడి అవుతుందని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు.

- సరిగ్గా వారం క్రితం మంగళగిరిలోని ఎయిమ్స్ సమీపంలో పోలీసు అధికారులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు విక్రేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు వారం ముందు తాడేపల్లిలో భారీ స్థాయిలో గంజాయిని, విక్రయించే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- వారం క్రితం సత్తెనపల్లిలో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు కిలో గంజాయిని రూ.3 వేలకు విక్రయిస్తున్నాడు. అమరావతి మండలం దిడుగు గ్రామానికి చెందిన ఒకరి వద్ద 10 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్రోసూరు మండలం హసనాబాద్‌లో ఓ మహిళ వద్ద 300 గ్రాముల గంజాయి దొరికింది.

అరెస్టుల పరంపర ఇలా..

- నెల రోజుల క్రితం పల్నాడు జిల్లా మాచర్లలో 32 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. సాగర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయి దొరికింది.
- ఈ నెల 14న పెనుమూడి వంతెన వద్ద గంజాయి విక్రయిస్తున్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతకు ముందు మార్చిలో 457 కేజీల గంజాయిని బాపట్ల శివారులో పోలీసులు పట్టుకున్నారు.



తెనాలి : గంజాయితో పట్టుబడిన నిందితుల వివరాల వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐలు (ఫైల్)

నిధుల పంచాయితీ

- నాలుగు గ్రామాల నిధులు ఒక పంచాయతీకే
- కొణిదెన గ్రామ పంచాయతీకీ రూ.1.40 కోట్లు మళ్లింపు
- ఫిబ్రవరిలో వెలుగుచూసిన వ్యవహారంపై సర్పంచ్‌ల గగ్గోలు
- వైసీపీ నేతల హస్తంతో పాటు అప్పటి డీపీవోపైనా ఆరోపణలు
- కూటమి ప్రభుత్వంలో విచారణ.. నేడు కమిషనరేట్‌కు నివేదిక

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ హయాంలో పంచాయతీలను నిర్వీర్యం చేశారు. అంతటితో వదలని పాలకులు నిధులను కూడా ఇష్టంవచ్చినట్లుగా మళ్లించుకున్నారు. నిబంధనల ప్రకారం నాలుగు పంచాయతీలకు దక్కాల్సిన రూ1.40 కోట్లను ఏకపక్షంగా ఒకే పంచాయతీకి మళ్లించుకున్నారు. ఈ బాగోతం బల్లికురవ మండలం కొణిదెన గ్రామంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో వెలుగుచూసింది. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండడంతో ఈ అంశాన్ని తొక్కిపెట్టారు. ఈ క్రమంలో మిగిలిన



కొణిదెన పంచాయతీ కార్యాలయం

పంచాయతీల సర్పంచ్‌ల ఆవేదన పట్టించుకునే వారే కరువయ్యారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఆ అంశంపై ఫిర్యాదులు అందాయి. దీంతో ఏ నిబంధన ప్రకారం నిధులన్నింటిని ఒకే పంచాయతీకి జమ చేశారనే అంశంతో పాటు అప్పుడు జరిగిన అవకతవకలపై రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనరేట్ విచారణకు ఆదేశించింది. ఇప్పటికే విచారణ పూర్తి చేసిన అధికారులు సదరు నివేదికను బుధవారం పంచాయతీరాజ్ కమిషనర్‌కు అందించనున్నారు.

15 ఏళ్ల నుంచి నాలుగు పంచాయతీలకు..

బల్లికురవ మండల పరిధిలో గ్రానైట్ క్వారీల రాయల్టీ భారీ మొత్తంలో వస్తుంది. ఈ మొత్తంలో కొంత భాగం క్వారీలు విస్తరించి ఉన్న నాలుగు పంచాయతీల అభివృద్ధికి కేటాయించాలనే మార్గదర్శకాలు ఉన్నాయి. దీనిలో భాగంగా బల్లికురవ మండల పరిధిలోని నక్కబొక్కలపాడుకు 27 శాతం, మల్లాయపాలేనికి 32 శాతం, కె.రాజుపాలేనికి 17 శాతం, కొణిదెన పంచాయతీకి 24 శాతం ఇస్తున్నారు. దాదాపు 15 ఏళ్లు ఈ నిష్పత్తిలోనే సీనరేజీ నిధులను ఆ గ్రామ పంచాయతీలకు కేటాయిస్తూ వచ్చారు. ఈ మొత్తాన్ని మూడు నెలల కొకసారి ఆయా పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తారు. కానీ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడు క్వార్టర్లకు చెందిన రూ.1.40 కోట్లను ఒక్క కొణిదెన గ్రామ పంచాయతీకే ఈ ఏడాది ఫిబ్రవరిలో జమ చేశారు. ఏళ్ల తరబడి వస్తున్న ఆనవాయితీకి పాతరే యడమే కాకుండా వైసీపీ నేతలు చక్రం తిప్పడం, అప్పటి డీపీవో వాళ్లకు సహకరించడం వల్లే తమకు అన్యాయం జరిగిందని మిగిలిన మూడు గ్రామాల సర్పంచ్‌లు అప్పట్లో రోడ్డెక్కారు. ఇదిలా ఉంటే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చివరి త్రైమాసికంలో జిల్లాలోని అన్ని పంచా యతీలకు జమ చేయాల్సిన రూ.97 లక్షలను సకాలంలో జమచేయలేదు. దీంతో అవి మురిగిపోయినట్లు తెలుస్తోంది.

జూన్ 12న విచారణకు ఆదేశాలు

ఏ నిబంధనల ప్రకారం సీనరేజీ నిధులను ఒకే పంచాయతీకి మళ్లించారో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రస్తుత డీపీవో రవికుమార్‌ను జూన్ 12న ఆదేశించింది. దీనిలో భాగంగా అవకతవకలు జరిగినప్పుడు డీపీవోగా పనిచేసిన రాంబాబు వివరణతో పాటు, తర్వాత ఇన్‌చార్జి డీపీవోగా పనిచేసిన క్రిష్ణ వివరణను కూడా నివేదికకు జతపర్చాలని ఆదేశించింది. దీనికి సంబంధించి బదిలీపై వెళ్లిన రాంబాబును వివరణ కోరగా ఆయన దగ్గర నుంచి తొలుత స్పందన కరువైనట్లు తెలుస్తోంది. వివరణ విషయాన్ని జూన్ 25న మళ్లీ ఒకసారి ఆయనకు రిమైండ్ చేయగా బదులిచ్చారు. అయితే ఆయన ఇచ్చిన వివరణలో పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. డీఆర్‌డీఏ పీడీగా ఉంటూ మూడు వారాలపాటు అప్పట్లో ఇన్‌చార్జి డీపీవోగా ఉన్న కృష్ణ వివరణను కూడా తీసుకున్నారు. అప్పటి కలెక్టర్ రంజిత్ బాషా ఆమోదం లేకుండానే ఆ నిధులపై కొణిదెన పంచాయతీకి ప్రొసీడింగ్స్ ఇచ్చారనేది కృష్ణపై ఉన్న ఆరోపణ. ఇన్‌చార్జి డీపీవో కృష్ణ ఇచ్చిన ఆదేశాలను ఆధారంగా చేసుకునే కొణిదెన పంచాయతీ సర్పంచ్ కోర్టు మెట్లు ఎక్కారు. దాదాపు మూడు వారాల పాటు ప్రస్తుత డీపీవో రవికుమార్ ఈ అంశంపై కసరత్తు చేసి సమగ్ర నివేదికను బుధవారం పంచా యతీరాజ్ కమిషనర్‌కు అందించనున్నారు.

తహసీల్దార్ల నియామకం

17 మందికి పోస్టింగ్‌లిస్తూ కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఎన్నికల్లో భాగంగా బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లి ఇటీవలే యథాస్థానాల్లోకి వచ్చిన తహసీల్దార్లకు జిల్లాలో పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ వెంకటమురళి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. దీనిలో భాగంగా అద్దంకి తహసీల్దార్‌గా జి. శ్రీచరణ, సంతమాగులూరుకు కె.రవిబాబు, అమర్తలూరుకు కె.నెహ్రూబాబు, కొల్లూరుకు బి.వెంకటేశ్వర్లు, చుండూరుకు డి.మల్లికార్జునరావు, వేమూరుకు బి.సుశీలను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. మార్టూరు తహసీల్దార్‌గా టి.ప్రశాంతి, యద్దనపూడికి కె.రవికుమార్, బాపట్లకు పి.కృష్ణకాంత్, పిట్టలవానిపాలేనికి మెహర్‌కుమార్, చీరాలకు కె.గోపీకృష్ణ, వేటపాలేనికి పి.పార్వతి, చినగంజాం మండలానికి జె.ప్రభాకర్‌రావు, కొరిశపాడుకు డి.వెంకటేశ్వరరావు, పర్చూరుకు పి.బ్రహ్మయ్య, కారంచేడుకు కె.నరసింహరావు, కర్లపాలెం మండలానికి ఎస్.వెంకటరత్నంలను తహసీల్దారుగా నియమించారు. బాపట్ల, రేపల్లె, చీరాల ఆర్డీవో కార్యాలయాల ఏవోలుగా ఏ శ్రీనివాసరావు, జాన్ పీటర్, సురేష్‌బాబులను నియమించారు.

పల్నాడులో పోస్టింగ్ నై

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని 28 మండలాలకు తహసీల్దార్లు లేరు. ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన వారు ఇటీవల తిరిగి జిల్లాకు వచ్చారు. అయితే వారికి పోస్టింగ్‌లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఎమ్మెల్యేల సిఫార్సుల లేఖల జారీలో జాప్యంతోనే తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇవ్వడంలేదన్న ఆరోపణలున్నాయి. ఇతర జిల్లాలో విధులు నిర్వహిస్తూ అక్కడ రిలీవై కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేసిన 24 మంది తహసీల్దార్లు పోస్టింగ్‌ల కోసం మూడు రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలోని తహసీల్దార్లను ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు బదిలీ చేశారు. ప్రభుత్వఆదేశాల మేరకు ఆయా జిల్లాల నుంచి తహసీ ల్దార్లను రిలీవ్ చేశారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలో విధులు నిర్వహించిన తహసీల్దార్లు ఇక్కడి నుంచి రిలీవయ్యారు. ఎన్నికల ముందు ముగ్గురు తహసీల్దార్లు ఉద్యోగోన్నతితో బదిలీపై వెళ్లారు. ఎన్నికల ముందు నుంచే ఒక మండలంలో తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో జిల్లాలో 28 మండలాలకు తహసీల్దార్లు లేరు.

బీచ్‌ల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు

- అధికారులకు కలెక్టర్ వెంకట మురళి ఆదేశాలు

బాపట్ల, జూలై 30: తీర ప్రాంతాల్లోని బీచ్‌ల్లో ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. బీచ్‌ల వద్ద ప్రమాదాల నివారణపై కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో విస్తరించి ఉన్న 103 కిలోమీటర్ల మేర బీచ్‌ల్లో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్‌ల వద్ద ప్రజలు మునగడానికి హద్దులు నిర్ణయించి హెచ్‌పీడీపీ పైపులను ఏర్పాటు చేయాలన్నారు. కార్తీకమాసంలో అత్యధికంగా పర్యాటకులు వస్తున్నందున పరిశుభ్రతకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పేరలి వద్ద బోట్స్ షికారుకు చర్యలు చేపట్టాలన్నారు. పర్యాటకులు అధికంగా సందర్శించే ప్రాంతాల్లో కొబ్బరి, సరుగుడు తదితర మొక్కలు పెంచాలన్నారు. ఒక్కొక్క బీచ్ వద్ద ఎన్టీఆర్ఎఫ్ శిక్షణ పొందిన గజఈతగాళ్లను 25 మందిని ఏర్పాటు చేయాలన్నారు. 15 వేలమంది మత్స్యకారులకు ఇబ్బందులు లేకుండా బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్నారు.

అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం

ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా పూర్తిగా అరికట్టాలని అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుకపై జరిగిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇసుక అవసరమైన వారంతా ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు వెళ్లి తెచ్చుకోవాలని చెప్పారు. గాజులంక, జువ్వలకుంట గ్రామాలలో రేవుల వద్ద ఇసుక త్వరలో అందుబాటులోకి రానుందన్నారు. సహజ వనరులను సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశాల్లో జేసీ బి.సుబ్బారావు, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్, మైన్స్ ఏడీ రాజేష్, చెన్నైకు చెందిన తీరపరిశోధన జాతీయ కేంద్రం, షోర్‌లైన్ మేనేజ్‌మెంట్ ప్లానర్ బి.సుధీర్, ఆర్డీవోలు గంధం రవీందర్, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

విశ్రాంతి ఉపాధ్యాయిని హత్య కేసులో వీడిన మిస్టరీ

కేబుల్ టెక్నీషియన్‌ను పట్టుకున్న పోలీసులు

డబ్బు ఆశతోనే ఘాతుకానికి పాల్పడినట్లు అంగీకరించిన నిందితుడు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ జగదీష్ నాయక్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగదీష్‌నాయక్(ఇన్‌సెట్లో) నిందితుడు అంజనేయులు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూలై 30 : సుమారు 10 రోజులుగా చర్చనీయాంశంగా మిగిలిన విశ్రాంతి ఉపాధ్యాయిని హత్య కేసులో మిస్టరీ వీడింది. పలుమార్లు విచారించినా అందీఅందనట్లు జారుకున్న నిందితుడు కేబుల్ టెక్నీషియన్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ జగదీష్ నాయక్ వివరాలు వెల్లడించారు. అమరావతికి చెందిన పిల్లి లలితమ్మ(78) అలియాస్ ధర్మవరపు లలిత తెలుగు ఉపాధ్యాయిని. భర్త వెంకట రామారావు కూడా విశ్రాంతి ఉపాధ్యాయుడు. చాలాకాలం కిందటే ఆయన మృతి చెందారు. వృత్తి రీత్యా చాలాకాలంగా దంపతులు ఈపూరుపాలెం బూదాటివారి వీధిలోని జెండా చెట్టు వద్ద నివాసం ముంటూ స్థిరపడ్డారు. ఈనేపథ్యంలోనే 2004లో స్థానిక బాయ్స్ హైస్కూల్‌లో ఉద్యోగ విరమణ పొంది అప్పటి నుంచి ఆమె ఒంటరిగా ఉంటున్నారు. పెద్ద కుమారుడు కల్యాణ్ ఈశ్వర బాబు ఫ్రాన్స్‌లో ఉద్యోగం, చిన్న కుమారుడు సామ్రాట్ కాలిఫోర్నియాలో ఉద్యోగం, కుమార్తె దోష వర్షిత విజయవాడలో నివాసముండగా, ఆమె భర్త అక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. లలితమ్మ చుట్టు పక్కల వారితో ఎంతో మర్యాదగా ఉండేవారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. ఎంతో ఉన్నతంగా ఉన్న ఈమె ఒంటరిగా ఉండే సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈనెల 23వ తేదీన మధ్యాహ్న సమయంలో సమీపంలోని తోటవారి పాలెం వీవర్స్ కాలనీకు చెందిన కేబుల్ టెక్నీషియన్ పోసా అంజనేయులు టీవీ రిపేర్ చేసేందుకు ఇంట్లోకి వచ్చాడు. ఆ సమయంలో ఒంటరిగా కూరగాయలు కోసుకుంటూ ఉన్న లలితమ్మను చూశాడు. ఆమె వద్ద డబ్బు అధికంగా ఉంటుందని దురాశ చెందాడు. దీంతో ఇంట్లో ఉన్న కత్తితో ఆమెపై దాడి చేసి గొంతులో కత్తి దింపి హత మార్చాడు. ఇంట్లో అన్ని ప్రాంతాల్లో వెదకగా రూ.9500 మినహా నగదు కనిపించలేదు. వాటితోనే సర్దుకుని జారుకున్నాడు. గ్రామంలోనే దర్జాగా తిరుగుతూ టీవీ మరమ్మతులు చేసుకుంటు ఉన్నాడు.

పోలీసులు రంగప్రవేశం

హత్య విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ తుషార్ డూడీతో సహా సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు అందరూ రంగంలోకి దిగారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. 100 మందికి పైగా విచారణ చేశారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఎంతో ఉన్నతంగా అభివృద్ధి చెందిన ప్రాంతంలో కనీసం ఒక్క సీసీ కెమెరా కూడా లేకపోవడంతో హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. దీంతో సుమారు 40 మంది పోలీసులు రంగంలోకి దిగి ఆధారాలు సేకరించే పనిలో సుమారు 10 రోజులుగా మునిగిపోయారు.

నిందితుడిని గతంలోనే పలుమార్లు విచారణ

నిందితుడు పోసా అంజనేయులు అతనితో కలిసి పనిచేసే అశోక్‌ను పలుమార్లు పోలీసులు విచారణ చేశారు. ఈక్రమంలో అంజనేయులు అందీఅందనట్లు జారుకుంటూ పోలీసుల దృష్టిని మరలించాడు. అయితే తిరిగి తిరిగి కేసు మళ్లీ ఇతని చుట్టే తిరుగుతుండడంతో అతడు ఆ రోజు ధరించిన డ్రెస్‌ను సీజ్ చేశారు. వాటిని పరీక్షించారు. అవి అప్పటికే ఉతికి ఉండడంతో పోలీసులకు పరిస్థితి అంతుబట్ట లేదు. ఎట్టకేలకు వీటి శాంపిల్స్ కలెక్ట్ చేసి రెండు దఫాలుగా ల్యాబ్‌కు పంపగా నిర్ధారణ జరిగింది. వెంటనే మంగళవారం నిందితుడుని అరెస్ట్ చేసి, ఘటనకు పాల్పడిన కత్తి, వాహనం, డ్రెస్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసులను, ఎస్‌బీ, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు.

చీరాల బ్యాంకులో సీఐడీ విచారణ

పెద్ద ఎత్తున గోల్డ్ గోల్‌మాల్ చేసిన ఉద్యోగి

రూ. కోటికి పైగా స్వాహా జరిగినట్లు సమాచారం

చీరాలటౌన్, జూలై 30 : చీరాల పట్టణంలోని ఓ బ్యాంకులో మంగళవారం సీఐడీ విచారణ చేపట్టింది. ఈ బ్యాంకులో ఓ ఉద్యోగి రూ. 100 గ్రాముల గోల్డ్‌ను అపహరించి, బంధువుల పేరుతో తిరిగి రూ.కోటికి పైగా రుణం పొందారు. అయితే ఆ బ్యాంకుకు సంబంధించిన ఇద్దరు మేనేజర్లు ఆడిటింగ్ నిర్వహించగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. దీంతో వారు విషయాన్ని సీఐడీకి అప్పగించడంతో అధికారులు మంగళవారం విచారణ నిర్వహించారు. ఈక్రమంలోనే సుమారు ఆరుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు అధికారులు వెల్లడించాల్సి ఉంది.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపిక అయిన అండర్ 19 బాలుర క్రికెట్ జట్టు

మేదరమెట్ల, జూలై 30 : ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 19 క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు పీడీసీఏ ప్రధాన కార్యదర్శి కారుసుల నాగేశ్వరరావు తెలిపారు. కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలోని ఆర్ఎస్‌సీఏ క్రికెట్ స్టేడియంలో మూడు రోజులపాటు 29 మంది క్రీడాకారులకు పోటీలు నిర్వహించి వారిలో 16 మందితో కూడిన జట్టును మంగళవారం ఎంపిక చేశామన్నారు. మరో నలుగురిని స్టాండ్‌బైగా తీసుకున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 1వ తేదీ నుంచి మంగళగిరి పేరెచర్ల నరసరావుపేటలో నిర్వహించే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీసీఏ ఉపాధ్యక్షుడు జవహర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా క్రికెట్ జట్టుకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు పోటీల్లో మంచి ప్రతిభ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో జీజీ హనుమంతరావు, కొల్లా మధు, కోచ్ వంశీ, ఏసీఏ కోచ్‌లు సుధాకర్ చంద్రశేఖర్, బాబూరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మద్దిపాడు, జూలై 30 : గుర్తు తెలియని వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొని వృద్ధుడు మృతి చెందారు. ఈ సంఘటన మంగళవారం వెంకటరాజుపాలెం సమీపంలో జరిగింది. కొరిశపాడు మండలం దైవాలరావూరికి చెందిన కొప్పోలు అంజయ్య(68) తన బైక్‌పై ఒంగోలు నుంచి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అంజయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై మహేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

4న ఉచిత కంటి వైద్య శిబిరం

ఇంకొల్లు, జూలై 30 : ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 4వ తేదీన ఆదివారం ఏలూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పింఛన్‌ల పంపిణీకి సిద్ధం

ఇంకొల్లు, జూలై 30 : మండలంలోని 13 పంచాయతీలలో 15 సచివాలయాల పరిధిలో 7733 మందికి ఆగస్టు 1వ తేదీన సచివాలయ సిబ్బంది పింఛన్‌లు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. సుమారు రూ.3 కోట్ల 18లక్షల 27వేల రూపాయలు లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

మోనోడాన్.. నిలువునా ముంచెన్!

నాసిరకం సీడ్‌తో ఆక్వా రైతులకు అపారనష్టం

చెరువుల్లో ఎదుగుదల లేని రొయ్యలు

ఎకరా చెరువుకు రూ.5లక్షలు పోయినట్లే

హేచరీలపై పర్యవేక్షణ కరువు

పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు

జిల్లాలో ఆక్వా రంగం ఒడిదొడుకులకు లోనవుతోంది. సీడ్ మోసంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రొయ్య పిల్లలను ఉత్పత్తి చేసే హేచరీలు రైతులను దెబ్బకొట్టాయి. వారిని నమ్మించి నట్టేట ముంచేశాయి. నాసిరకం సీడ్‌ను సరఫరా చేయడంతో రైతులు రూ.లక్షల్లో పెట్టుబడులు కోల్పోయారు. చెరువులలో రొయ్యలు ఎదుగూబొదుగూ లేకపోవడం, మధ్యలో చనిపోతుండటంతో ఆక్వారైతులు లబోదిబోమంటున్నారు. హేచరీల నిర్వహణపై ప్రభుత్వానికి పూర్తిగా పర్యవేక్షణ లేకపోవటంతో నిర్వాహకులదే ఇష్టారాజ్యం అవుతోంది. రైతులు ఒకపక్క గుల్లవుతుండగా హేచరీల యజమానులు మాత్రం రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. నాసిరకం సీడ్‌తో నష్టపోయిన ఆక్వా రైతులు ప్రభుత్వం సాయం చేయటమా లేక హేచరీల నుంచి నష్టపరిహారం ఇప్పించటమా అనే దిశగా ఉద్యమించడానికి సిద్ధమవుతున్నారు.

ఒంగోలు నగరం, జూలై 30: జిల్లాలోని ఆక్వా రైతులు మళ్లీ కుదేలయ్యారు. ప్రతిసారి వైరస్ వల్లో లేక ధరలు పడిపోవడం వల్లో దెబ్బతినే ఆక్వా రంగం ఈసారి నాసిరకం సీడ్‌తో అతలాకుతలమవుతోంది. కొన్నేళ్లుగా టైగర్ రకం రొయ్యల సాగువైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. వెనామీ రకం రొయ్యలకు డిమాండ్ తగ్గటంతో టైగర్ సాగుపై దృష్టిసారించారు. ఐదేళ్లుగా జిల్లాలో టైగర్ సాగు పెరుగుతూ వస్తోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కొత్తపట్నం, టంగుటూరు, శింగరాయకొండ, ఉలవపాడు, ఒంగోలు, చినగంజాం, నాగులుప్పలపాడు, వేటపాలెం, చీరాల మండలాల్లో దాదాపు 25వేల హెక్టార్లతో ఆక్వా సాగు జరుగుతోంది. ఇందులో సగానికి పైగా టైగర్ రకం రొయ్యలనే రైతులు సాగుచేస్తున్నారు.

మోనోడాన్ రకం సీడ్‌ను హేచరీల యజమానులు రైతులకు ఎక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఇతర రకం సీడ్ 50 గ్రాములలోపు బరువు పెరుగుతుండగా, మోనోడాన్ రొయ్య గరిష్ఠంగా 100 గ్రాముల బరువు పెరుగుతుంది. దీంతో సహజంగానే ఆ రకం రొయ్యలకు మార్కెట్లో డిమాండ్ అధికం. దీంతో ఎక్కువ మంది రైతులు ఆ రకం రొయ్యల సాగుకే మొగ్గుచూపుతున్నారు. దీంతో హేచరీల యజమానులు సీడ్ ధరలను అమాంతం పెంచేసి విక్రయిస్తున్నారు. సీడ్ ఒక్కో పిల్ల రేటు 90పైసలకు గరిష్ఠంగా విక్రయిస్తున్నారు. ఈ లెక్కన ఆక్వా రైతులు సీడ్ కొనుగోలుకే రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఇంత ధర పెట్టి కొనుగోలు చేసినా రైతులకు నాసిరకం సీడ్‌నే సరఫరా చేస్తున్నారు. తెచ్చిన పిల్లల్లో 20శాతం మాత్రమే చెరువుల్లో బతుకుతున్నాయి. సాధారణంగా మోనోడాన్ రకం సీడ్‌ను ఆరు నెలల పాటు పెంచితే 100 గ్రాములకు పెరుగుతాయి. ఇప్పుడు ఆరు నెలలకు 50 గ్రాముల బరువు కూడా పెరగటం లేదు. దీంతో రైతులు మేత, ఇతర నిర్వహణ ఖర్చులు పెరిగిపోయి తీవ్రంగా నష్టపోయారు. ఎదుగుదల లోపించటంతోపాటు వ్యాధులు కూడా చుట్టుముడుతున్నాయి. వైట్‌స్పాట్, వైట్‌గట్, ఈహెచ్‌పీ వైరస్‌లు రొయ్యలకు సోకుతున్నాయి. దీంతో చెరువును మధ్యలోనే తీసెయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

ధర ఎక్కువ ... నాణ్యత తక్కువ

మోనాడాన్.. చనిపోతున్నాయి

జిల్లాలో రైతులు నెల్లూరు, గూడూరు, కరేడు ప్రాంతాల నుంచి రైతులు మోనోడాన్ కంపెనీ రకం రొయ్య పిల్లలను తెచ్చి సాగు చేపట్టారు. అయితే మోనోడాన్ వేసిన చెరువుల్లో పిల్లలు చనిపోతున్నాయి. సగానికి సగం కూడా చెరువులో ఉండటం లేదు. బతికిన సగం పిల్లల్లో కూడా ఎదుగుదల లేకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సాధారణంగా వెనామీ రకం సీడ్ చెరువుల్లో లక్షల్లో వేస్తారు. మోనోడాన్ రకం సీడ్ అయితే ఎకరం విస్తీర్ణంలో 30వేల సీడ్ మాత్రమే వేస్తారు. వేసినవి కూడా మొత్తం బతకకపోవటం, బతికి ఉన్న రొయ్యల్లో ఎదుగుదల లేకపోవటంతో రైతులలో అయోమయం నెలకొంది. వెనామీ రకం రొయ్యలను 100 కౌంట్‌లో తీసినా రైతులకు గిట్టుబాటు అవుతోంది. అదే మోనోడాన్ రకం రొయ్యలను 30లోపు కౌంటులో తీస్తేనే గిట్టుబాటు అవుతుంది. అంత కౌంట్‌కు తీసుకు రావాలంటే రైతులు ఐదు నెలలకుపైగా చెరువుల్లో ఉంచి మేత వేయాల్సి వస్తోంది. అయినా ఆ కౌంట్‌కు ఎదగకపోవటం, పెట్టుబడి పెరగడంతో రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. జిల్లాలో టైగర్ రకం రొయ్యల్లో మోనోడాన్ కంపెనీకి చెందిన పిల్లలు సాగు చేసిన రైతులు భారీగా నష్టపోయారు. గత రెండేళ్లుగా నష్టాల్ని చవిచూస్తూనే ఉన్నారు. ఒక్కో ఎకరాకు రూ.5లక్షల మేర నష్టపోయారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం జిల్లాలో వర్షాకాలం పంట సాగుకు సమాయత్తం అవుతుండగా నాణ్యమైన సీడ్ కోసం రైతులు దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. టైగర్ రకం సాగు చేయాలంటే హేచరీల నుంచి నాసిరకం సీడ్ అమ్ముతున్నారంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు.



చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

రొయ్యల రైతులకు నాసిరకం సీడ్‌ను సరఫరా చేస్తూ నిలువునా మోసం చేస్తున్నారు. అయితే ఈ మొత్తం వ్యవహారంపై పర్యవేక్షణ చేయాల్సిన మత్స్యశాఖ అధికారులు గాని, కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ గాని ఏ మాత్రం పట్టించుకోవటం లేదు. తరచూ హేచరీలను తనిఖీ చేస్తూ నాసిరకం సీడ్ తయారీని అరికట్టాల్సిన అధికారులు ఆ దిశగా ఏమాత్రం చర్యలు చేపట్టటం లేదు. జిల్లా మత్స్యశాఖకు తగినంత మంది అధికారులు, సిబ్బంది ఉన్నా హేచరీల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

1న రొయ్యల సంఘం రైతులు...

హేచరీల యజమానులతో ప్రత్యేక సమావేశం

రైతులకు నాసిరకం సీడ్‌ను విక్రయించిన హేచరీల నుంచి రైతులకు నష్టపరిహారం ఇప్పించాలనే డిమాండ్ జిల్లా ఆక్వా రైతుల సంక్షేమ సంఘం నుంచి వస్తున్న నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించారు. హేచరీల యజమానులు, ఆక్వా రైతు సంఘం నాయకులతో ఆగస్టు ఒకటో తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో జరిగే ఈ సమావేశంలో రైతులు, అధికారులు, హేచరీల నిర్వాహకులు పాల్గొననున్నారు.

మరో వేసవి!

జిల్లావ్యాప్తంగా పెరిగిన ఎండలు

ఆపై వేడిగాలులు

ఒంగోలులో 38.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

నాలుగైదు రోజుల్లోనే ఐదు డిగ్రీలు పెరుగుదల



ఎండదెబ్బకు గొడుగుతో వెళ్తున్న మహిళ

ఒంగోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తూ కొన్నిచోట్ల వరదలు కూడా ముంచెత్తుతున్నాయి. కానీ జిల్లాలో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. జిల్లాలోని అధిక ప్రాంతాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఒకరకంగా వేసవిని తలపిస్తూ ఎండలు కాస్తున్నాయి. మరో వేసవి కాలం వచ్చిందా అన్నట్లుగా ఎండల తీవ్రతతోపాటు వడగాలులు వీస్తున్నాయి. సాధారణంగా ఉండాల్సిన దాని కన్నా గత వారంరోజులుగా జిల్లాలో అధికంగా ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. నాలుగురోజుల వ్యవధిలో ఒంగోలు నగరంలో ఏకంగా ఐదు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఈనెల 27న ఒంగోలులో 34డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా మంగళవారం ఏకంగా 38.8డిగ్రీలు నమోదైంది. సాధారణంగా జిల్లాలో ఈ సమయంలో వాతావరణం చల్లగా ఉంటుంది. పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30 నుంచి 34 డిగ్రీల లోపుగా ఉంటుంటాయి. తరుచూ జల్లులు పడుతూ వాతావరణం చల్లగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలలో అయితే వాతావరణం మరింత ఆహ్లాదకరంగా ఉంటుంది. ఖరీఫ్ సీజన్ పంటలు సాగుతోపాటు పశుగ్రాస పైర్లు ఇతరత్రా వాటితో గ్రామాల్లోని పొలాలు పచ్చగా ఉంటాయి. అదే పట్టణాలలో అయితే రెండు, మూడు రోజులకు ఒకసారి అయినా జల్లులు పడుతూ జనజీవనం కొంత ఇబ్బందికరంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం జిల్లాలో అందుకుభిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. ప్రత్యేకించి నాలుగైదు రోజులుగా పరిస్థితి పూర్తిగా మారింది. జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో వానజాడ లేకపోగా ఎండల తీవ్రత పెరిగింది. పలుచోట్ల 40డిగ్రీలకు చేరువలో ఎండలు కాస్తుండటంతో పాటు వడగాలులు కూడా వీస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్న సమయంలో సంతనూతలపాడు, చీమకుర్తి, పొన్నలూరు మండలాల్లో 38 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉండగా సగానికిపైగా మండలాల్లో 37డిగ్రీల కన్నా అధికంగా నమోదయ్యాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండల తీవ్రత ఉంటుంది. ఎండలకు వేడిగాలులు, ఉక్కపోత తోడు కావడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వానలు కురవాల్సిన సమయంలో మరో వేసవికాలం వచ్చిందా అన్న చర్చ సర్వత్రా జరుగుతుండగా వర్షాలు లేక పంటల సాగు కూడా ముందుకు సాగడం లేదు.

విద్యా పథకాలకు పేరు మార్పు

ఒంగోలు(విద్య), జూలై 30 : పాఠశాల, కళాశాల విద్యలో విద్యార్థులకు అమలుచేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాల పేర్లను కూటమి ప్రభుత్వం మార్చేసింది. గత ప్రభుత్వంలో జగనన్న పేరుతో అమలు జరిగిన ఈ పథకాలకు ప్రభుత్వం మహనీయుల పేర్లు పెట్టి వారిని గౌరవించింది. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా కూటమి ప్రభుత్వం మూడు పథకాలకు పేర్లు నిర్ణయించింది.

- పాఠశాల విద్యార్థులకు ఇప్పటి వరకు జగనన్న గోరుముద్ద పేరుతో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం పేరును డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా మార్పు చేశారు.
- జగనన్న విద్యాకానుక పేరుతో విద్యార్థులకు అందిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్రగా మార్పు చేశారు.
- జగనన్న ఆణిముత్యాలు పేరుతో విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను అబ్దుల్‌కలాం ప్రతిభా సేవా పురస్కారంగా పేర్లను ప్రభుత్వం మార్పు చేసింది.

మధ్యాహ్న భోజన మెనూ మార్పు

పాఠశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన మెనూను ప్రభుత్వం మార్చింది.

- సోమవారం కూరగాయల పలావ్, కోడిగుడ్ల కూర, వేరుశనగ బెల్లం చిక్కి
- మంగళవారం పులిహోర, దొండకాయ పచ్చడి, రాగిజావ, ఉడికించిన కోడిగుడ్డు
- బుధవారం కూరగాయల అన్నం, ఆలుకుర్మ, ఉడికించిన కోడిగుడ్లు, వేరుశనగ బెల్లం చిక్కి
- గురువారం సాంబర్ బాత్/లెమన్ రైస్, టమోటా పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు
- శుక్రవారం అన్నం, ఆకుకూరపప్పు, ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగ బెల్లంచిక్కి
- శనివారం ఆకుకూర అన్నం, పప్పుచారు, రాగిజావ, స్వీట్ పొంగల్

వంట నిర్వహకులు, హెచ్‌ఎంల అనుమతిలో విద్యార్థులకు సరిపోయేలా అన్నం, గుడ్లు, చిక్కిలు ఇవ్వాలి. వంట చేసే ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచాలి. వంటకు ముందు నిర్వాహకులు యూనిఫాం ధరించి వంట చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

మామాకోడళ్ల మధ్య ఘర్షణ

ఆగ్రహించిన ఆమె బంధువులు

మామ కూతురి ఇంటికి వెళ్లి వాగ్వివాదం

అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఏఎస్సై

ఆయన దాడిచేశారని రోడ్డెక్కిన కోడలి బంధువులు

ఎస్సై చొరవతో ఆందోళన విరమణ

పరస్పర కేసులు నమోదు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్సై టి. శ్రీరామ్

సింగరాయకొండ, జూలై 30 : మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో సోమవారం రాత్రి మామ, కోడలు ఘర్షణ పడ్డారు. కుటుంబ తగాదా కాస్తా చివరకు పోలీసుల వైపు మళ్లింది. ఎస్సై టి.శ్రీరాం కథనం మేరకు.. కుటుంబ కలహాల నేపథ్యంలో మామ మాలకొండయ్య, కోడలు సుకన్య మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా మాలకొండయ్య కర్రతో సుకన్యను కొట్టడంతో కంటి కింద రక్తగాయమైంది. దీంతో ఇరువురూ రాత్రి 11 గంటల సమయంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడానికి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు ఆసుపత్రికి వెళ్లాలని సూచించగా ఉదయాన్నే మళ్లీ వస్తామని వెనుదిరిగి ఇంటికి చేరుకున్నారు. సుకన్యపై దాడి విషయాన్ని తెలుసుకొని మంగళవారం ఉదయం ఆమె బంధువులు వెంకటేశ్వరకాలనీకి చేరుకున్నారు. మాలకొండయ్య కోసం వెతుకుతూ కాలనీలోని ఆయన కుమార్తె ఇంటికి వెళ్లారు. అక్కడ ఆమెకు, సుకన్య బంధువుల మధ్య వివాదం జరిగింది. దీంతో ఆమె విషయాన్ని తన భర్త మురళికి ఫోన్ చేసి చెప్పింది. ఆయన వెంటనే డయల్ 100కు ఫోన్ చేశారు. దీంతో పోలీసులు వెంకటేశ్వరకాలనీకి చేరుకున్నారు. ఆసమయంలో పోలీసుల వెంట ఉన్న మురళిపై సుకన్య బంధువులు దాడికి ప్రయత్నించారు. అక్కడే ఉన్న ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా వారించే క్రమంలో కొందరిని చొక్కాపట్టుకొని పక్కకు లాగారు. పోలీసుల ముందే దాడికి పాల్పడతారా అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇరువర్గాల వారికి సర్దిచెప్పి తిరిగి స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు ఒక వైపు ఒత్తాసు పలుకుతున్నారని, ఏఎస్సై మహబూబ్ బాషా తమపై దాడిచేశారని ఆరోపిస్తూ సుకన్య బంధువులు వెంకటేశ్వర కాలనీ ఎదురు ఉన్న ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. ఏఎస్సైను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీరాం హుటాహుటిన అక్కడికి చేరుకొని సుకన్య, వారి బంధువులతో మాట్లాడారు. స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదుచేస్తే న్యాయం చేస్తానని సర్దిచెప్పారు. దీంతో శాంతించిన వారు ధర్నాను విరమించారు. అనంతరం సుకన్య, మాలకొండయ్యను కందుకూరు ఏరియా ఆసుపత్రికి పంపించారు. ఆసుపత్రిలో ఇరువురూ ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు పరస్పర కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతా ఖాళీనే..

కాలక్షేపం చేస్తున్న ఎయిడెడ్ టీచర్లు

ఆయా స్కూళ్లలో పిల్లల్లేరు

సర్దుబాటును పట్టించుకోని విద్యాశాఖ



ఒంగోలు(విద్య), జూలై 30: జిల్లాలో పిల్లలు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు ఖాళీగా ఉంటూ కాలక్షేపం చేస్తున్నారు. పాఠాలు చెప్పేందుకు పిల్లలు లేకపోవడంతో వీరిని ఖాళీగా కూర్చోబెట్టి ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలల్లో పిల్లలు లేకపోతే వాటిని తాత్కాలికంగా మూసివేసి అక్కడ పనిచేసే టీచర్లను పిల్లలు ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేస్తారు. అయితే విద్యాశాఖ అధికారులు ఆ పనిచేయకపోవడంతో టీచర్లు పాఠశాలల్లోనే ఉంటున్నారు. కొమరోలు, కంభం, గిద్దలూరు మండలాల్లోని కొన్ని ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లలో పిల్లలు లేకపోవడంతో అక్కడి టీచర్లు ఖాళీగానే ఉన్నారు. పిల్లలు లేకపోతే అక్కడి టీచర్లను పిల్లలు ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయమని జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర మండల విద్యాధికారులను ఆదేశించినా ఆచరణలో ఫలితం కనిపించలేదు. ఈ మండలాల్లో సుమారు 20మంది టీచర్లు పిల్లలు లేక ఖాళీగా ఉన్న పాఠశాలలకు కాపలా కాస్తూ అక్కడే తిష్టవేసి కూర్చుంటున్నారు. ప్రతినెల లక్షలాది రూపాయలు జీతాలు చెల్లిస్తూ వారితో పనిచేయించుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. టీచర్ల సంతకాల శ్రమకు జీతాలు చెల్లిస్తూ ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తున్నారు. విద్యాశాఖాధికారి దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

మార్టూరు - పర్చూరు తారురోడ్డు తీరే వేరు



పెద జాగర్లమూడి నుంచి యద్దనపూడి మధ్య కుంగిన రోడ్డు.. యద్దనపూడి - యనమదల గ్రామాల మధ్య దెబ్బతిన్న రహదారి.. యనమదల కూడలి వద్ద ఏర్పడిన పెద్ద గుంత

- మూడుచోట్ల దెబ్బతిన్న వైనం
- భారీ వాహనాలవల్లే నష్టం
- చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి

మార్టూరు, జూలై 30 : రోడ్డుకు ఇరువైపులా పొలాలు.. మధ్యలో అక్కడక్కడా గ్రామాలు.. ఈ గ్రామాలలో రోడ్డుకు ఇరువైపులా భవనాలు.. ఇదీ మార్టూరు నుంచి డేగరమూడి యనమదల గ్రామాల మీదగా యద్దనపూడి నుంచి పర్చూరుకు చేరే తారు రోడ్డు రహదారి. ఈ రహదారిలో మార్టూరు నుంచి పర్చూరుకు దూరం 22 కి.మీ. అరగంట సేపు ప్రయాణం. ఈ రహదారిలో గతంలో ఐదేళ్ల కిందట తారురోడ్డు వేశారు. పొలాల మధ్య ఈ రహదారిపై ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే గత రెండేళ్ల నుంచి ఈ రహదారి మరమ్మతులకు గురవుతున్నది. కొన్నిచోట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. మార్టూరు ప్రాంతం నుంచి కంకర, ఎర్ర మట్టిని టిప్పర్లు, డంపర్లతో భారీ వాహనాలు పర్చూరు ప్రాంతానికి రోజూ తరలిస్తున్నాయి. దాంతో ఈ వాహనాలు కారణంగా రోడ్డు దెబ్బతింటున్న మాట వాస్తవం. కానీ ఈ భారీ వాహనాలను ఆపడానికి అవకాశం లేదని వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్థులు అంటున్నారు. రోజూ భారీ వాహనాలు కారణంగా రోడ్డు దెబ్బతింటున్నా ఏమీ చేయలేకపోతున్నామని ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ రహదారిలో మూడు ప్రాంతాలలో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. వాటిలో యద్దనపూడి నుండి పెద జాగర్లమూడి వరకు యద్దనపూడి గ్రామ శివార్లు నుంచి పెద జాగర్లమూడి వరకు రోడ్డు చాలా చోట్ల తారుకోసుకు పోయింది. చాలాచోట్ల రోడ్డు కుంగిపోయింది. ఒక చోట ఏకంగా 100 అడుగులకుపైగా దూరం రోడ్డుపై తారుపూర్తిగా లేచిపోయి అడుగున ఉన్న కంకర రాళ్లు కూడా బయటపడ్డాయి. ఈ ప్రాంతంలో ఇంకా రోడ్డు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. వర్షాలు కురిసినపుడు ఈ రోడ్డుపై ఇంకా పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. భారీ వాహనాలు కారణంగా ఈ ప్రాంతంలోని రహదారి మున్ముందు మరింతగా భారీగా దెబ్బతినే అవకాశం ఉందని ఈ రోడ్ ద్వారా ప్రయాణించే ప్రయాణికులు అంటున్నారు.

యద్దనపూడి నుంచి యనమదల

యద్దనపూడి నుంచి యనమదల మధ్య దూరం రెండు కిలో మీటర్ల లోపే ఉంటుంది. ఇక్కడ రోడ్డు సింగిల్ రోడ్డు కావడంతో రోడ్డుపై ఏర్పడిన గుంతలు కారణంగా రోడ్డు మార్జిన్ దిగడానికి వాహనదారులు ఇష్టపడరు. అదేవిధంగా భారీ వాహనాలు వెళ్లే సమయంలో కూడా మిగిలిన వాహనదారులు మరింతగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై ద్విచక్రవాహనదారులు, ఆటో వాలాలు, ట్రాక్టర్లు నడిపేవారు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు.

యనమదల నుంచి చింతపల్లిపాడుకు

యనమదల-చింతపల్లిపాడు వరకు మధ్య దూరం కిలో మీటరు మాత్రమే ఉంటుంది. కానీ ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. యద్దనపూడి సెంటర్ వద్ద పెద్ద అగాధాలు ఏర్పడ్డాయి. అంతేగాకుండా యనమదల నుంచి చింతపల్లిపాడు వెళ్లే రోడ్డులో దేవాలయం మలుపు వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. అదేవిధంగా యనమదల ఎస్సీ కాలనీ వద్ద రోడ్డుపై భారీ గుంతల ఏర్పడ్డాయి. మార్టూరు నుంచి పర్చూరుకు వెళ్లే రహదారిలో చెడిపోయిన రోడ్డును బాగు చేయడం ఒక ఎత్తయితే ప్రస్తుతం బాగున్న రోడ్డు చెడిపోకుండా గుంతలు పడకుండా భారీ వాహనాల నుంచి కాపాడుకోవడం ముఖ్యమని ఈ రహదారి పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు భావిస్తున్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

తక్కువ ధరలకు వైద్య సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 30 : ప్రతి శనివారం తక్కువ ధరలకు వైద్య సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టిన శ్రీ కామాక్షి కేర్ హాస్పటల్ యాజమాన్యం, వైద్యులు అభినందనీయులని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. తాడివలస శంకర్ వర్ధంతి సందర్భంగా చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కొండయ్య చేతుల మీదుగా తక్కువ ధరలకు వైద్యసేవలందించే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడారు. అనంతరం డాక్టర్ తాడివలస దేవరాజ్ మాట్లాడుతూ తాము అందించే సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సేవలు, వైద్య పరీక్షల్లో అందిచే రాయితీలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుర్ల వెంకటరావు, గజవల్లి శ్రీనివాసరావు, కొత్తవరపు జనార్ధనరావు, రత్నబాబు, వీరయ్య మాస్టారు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన పెంచాలి



మాట్లాడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్

అద్దంకిటౌన్, జూలై 30 : ఉపాధి హామీ పథకం ద్వారా అందించే వివిధ రకాల పండ్ల తోటల రాయితీలపై రైతులకు అవగాహన పెంచి వాటి విస్తీర్ణాన్ని పెంచేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఉపాధి పథకం జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ పి.కిరణ్ అన్నారు. మంగళవారం అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో నియోజవర్గంలోని మూడు మండలాల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోలు, ఈసీలు, టీఏలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, హార్టికల్చర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. అద్దంకి నియోజకవర్గంలోని మండలాలలోని గ్రామాలలో ఆయా గ్రామాలలకు అనుకూలమైన పండ్ల మొక్కలు అందించడం వాటిపై వచ్చే రాయితీ, రాబడి వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించి నియోజకవర్గంలో పంట్ల తోల విస్తీర్ణం పెరిగేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ప్రతి మండలంలో 150 ఎకరాలు తగ్గకుండా అధికారులు అందరు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అద్దంకి, జె.పంగులూరు, బల్లికురవ మండలాల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోలు, ఈసీలు, టీఏలు, విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వంగడాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి ప్రశాంతి

చెరుకూరు (పర్చూరు), జూలై 30 : వంగడాలపై రైతులు అప్రమత్తంగా ఉండడంతోపాటు, నాణ్యమైన వరి విత్తనాలను ఎంపిక చేసుకోవడంలో అవగాహన కల్గి ఉండాలని బాపట్ల ఏరువాక కేంద్రం సమన్వయకర్త బాల మురళీధర్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని చెరుకూరు గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో పలు రకాల వరి వంగడాలపై శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. వరి విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. అనంతరం జడ్పీటీసీ మాజీ సభ్యులు దాసరి ఉషారాణి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించే విధంగా వ్యవసాయాధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎస్.మోహనరావు, వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, విశ్రాంత ప్రొఫెసర్ కారుమంచి విజయకుమార్, పంచాయితీ కార్యదర్శి కొసనా సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

వేటపాలెం పీహెచ్‌సీలో అధికారుల విచారణ

నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామన్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ



డాక్టర్ బాలరాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సిబ్బంది

వేటపాలెం(చీరాల), జూలై 30 : పీహెచ్‌సీలో డాక్టర్ బాలరాజు, ఫార్మసిస్టు వెంకట ప్రసాద్ మధ్య వివాదం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయమ్మ ఆదేశాల మేరకు విచారణ బృందం వేటపాలెం పీహెచ్‌సీని సందర్శించారు. డీపీఎం డాక్టరు రోహిణి, డీఐవో వెంకటేశ్వరరావు, జిల్లా కోఆర్డినేటర్ ప్రేమపావని విచారణ నిర్వహించారు. డాక్టరు బాలరాజు, ఫార్మసిస్టు వెంకట ప్రసాద్‌ను వేర్వేరుగా విచారణ చేశారు. వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విచారణ నివేదికను డీఎం అండ్ హెచ్‌వోకు అందజేస్తామన్నారు. ఈ క్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మను వివరణ అడగ్గా విచారణ బృందం అందజేసే నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామన్నారు. ఇదిలావుంటే డాక్టర్ బాలరాజు వేధింపుల నుంచి తమకు విముక్తి కల్పించాలని విచారణ అధికారులు ఉన్నప్పుడే సిబ్బంది డాక్టర్ బాలరాజుకు వ్యతిరేకంగా నిరసన తెలపడం విశేషం.



డాక్టర్ బాలరాజును విచారిస్తున్న అధికారుల

రోగులకు మెరుగైన సేవలందించాలి

ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జూలై 30 : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య వైద్యులు, సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు, సిబ్బంది మధ్య నెలకొన్న వివాదాల నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే కొండయ్య వేటపాలెం పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. వ్యక్తిగత కలహాల కారణంగా రోగులకు ఇబ్బందులు కల్పించడం సరికాదన్నారు. మరోసారి వివాదాలకు తావివ్వకుండా నడుచుకోవాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో ఉన్న రోగులతో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడారు. వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. గడువు తీరిన మందుల విషయం, వైద్యునిపై దాడి ఆరోపణ తదితర అంశాలకు సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. అంకిత భావంతో పనిచేయాలని చెప్పారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

సమస్యలపై అంగన్‌వాడీల వినతి

అద్దంకిటౌన్, జూలై 30 : తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ ప్రధాన కార్యాలయం మంగళగిరిలో మంత్రి కొండా శ్రీనివాస్‌ను, మాజీ ఎంపీ పనబాక లక్ష్మిని, యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు అచంట సునీతను సభ్యులు కలిసి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వాటిని సత్వరమే పరిష్కారించేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ నాయకులు కె.లక్ష్మీనరసమ్మ, జి.అనంతలక్ష్మి, కే.హేమలత, సీహెచ్. సామ్రాజ్యం, బీ నాగజ్యోతి, ఎస్‌కే మరియాంబి ఉన్నారు.



మొక్కు తీర్చుకుంటున్న గోవాడ టీడీపీ నేతలు

మొక్కు తీర్చుకున్న గోవాడ టీడీపీ నేతలు

అద్దంకి, జూలై 30 : మండలంలోని గోవాడకు చెందిన టీడీపీ నేతలు మంగళవారం పెనుగంచి ప్రోలులో మొక్కు తీర్చుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, గొట్టిపాటి రవికుమార్ మంత్రి పదవి చేపట్టడంతో గోవాడ టీడీపీ నేతలు పెనుగంచి ప్రోలు వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. టీడీపీ నేతలు పుట్టా సాంబయ్య, మాకినేని కొండలు, చెన్నయ్య, స్వాములు, రామాంజనేయులు ఉన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

అద్దంకి, జూలై 30 : అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.

ముగిసిన మాన్యం భూముల కౌలు వేలం

గత ఏడాది కంటే పెరిగిన ఆదాయం

చెరుకూరు(పర్చూరు), జూలై 30 : పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ, శ్రీ అగస్తేశ్వర స్వామి వార్ల మాన్యం భూముల కౌలు వేలం పాట ముగిసినట్లు ఆలయ కార్య నిర్వాహక కార్యదర్శి నాగయ్య తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో 284.51 ఎకరాలకు బహిరంగ వేలం నిర్వహించగా, రూ.53 లక్షల ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇవే భూములకు నిర్వహించిన కౌలు రూ.49,84,000 రాగా ఈఏడాది అదనంగా రూ.3,16,000లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పశుగణాభివృద్ధికి అందరూ సహకరించాలి



పశు పోషకులకు ఫాడర్ సీడ్‌ను అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, తదితరులు

అద్దంకిటౌన్, జూలై 30 : ఆడ దూడలు పుట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక కార్యక్రమాలను, పథకాలను పశు పోషకులు తెలుసుకొని పశుగణాభివృద్ధికి సహకరించాలని పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని యంపరాల గ్రామంలో పశు వైద్య శాఖ అధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం అద్దంకి పశు వైద్య శాల ఏడీ డాక్టర్ ఎం.మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు మాట్లాడుతూ 90శాతం అడదూడలు జననం కోసం ప్రత్యేక సిరమ్‌ను పశువులకు వేస్తారని తెలిపారు. దీని ద్వారా పాడి పశువుల అభివృదితోపాటు పోషకుల ఆర్థిక స్థితి మెరుగవుతుందన్నారు. అనంతరం పశు వైద్య శిబిరంలో గర్భకోశ వ్యాధులు వచ్చిన 70 పశువులకు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్న పశువులను వైద్యులు, 1962 అంబులెన్సు సిబ్బంది, పశు సహాయకులు, గోపాల మిత్రలు తదితరులు చికిత్సను అందించారు. రాజీవ్‌కాలనీలో ఉన్న పశుపోషకుల శిక్షణ కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి పశు పోషకులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, ఒంగోలు పశుగణాభివృద్ధి కార్యనిర్వాహణాధికారి డాక్టర్ బి.రవికుమార్, ఒంగోలు ఏడీ డాక్టర్ ఏ.రమేష్‌బాబు, గ్రామ సర్పంచ్ యడ్లపల్లి వెంకాయమ్మ, బొమ్మనంపాడు, కొరిశపాడు, కోనంకి, మేదరమెట్ల పశువైద్యశాలల వైద్యులు డాక్టర్ ఏలూరి ఆశోక్, డాక్టర్ బీ వెంకట్రావు, ఏ.క్రాంతికిరణ్, సయ్యద్ చికిత్సను అందించారు. పశు పోషకులకు మినరల్ మిక్చర్ ఫాడర్ సీడ్‌ను అందజేశారు.



ఆలయానికి చేరుకున్న బూదవాడ గ్రామస్థులు

అడి ఉప్పల్ అమ్మవారికి మొక్కులు

పంగులూరు, జూలై 30 : మండలంలోని బూదవాడ టీడీపీ గ్రామ నాయకులు అడిఉప్పల్‌లోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో మంగళవారం తమ మొక్కు తీర్చుకున్నారు. ఎన్నికలలో ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ విజయం సాధించడంతోపాటు మంత్రి కావాలని గ్రామస్థులు అమ్మవారికి మొక్కుకున్నారు. గొట్టిపాటి గెలవడంతోపాటు మంత్రి కావడంతో అడిఉప్పల్‌లోని శ్రీలక్ష్మీ అమ్మవారికి మొక్కు చెల్లించినట్లు బూదవాడ గ్రామ టీడీపీ నేత కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి మొక్కుకున్నారు. అనుకున్న విధంగా గొట్టిపాటి శాసన సభ్యునిగా ఘన విజయం సాధించి, మంత్రివర్గంలో కొలువుదీరడంతో బూదవాడ గ్రామస్థులు ప్రత్యేక వాహనాలలో అడిఉప్పల్ చేరుకుని మంగళవారం శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కు చెల్లించారు. కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, పిచ్చిరెడ్డి, మురకొండ సుబ్బారావు, గొట్టిపాటి కాజా, నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెకుముకి మాసపత్రికను వినియోగించుకోండి



పత్రికలను అందజేస్తున్న నాయకులు

అద్దంకిటౌన్, జూలై 30 : విద్యార్థులు సైన్స్ విజ్ఞానానికి సంబంధించిన చెకుముకి మాసపత్రికలను సద్వినియోపర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యాక్షుడు మన్నం త్రిమూర్తులు అన్నారు. మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో స్థానిక కాకానిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చెకుముకి మాసపత్రికలను త్రిమూర్తులు సౌజన్యంతో అందజేశారు. ఇలాంటి పత్రికలను వినియోగించుకొని విద్యార్థులు భవిష్యత్‌లో జరగబోయే అనేక పోటీ పరీక్షలలో విజయం సాధించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తంగా శ్రీనివాసరావు, హెచ్ఎం గురవయ్య, కావూరి రఘుచంద్, సీహెచ్ కృష్ణారెడ్డి, సోము అనూరాధా, సందిరెడ్డి పద్మావతి, ఈశ్వరమ్మ, సురేష్ పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 30 : పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంగళవారం మండలంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మలాది శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంక్ ప్రాంతంలో 18 రకాలు పండ్లు, పూల, నీడనిచ్చే మొక్కలు నాటారు. చెట్లు పెంచితేనే మనుగడ ఉంటుందని ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకరరావు, చిన్ని మురళీకృష్ణ, పుట్టరాజు శ్రీరామచంద్రమూర్తి, హరిప్రసాద్, నాగయ్య, రత్తయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేధింపులపై ఫిర్యాదు

ఇంకొల్లు, జూలై 30 : ఇంకొల్లుకు చెందిన పొనుగుబాటి అశ్విని తనను అత్తింటి వారు కాపురానికి రాకుండా మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అశ్వినికి మండలంలోని పెదనక్కపాలెం గ్రామానికి చెందిన లీలాప్రసాద్‌తో ఏడాది క్రితం వివాహం జరగగా భర్త, అత్త బావ తనను కాపురానికి రానివ్వకుండా మానసికంగా శారీరకంగా వేధిస్తున్నారని ముగ్గురిపై ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ ముస్తఫా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం బాపట్ల ఎస్పీని కలిసి న్యాయం చేయాలని కోరినట్లు అశ్విని తెలిపారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.1.50లక్షల సాయం

పర్చూరు, జూలై 30 : పర్చూరు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని అభివృద్ధి కమిటీ నిర్వాహకులు అన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గుంటా రాజేంద్ర ప్రసాద్ రూ.1.50లక్షల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కఠారి సురేంద్రబాబు, కోటా హరిప్రసాద్, రంగిశెట్టి ఆంజనేయులు, తులసి శివనాగేశ్వరరావు, కోటేశ్వరరావు, నరసింహం, జీ శ్రీనివాసరావు, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

సీనియర్ సివిల్ న్యాయాధికారి ప్రశాంతి

పర్చూరు, జూలై 30 : బాలికలు అప్రమత్తంగా ఉండాలని, మాయ మాటలు చెప్పేవారిని నమ్మొద్దని సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి అన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా దినం సందర్భంగా మంగళవారం అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రశాంతి మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. విదేశాల్లో ఉద్యోగం ఇస్తామని, మాయమాటలు చెప్పే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థినీ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. విద్యతోనే అభివృద్ధి అన్న విషయం మరవరాదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహల్దార్ యు.శ్రీనివాసరావు, పర్చూరు బార్ అసోషియేషన్ అధ్యక్షులు సీహెచ్. రమణి, న్యాయవాది ధనలక్ష్మి, ప్రిన్సిపాల్ విశ్వవాణి, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

యువత చైతన్యవంతం కావాలి

అద్దంకి: మానవ అక్రమ రవాణా నిరోధంపై యువత చైతన్యవంతం కావాలని న్యాయవాది ప్రకాష్ అన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధ దినం సందర్భంగా మంగళవారం హర్షిణీ డిగ్రీ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. కార్యక్రమంలో న్యాయవాది మహ్మద్ రఫీ, జ్యోతి రమేష్‌బాబు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి ప్రశాంతి

'కామధేను'లో నేడు పశువుల వేలం

కొండాపురం, జూలై 30 : మండలంలోని చింతలదీవి గ్రామంలో ఉన్న జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రంలో 13 రకాల దేశీయ ఆవు జాతులు, 5 రకాల గేదె జాతులను బుధవారం వేలం నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం జేడీ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 182 పశువులను వేలం నిర్వహిస్తున్నామని, పాల్గొనదలచిన రైతులు ఉదయం 11 గంటల్లోగా రూ.10 వేలు ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో పశువులను దక్కించుకున్న రైతులు మొత్తం నగదును చెల్లించి వారి సొంత ఖర్చులతో స్వగ్రామాలకు తరలించుకోవాలని తెలిపారు.

వత్తాసులపై వేటు

- దేవదాయ శాఖలో ఐదుగురు ఈవోల సస్పెన్షన్
- దండుకున్నది వైసీపీ నేతలు.. బలైంది అధికారులు

దేవుళ్లను, దేవాలయాల ఆస్తులను వదిలిపెట్టని వైసీపీ నేతల పాపం ఆలయాల కార్యనిర్వహణ అధికారుల (ఈవో) పాలిట శాపంగా మారింది. వైసీపీ నేతలతో అంటకాగిన నేరానికి ఐదుగురు ఈవోలపై సస్పెన్షన్ వేటు పడింది. జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో పనిచేసిన ఇద్దరు ఈవోలు, ఉలవపాడు వేణుగోపాలస్వామి ఆలయంలో పనిచేసిన, చేస్తున్న ఇద్దరు ఈఓలు, వింజమూరు మండలం నల్లగొండ్ల లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈవోను సస్పెండ్ చేస్తూ దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.


వెంకటేశ్వర్లు


గిరికృష్ణ


జానకమ్మ


పీఎస్వీ ప్రసాద్


మల్లికార్జున్

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), జూలై 30 : ఉలవపాడు మండలం వేణుగోపాలస్వామి ఆలయా నికి ప్రకాశం జిల్లా సింగ రాయకొండలో 30 ఎకరాల మెట్ట పొలం ఉంది. ఇందులో ఖరీదైన క్వారీ నిక్షిప్తమై ఉంది. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు ఈ దేవుని భూమిపై కన్నేశారు. సుమారు మూడేళ్లకుపైగా దేవస్థానం భూమిని కుళ్లబొడిచి అక్రమ మైనింగ్ చేసి రూ.కోట్లు దండుకున్నారు. ఈ దోపిడీపై ఆంధ్రజ్యోతి పలుసార్లు కథనాలు ప్రచురించింది కూడా. అయినా దోపిడీ మాత్రం యథేచ్ఛగా సాగిపోయింది. ఈ దోపిడీని అడ్డుకోవాల్సిన ఆలయ ఈఓలు వైసీపీ నాయకుల పెత్తనానికి భయపడ్డారో లేదా ప్రలోభాలకు లొంగిపోయారో తెలియదు కానీ మౌనంగా ఉండిపో యారు. ఆలయ భూమిని సంరక్షించాల్సిన స్థానంలో ఉండి కూడా కనీసం పోలీసులకు, జిల్లా ఉన్నతాధికారు లకు ఫిర్యాదు చేసే సాహసం చేయలేదు. దాని ఫలితం ఇప్పుడు అనుభవి స్తున్నారు. దేవాలయ భూమిని కాపాడే విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియో గాలపై ఆలయ పూర్వ ఈఓ యు.జానకమ్మ, ప్రస్తుత ఈఓ పీఎస్వీ ప్రసాద్‌లను సస్పెండ్ చేశారు.

- బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్న వాడ కామాక్షి తాయి ఆల యంలో కూడా ఇదే జరిగింది. వైసీపీ ముసుగు కప్పుకున్న నాయకులు చేసిన పాపాల్లో చేయి కలిపిన నేరానికి ఇద్దరు ఈఓలపై వేటు పడింది. కామాక్షితాయి ఆలయంలో కుంబాభిషేకం, కోటి కుంకుమార్చన పేరుతో రూ.కోట్లు భోజంచేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అలాగే దాతలు ఇచ్చిన విరాళాల లెక్కలు గల్లంతు అయ్యాయనే ఫిర్యాదుల అందడంతో ఇటీవల దేవదాయ శాఖ ఉన్నతాధికారులు మూడు రోజులపాటు విచారించారు. సుమారు 3 కోట్ల రూపాయల మేర అవినీతి జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ అవినీతిలోనూ ముఖ్య పాత్రధారులు వైసీపీ ప్రాపకంతో పాలకమండలి పదవులు వెలగబెట్టిన వారేననే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కాలంలో పనిచేసిన ఈఓలు తాము ఆలయ పరిరక్షకులమనే విషయాన్నే మరిచిపోయి అధికార పార్టీ నాయకులకు సాగిలపడ్డారు. అవినీతి సొమ్ములో అంతో ఇంతకో ఆశపడిన నేరానికి వీరిపై వేటు పడింది. అవినీతి, అక్రమాలు జరిగాయనే అభియోగాలపై ఆలయ పూర్వ ఈఓ, ప్రస్తుతం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ ఈవోగా ఉన్న డబ్బుగుంట వెంకటేశ్వర్లు, కొంతకాలం ఇన్‌చార్జి ఈఓగా, ప్రస్తుతం వేదగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈఓగా పనిచేస్తున్న గిరికృష్ణలను దేవదాయ శాఖ సస్పెండ్ చేసింది.

- వింజమూరు మండలం నల్లగొండ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ బొగ్గల మల్లికార్జున్ రెడ్డి ఆలయ నిర్వహణలో నిబంధనలు అతిక్రమించారని, దేవాలయ ఆస్తుల వేలం పాటలో వైసీపీ నేతల ఆదేశాలను పాటించి తక్కువ ధరకు ధారాదత్తం చేశారనే అభియోగాలు వచ్చాయి. ఈ కారణలతో మల్లికార్జునపైనా వేటు పడింది

'మినగల్లు' యార్డులో ఇసుక దొంగలు!

- 12 వేల టన్నులకు తేలని లెక్క
- 41 వేల టన్నులకు అమ్మింది 29 వేల టన్నులే
- రూ.45 లక్షల విలువైన ప్రజాధనం స్వాహా
- దొంగ బిల్లులతో తరలిస్తున్నట్లు ఆరోపణలు

నెల్లూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు ఇసుక యార్డులో దొంగలు పడ్డారు. యార్డులో దొంగలు పడటం ఏమిటనుకుంటున్నారా..? ఇది నిజం. యార్డులో 12 వేల టన్నుల ఇసుక మాయమైంది. విక్రయాలకు ముందు అధికారులు వేసిన కొలతలకు.. విక్రయాలు పూర్తయ్యాక వచ్చిన లెక్కలకు పొంతన కుదరడం లేదు. ఈ నెల 8వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రారంభించింది. రీచ్‌లలో తవ్వకాలకు పర్యావరణ అనుమతులు వచ్చే వరకూ యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుకను ప్రజలకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని మర్రిపాడు, మినగల్లు, పల్లిపాడు యార్డులలో మాత్రమే ఇసుక నిల్వలు ఉన్నాయి. మైనింగ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా డీజీపీఎస్ సర్వే చేసి మర్రిపాడులో 1.25 లక్షల టన్నులు, మినగల్లులో 41 వేల టన్నులు, పల్లిపాడులో 8 వేల టన్నుల ఇసుక అందబాటులో ఉందని నిర్ధారించారు. ఇది డిజిటల్ సర్వే కావడంతో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఉండదు. దీంతో ఆ యార్డుల్లో సీనరైజ్, రవాణా వంటి ఖర్చులను కలుపుకొని టన్ను రూ.370 చొప్పున విక్రయించారు. వీఆర్వోలు, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ల ఆధ్వర్యం లో విక్రయాలు జరిగాయి. లోడింగ్, నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీకు అప్పగించారు. మినగల్లులో ఐదు రోజుల క్రితం ఇసుక నిల్వలు అయిపోవడంతో విక్రయాలు నిలిచిపోయాయి. మొత్తంగా విక్రయించిన ఇసుక లెక్కలు తీస్తే 29 వేల టన్నులు మాత్రమే అమ్మినట్లు తేలింది. మరి ప్రారంభంలో 41 వేల టన్నుల ఇసుక ఉండగా చివరకు 29 వేల టన్నులే తేలడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఖచ్చితంగా కొలతలు వేసి లోడింగ్ చేయడం లేదు కాబట్టి ఒకవేళ తేడా వస్తే ఐదు వందలో లేదా వెయ్యి టన్నులో తేడా రావాలి గానీ, ఏకంగా 12 వేల టన్నుల తేడా రావడం చర్చనీయాంశంగా మారింది.

- కొరతను పూడ్చేయత్నం



టన్ను రూ.370 లెక్కన దాదాపు రూ.45 లక్షల విలువైన ప్రజాధనం స్వాహా జరిగినట్లు అర్థమవుతోంది. యార్డులో తగ్గిన 12 వేల టన్నుల ఇసుకను మినగల్లు నుంచి తవ్వి డంప్ చేసేందుకు ఏజెన్సీ ప్రతినిధులు ప్రయత్నించగా వారిని అధికారులు అడ్డుకున్నట్లు తెలిసింది. లోడింగ్‌కు అనుమతులు ఇచ్చింది యార్డులో మాత్రమేనని, నదిలో నుంచి కాదని వారించడంతో ఏజెన్సీ వెనక్కు తగ్గినట్లు సమాచారం. ఇంత భారీ స్థాయిలో ఇసుక తేడా వచ్చినా అధికారులు మౌనంగా ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

- పల్లిపాడులో ఎక్కువ

మినగల్లు యార్డులో ఇసుక విక్రయాలపై మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలుదారులకు, యార్డు నిర్వాహక ఏజెన్సీ ప్రతినిధులకు మధ్య పలుమార్లు వివాదాలు కూడా జరిగాయి. క్యూలో ఉన్న తమకు కాదని, దొంగ బిల్లులతో కొందరికి ఇసుకను వేగంగా లోడ్ చేస్తున్నారని వాహనదారులు ఆరోపణలు చేశారు. ఇందులో నిర్వాహక ఏజెన్సీ, రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కయ్యారని ప్రచారం జరిగింది. ఆ ప్రచారానికి బలం చేకూర్చేలా ఇప్పుడు ఇసుక నిల్వల్లో తేడా వచ్చింది. మినగల్లులో ఉన్న ఏజెన్సీనే పల్లిపాడు యార్డులో కూడా చేసింది. అక్కడ మాత్రం అధికారులు వేసిన కొలతల కన్నా 40 టన్నుల ఎక్కువగా విక్రయాలు జరిగాయి. ఈ వ్యవహారంపై బుచ్చి ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆనంద్‌ను వివరణ కోరగా మినగల్లు యార్డులో 12 వేల టన్నుల ఇసుక తేడా వచ్చింది వాస్తవమేనని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని పేర్కొన్నారు. కాగా కలెక్టర్ ఓ ఆనంద్‌ను వివరణ కోరగా ఈ వ్యవహారంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

నెల్లూరు కమిషనర్ సంతకం ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్ట్ ?

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూలై 30 : నెల్లూరు నగర పాలక సంస్థకు ఇటీవల వరకు కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ సంతకం ఫోర్జరీ చేసిన కేసులో నగర మేయర్ భర్త జయవర్ధన్ ప్రధాన అనుచరుడు శివకృష్ణను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించాల్సి ఉంది. దీనిపై దర్గామిట్ట స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా ఏమో అరెస్ట్ చేశారా?, జైలుకు పంపారంటుగా? అంటూ సమాధానం ఇచ్చారు. తన సంతకాలను ఫోర్జరీ చేశారంటూ గత కమిషనర్ వికాస్ దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేయర్ భర్త జయవర్ధన్‌తో పాటు, శివకృష్ణ, మరో నలుగురిని నిందితులుగా చేరుస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితులను అదుపులోకి తీసుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. పరారీలో ఉన్న శివకృష్ణను సాంకేతికత ఆధారంగా మంగళవారం అరెస్ట్ చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

మాదక ద్రవ్యాల కట్టడికి చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

నెల్లూరు(క్రైం), జూలై 30: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల కట్టడికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్పీ జీ కృష్ణకాంత్ పోలీసు కార్యాలయం నుంచి నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. కలెక్టర్ తన కార్యాలయం నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. యువత మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. భావితరాలపై మాదకద్రవ్యాల ప్రభావం పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హాస్టల్స్‌లో తనిఖీలు నిర్వహించాలని, మాదక ద్రవ్యాలకు బానిసైన యువతకు డీఅడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించి వారిలో పరివర్తన తీసుకువచ్చేలా చొరవ చూపాలన్నారు. ఆర్టీసీ, రైల్వే రవాణా వ్యవస్థ, చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఎస్పీ కృష్ణకాంత్ మాటాడుతూ మాదక ద్రవ్యాలు, నిషేధిత మత్తుపదార్థాల అమ్మకం, నిల్వ, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎస్ఈబీ ఈఎస్ బాబుశ్రీధర్, జిల్లా వైద్య అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశు ఆరోగ్యానికి 'కిల్కారి'ని సద్వినియోగం చేసుకోవాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), జూలై 30 : మాతా, శిశు ఆరోగ్యానికి సంబంధించి కిల్కారి మొబైల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సూచించారు. మంగళవారం ఆశా నోడల్ అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమీ సేవలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు ఆరోగ్య భద్రత, గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. వారి ఆరోగ్య నియమాలు, తీసు కోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు కిల్కారి పేరిట వాయిస్ కాల్స్ అందించేందుకు ప్రభుత్వం దీనికి రూపకల్పన చేసిందని వివరించారు. గర్భం దాల్చిన తర్వాత ఏఎన్ఎంల దగ్గర వివరాలు నమోదు చేయించుకుంటే ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయని చెప్పారు. గర్భందాల్చి నప్పటి నుంచి కాన్పు తర్వాత బిడ్డకు ఏడాది వయసు వచ్చేంత వరకు 72 సార్లు ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ టీం కన్సల్టెంట్ రవీంద్ర, రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ లంక పల్లి రాజు, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, ప్రోగ్రాం అధికారి కీర్తి, డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో కనకరత్నం, రమేష్, మంజుల, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఒకటినే వందశాతం

- పెన్షన్ల పంపిణీకి రంగం సిద్ధం
- 7 వేల మంది ప్రభుత్వ సిబ్బందితో పంపిణీ
- జిల్లాలో 3,13,784 మంది పెన్షనుదారులు



నెల్లూరు (హరనాథపురం); జూలై 30 : ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆగస్టు 1వ తేదీన వందకు వంద శాతం పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లాయంత్రాంగం కూడా విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఎన్డీయే ప్రభు త్వం అధికార చేపట్టిన మొదటి జూలై 1న జిల్లాలో 99 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసి అధికారులు రికార్డు సృష్టించారు. వలంటీర్లు లేకపోయినా సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లను పంపిణీ చేయించారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఆగస్టు 1వ తేదీనే జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులందరికీ పెన్షన్ సొమ్ము నూటికి నూరుశాతం అందించడానికి చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ఆనంద్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మండల, మున్సిపల్ అధికారులతో పెన్షన్ల పంపిణీపై సమీక్షించి, పలు సూచనలు చేశారు.

- నేడు బ్యాంకుల నుంచి నగదు

జిల్లాలో పెన్షన్ల పంపిణీకి సంబంధించి బుధవారం నాడే (31న) బ్యాంకుల నుంచి సచివాలయ సిబ్బంది (జిల్లావ్యాప్తంగా 7వేలమంది) నగదు తెచ్చుకొని పంపిణీకి సిద్ధం కానున్నారు. గురువారం తెల్లవారు జాము 5.30 గంటల నుంచే పెన్షన్ పంపిణీ జిల్లాలో ప్రారంభం కానుంది. కాగా, జిల్లాలో సామాజిక పెన్షన్ల లబ్ధిదారులు 3,13,784 మంది ఉండగా, వీరికి ప్రతి నెలా రూ.132.58 కోట్లు పెన్షన్ రూపంలో అందిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

ఆగస్టు 1న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను నూటికి నూరు శాతం పంపిణీ చేయించడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఉదయాన్నే ప్రభుత్వ సిబ్బంది పెన్షనర్ల ఇళ్లకు వెళ్లి పింఛను నగదు పంపిణీ చేస్తారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్దనే ఉండి పెన్షన్ అందుకోవాలి.


- సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

వైసీపీ ఐదేళ్ల పాలనలో నత్తనడకన సాగిన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు మళ్లీ ఊపందుకోనున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో ఈ లైన్‌కు రూ.150 కోట్లు ప్రకటించగా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా అదనంగా ఇవ్వనుంది. ఇప్పటికే దర్శి, పొదిలి ప్రాం తాల్లో పనులు పూర్తి కావస్తుండగా కనిగిరి, పామూ రు ప్రాంతాల్లో పనులు పునఃప్రారంభ మయ్యాయి. ఏడాదిలోపు అక్కడ పనులు పూర్తయి నెల్లూరు జిల్లాలో పనులు ప్రారంభించనున్నారు. దీంతో మెట్ట వాసులకు రైలులో ప్రయాణ భాగ్యం అందుబాటులోకి రానుంది.

- కేంద్ర బడ్జెట్‌లో రూ.150 కోట్ల కేటాయింపు
- నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులు వేగవంతం
- ఇప్పటికే జిల్లా పరిధిలో 2,268 ఎకరాల సేకరణ

'మెట్ట'లో రైలు కూత!

ఉదయగిరి రూరల్, జూలై 30 : గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల మీదుగా 38 స్టేషన్లతో 309 కిలోమీటర్ల పొడవున నడికుడి శ్రీకాళహస్తి రైల్వేలైన్ ఏర్పాటు కానుంది. మెట్ట ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ అభివృద్ధి చెందడంతో పాటు హైదరాబాదు, విజయవాడ వంటి నగరాలకు దూరం తగ్గనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సం యుక్తంగా ఈ నిర్మాణాన్ని చేపట్టనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సగం వ్యయం సమకూర్చడంతోపాటు భూసేకరణ ఖర్చును భరించాల్సి ఉంది. 2011-12 బడ్జెట్‌లో రూ.2,289 కోట్లతో కేంద్రం ఈ ప్రాజెక్టు కు శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2016 వరకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. గతేడాది రూ.202 కోట్లు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో రూ.150 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా తన వాటా కేటాయించనుంది. తొలుత గుంటూరు జిల్లా పిడుగురాళ్ల నుంచి పనులు ప్రారంభమయ్యాయి. దర్శి, పొదిలి ప్రాంతాల్లో పనులు దాదాపుగా పూర్తి కాగా ట్రయల్ రన్ కూడా నిర్వహిం చారు. కనిగిరి, పామూరు ప్రాంతాల్లో పనులు పునఃప్రారంభమయ్యాయి. మరో ఏడాదిలో నెల్లూరు జిల్లాలో పనులు ప్రారంభించనున్నారు. వరికుంటపాడు, వింజమూరు, ఆత్మకూరు, రాపూరు, వెంకటగిరి మండలాల మీదుగా 15 స్టేషన్లతో రైల్వే మార్గం పనులు సాగనున్నాయి. ఈ లైన్ నిర్మాణానికి 5,189 ఎకరాల భూమి అవసరం. 2019లోనే గ్రామ సభలు నిర్వహించి సుమారు 2,268 ఎకరాలను అధికారులు సేకరించారు. ఇందుకు సంబంధించి పలువురికి వారి ఖాతాల్లో పరిహారం సైతం జమైనట్లు సమాచారం.



- ప్రయోజనాలెన్నో..

రాష్ట్రాభివృద్ధితోపాటు జాతీయ రవాణాలో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను కీలకంగా మారుతుందని పలు సర్వేల్లో తేలింది. తిరుపతి, హైదరాబాదు మధ్య 80 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతులకు ఈ లైన్ ఊతంగా నిలుస్తుంది. సిమెంట్, గ్రానైట్ ఉత్పత్తుల రవాణాకు వీలు కలుగుతుంది. తుఫాన్లు, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో ఈ రైల్వేలైన్ ప్రత్యామ్నాయంగా దోహదపడుతుంది. ఈ మార్గం అందు బాటులోకి వస్తే గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యే అవకాశం ఉంది.


రైల్వేలైన్ కోసం రాపూరు ప్రాంతంలో సేకరించిన భూమి (ఫైల్)





కౌలు రైతుకు 'గుర్తింపు'

● ప్రారంభమైన సీసీఆర్‌సీ జారీ ప్రక్రియ
● ముమ్మరంగా గ్రామసభల నిర్వహణ



అనంతసాగరం: రైతులకు అవగాహన కల్పిస్తున్న అనంతసాగరం ఏవో

అనంతసాగరం, జూలై 30: ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు రైతులను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసే కార్యక్రమాన్ని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ప్రారంభించారు. అందుకు పల్లెల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి భూ యజమానులను ఒప్పించేలా అవగాహన సదస్సులు నిర్వహించారు. 11నెలల కాలపరిమితితో సాగు హక్కు పత్రాలను ప్రభుత్వం జారీ చేయనుంది. జిల్లాలో సుమారు 50వేల మంది కౌలురైతులు ఉన్నట్లు అధికారుల ప్రాథమిక అంచనా. అయితే ఏటా వర్షాభావ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలతో వారు నష్టపోతున్నారు. సాగుహక్కు పత్రాలు లేక బీమా పరిహారం, బ్యాంకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర ప్రయోజనాలు సక్రమంగా అందక ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కౌలురైతులు సమస్యలు అధిగమించే దిశగా ప్రభుత్వం సాగు హక్కుదారుల చట్టం 2019 ప్రకారం సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది.

ప్రైవేటు కౌలుతో నష్టం..

చాలా మంది రైతులు ప్రవేటుగా కౌలు తీసుకొనే సాంప్రదాయం నేటికి కొనసాగుతోంది. దీంతో వారికి ప్రభుత్వ పరంగా రావాల్సిన రాయితీలు, బ్యాంకుల నుంచి పంట రుణాలు అందక అధిక వడ్డీలతో ప్రవేటు వ్యక్తుల నుంచి పెట్టుబడి సాయం తెచ్చుకోంటున్నారు. పంట చేతికందిన వెంటనే వడ్డీతో సహ వారికి చెల్లించాలి. పంట దిగుబడులు తగ్గిన ఇందులో మినహాయింపు లేక కౌలుదారులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. వాటన్నింటిని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లోనే సాగు హక్కు పత్రాలు అందించి.. రైతులను ఆదుకొనేలా పనులు ప్రారంభించింది. కౌలు రైతు కార్డు పొందాలంటే భూ యజమాని రాతపూర్వక అగ్రిమెంటు, అడంగల్ తీసు కోవాలి. కొందరు భూ యజమానులు అపోహతో ససేమిరా అంటుండగా వారికి అవగాహన కల్పించే దిశగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించి నిర్దేశిత కాలంలోపు సీసీఆర్‌సీ కార్డులను కౌలుదారులు పొందాలని అధికారులు చెబుతున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కాలువలు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు!

● పట్టించుకోని అధికారులు


అరటితోటలో కాలువ స్థలంలోకి వచ్చిన ఇంటి నిర్మాణం

కావలి, జూలై 30 : కావలి పట్టణం పాతూరులోని అరటితోటలో కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆ ప్రాంతం ఇటీవల కాలువలు, రోడ్లు సైతం ఆక్రమించి నూతన నిర్మాణాలు విస్తరిస్తున్నా, నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించకపోయినా పట్టించుకునేవారు కరువయ్యారు. పట్టణ పరిధిలో ఉన్న లేఅవుట్ల మధ్యలో ఇటీవల అధికారులు అడ్డ కాలువను సర్వే చేయగా దానిని ఆక్రమించి అనేక మంది నిర్మాణాలు చేట్టినట్లు తేలింది. అయితే కొన్నిచోట్ల కొన్ని నిర్మాణాలు పూర్తిగా కాలువ పరిధిలోకి రావడంతో అప్పటికే నిర్మాణాలు పూర్తి చేసి ఉన్నందున వాటిని వదిలి కాలువ నిర్మాణం చేపట్టారు. ఆ కాలువ సర్వే చేసి వేసిన మార్కింగ్ చూస్తే కాలువ లోపలకు ఇళ్ల నిర్మాణం కనిపిస్తోంది. అలాగే ఆ ప్రాంతంలో నూతనంగా చేపడుతున్న నిర్మాణాలలో అనేక చోట్ల డ్రైనేజీలు ఆక్రమణకు గురవుతోన్నాయి. మరి కొన్ని చోట్ల వాస్తవంగా ఉండాల్సిన డ్రైనేజీలను ఇష్టానుసారంగా దారి మళ్లించి నిర్మాణాలు చేపట్టారు. అలాంటి చోట మున్సిపల్ అధికారులు ఎలా అనుమతులిచ్చారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నూతన నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇచ్చేటప్పుడు సర్వేయర్ స్కెచ్ తీసుకోవాలి. వారు నిర్మిస్తున్న స్థలంలో ప్రభుత్వ స్థలం ఉందేమోనని నిర్ధారణ చేసుకుని ఇస్తే భవిష్యత్‌లో సమస్యలు ఉండవని ప్రజలు కోరుతున్నారు.

పూసల కాలనీలో వైద్యశిబిరం


ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది

ఉదయగిరి రూరల్, జూలై 30: పట్టణంలోని పూసల కాలనీలో మంగళవారం గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఎం.శివకల్పన ఆధ్వర్యంలో సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 30మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా జ్వరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ

ఆత్మకూరు, జూలై 30: డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా మపిమలూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవానంద్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది రామస్వామిపల్లిలో మంగళవారం డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవానంద్ మాట్లాడారు. మలేరియా, డెంగ్యూ, పైలేరియా, చికెన్ గున్యా తదితర రోగాలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగుదొడ్ల గాలిగొట్టాలకు మెస్‌లు అమర్చుకోవాలని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు వహిస్తే అంటువ్యాధులు దరిచేరవని వివరించారు. అనంతరం ఇంటింట లార్వా సర్వే నిర్వహించి జ్వరపీడుతులు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి షేక్ ఖాదర్‌బాషా, హెల్త్ సూపర్‌వైజర్ సైదా, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పొదుపు మహిళలతో ప్రమాదబీమా చేయించాలి


మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర

ఆత్మకూరు, జూలై 30: పొదుపు మహిళలకు ప్రమాదబీమా పథకంపై అవగాహన కల్పించి బీమా చేయించాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో బ్యాంకర్లు, మెప్మా సిబ్బంది, ఆర్పీలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడారు. పీఎంజేబీవై, సీఎంఎస్ బీవై పథకాలలో పొదుపు మహిళల కుటుంబసభ్యు లందరినీ చేర్పించాలన్నారు. 18నుంచి 70ఏళ్లలోపు వారు రూ.20లు ప్రీమియం చెల్లించిన వారికి రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. పీఎంజేబీవై పథకం ద్వారా రూ.436 చెల్లిస్తే సహజ మరణాలకు రూ.2లక్షల బీమా సౌకర్యం వస్తుందన్నారు. ఆర్పీలందరూ తమ పరిధిలోని పొదుపు మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ టిఎస్ ప్రదీప్ కుమార్, బీఎల్ సురేంద్ర, ఐబీ అంకయ్య, సీవో మాధవి పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు పౌష్టికాహారం

ఆత్మకూరు, జూలై 30: ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఆత్మకూరు అర్బన్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అస్మా తెలిపారు. మంగళవారం ఆమె పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంటశాల, రికార్డులను పరిశీలించారు. వంట మనుషులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. తాజాగా ఉండే కూరగాయలను మాత్రమే ఉపయోగించాలని, విద్యార్థులకు వేడిగా ఉండే ఆహారాన్ని మాత్రమే అందించాలని పేర్కొన్నారు. వంట గదుల్లోకి దోమలు, ఈగలు రాకుండా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవోలు పద్మనాభరెడ్డి, స్పందన, ఎంపీ హెచ్‌ఈ సిద్ధం సుధాకర్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉదయగిరి రూరల్, జూలై 30: స్థానిక ఆర్టీసీ డిపో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎన్‌ఎంయూఏ మాజీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.రమణరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో డిపో అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిపో పరిధిలో అవసరమైన మేరకు దూరప్రాంత సర్వీసులను పెంచడంతో పాటు రద్దు చేసిన గ్రామీణ ప్రాంతాల సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు మెరుగైన వైద్యసేవలందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. డిపో, యూనియన్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అనంతరం డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎం యూఏ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ రెడ్డి, జిల్లా చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డీ.శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి బీ.తిరుపతి, వెంకటేశ్వర్లు, ఆర్‌కే విశ్వనాథ్, విజయ కుమార్, ఫణికుమార్, సలాం పాల్గొన్నారు.

బదిలీ తహసీల్దార్లకు సన్మానం


ఉదయగిరి రూరల్: తహసీల్దారును సన్మానిస్తున్న ఉద్యోగులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 30: బదిలీపై వెళుతున్న మండల తహసీల్దారు యశోదను మంగళవారం కార్యాలయ అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఉన్నతాధికారులు ఆమెను తిరిగి పూర్వ జిల్లాకు బదిలీ చేశారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ గులాం, వీఆర్వోలు పాల్గొన్నారు.


వరికుంటపాడు: తహసీల్దారును సన్మానిస్తున్న ఉద్యోగులు

వరికుంటపాడు: ఎన్నికల విధుల్లో మండల తహసీల్దారుగా వచ్చిన విజయవాడ సీఆర్‌డీఏ తహసీల్దారుగా అరుణాదేవి తిరిగి యథాస్థానానికి బదిలీ అయ్యింది. మంగళవారం కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్య క్రమంలో డీటీలు నరసారెడ్డి, చంచయ్య, ఆర్ఐ సాయికిరణ్, జూనియర్ అసిస్టెంట్ సుబానీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో ఉపాధి పనులు

కలువాయి, జూలై 30: కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం కుల్లూరులో అధికారులు ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. వైసీపీ హయాంలో నాలుగేళ్లుగా ఈ పనులు సరిగా చేయలేదని కొందరు కూలీలు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో కూడా మూడు రోజులు పని చేపట్టి నిలిపివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పనులు ప్రారంభం కావడంతో కూలీలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పనుల పరిశీలన: నూకనపల్లిలో ఉపాధి హామీ కింద జరుగుతున్న పంట కాలువ పనులను మంగళవారం ఎంపీడీవో ప్రభాకర్, ఏపీవో మురళీ తనిఖీ చేశారు. కూలీల మస్టర్లను పరిశీలించారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

సీతారామపురం, జూలై 30: ఉదయగిరి ఫారెస్ట్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు సూచనలు మేరకు ఉదయగిరి రేంజ్‌లోని సీతారామపురం సెక్షన్ డిప్యూటీ రేంజర్ వెంకట ప్రసాద్ సిబ్బందితో మంగళవారం చింతుడు, బోడసిద్దయిపల్లి, గుండుపల్లి గ్రామల ప్రజలకు అటవీ, వన్యప్రాణి సంరక్షణ చట్టాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్స్ ఖాజా, గౌతమ్ పాల్గొన్నారు.

గంగమ్మ గ్రామోత్సవం




సంగం, జూలై 30: స్థానిక నిమ్మతోపు సెంటర్ అభయ గంగమ్మతల్లి జాతరలో భాగంగా సోమవారం అర్ధరాత్రి గంగమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవానికి భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఉదయం గంగమ్మతల్లి మూలవిరాట్‌ను పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

సీతారామపురం. జూలై 30: ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, కార్యదర్శి జీవన్ కుమార్‌లు సీతారామపురంలోని పరమటివీధి, హరిజనవాడలో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలోని మురుగు కాలువలలో పూడిక తీయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

చిత్రపటాల అందజేత

వరికుంటపాడు, జూలై 30: స్థానిక మండల పరిషత్, వెలుగు కార్యాలయాలకు గణేశ్వరాపురం గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకులు పేరం సుధాకర్‌రెడ్డి మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి, ఏపీఎం వైనారూత్, జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, తెల్లగొర్ల వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వరికుంటపాడు, జూలై 30: అధికారులు విధుల్లో బాధ్యతగా వ్యవహరించి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ, వైఎస్ ఎంపీపీ రావిళ్ల నాగేంద్ర, దేవనబోయిన మధు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. కీలక సమావేశానికి వైద్యాధికారితో పాటు పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో సరికాదని మండిపడ్డారు. వరికుంటపాడు నుంచి జీ.కొండారెడ్డిపల్లి వరకు నూతనంగా నిర్మించిన రోడ్డు సమీపంలోని ప్రమాదకర నేలబావులకు రక్షణగోడలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వరికుంటపాడు సర్పంచ్ దిలీప్‌కుమార్ మాట్లాడారు. ఉపాధి పనులు చేపట్టాలని తీర్మానాలు ఇచ్చినా అధికారులు పనులు కల్పించడంపై మండిపడ్డారు. బస్టాండ్ సెంటర్, కార్యాలయ ఆవరణలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. 24 మంది సర్పంచుల్లో కేవలం ఐదుగురు మాత్రమే సభకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లక్ష్మణ్‌నాయక్, ఎంఈవో రమణయ్య అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుంతలమయంగా నల్లపరెడ్డిపల్లి రోడ్డు



ఆత్మకూరు, జూలై 30: మండలంలోని నల్లపరెడ్డిపల్లి తారు రోడ్డు గుంతలమయంగా మారింది. పెద్ద గుంతల్లో వాహనాలతో వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డిపల్లికి, నల్లపరెడ్డిపల్లి మీదుగా మురగళ్ల, కనుపూరుపల్లి గ్రామాలకు ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. నిత్యం రాకపోకలు జరుగుతుండటంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. గతంలో సమస్యను ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డులో సమయానికి వెళ్లలేక పోతున్నామని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కందుకూరుకు వెలిగొండ జలాలు

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


ఎమ్మెల్యే నాగేశ్వరరావును సత్కరిస్తున్న గ్రామస్థులు

కందుకూరు, జూలై 30: కందుకూరు నియోజకవర్గానికి వెలిగొండ ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలు తెచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మోపాడులో మంగళవారం ఎమ్మెల్యేకి ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ శివార్లలో ఉన్న సాయిబాబా ఆలయం నుంచి రామాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఘనంగా సత్కరించారు. అనంతరం పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నుంచి కందుకూరు, కనిగిరి, కొండపి నియోజకవర్గాలలో సాగునీటి వసతిలేని భూములకు సాగునీటి వసతి కల్పనకు ప్రత్యేక కాలువ తవ్వేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌లు అంగీకరించారని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు తూర్పు కాలువ నుంచి ఈ మూడు నియోజకవర్గాలకు ప్రత్యేక కాలువకు రూ.350 కోట్లు అవుతుందని అంచనా వేస్తున్నారన్నారు. త్వరలోనే సర్వే ప్రారంభమవుతుందని, ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే కందుకూరు నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రాష్ట్రం గురించి, ప్రజల బాగోగుల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన చేస్తుంటే మాజీ సీఎం జగన్ మాత్రం ఇంకా తన వెకిలి బుద్ధితోనే ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. గత ఎన్నికల్లో మోపాడు గ్రామస్థులు తనకు మంచి మెజార్టీ అందించారని, గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నార్నె రోశయ్య, దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహం, తోకల వెంకటేశ్వర్లు, రావుల రవి, తోకల నరసింహం, వీరయ్య, నాగినేని సురేష్, బొడపాటి నరసింహారావు, తన్నీరు ఏడుకొండలు, బొడపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ఎమ్మెల్యే కావ్య పూజలు


పూజా కార్యక్రమాలల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య

కావలి రూరల్, జూలై 30: మండలంలోని రాజువారిచింతలపాలెంలో మంగళవారం జరిగిన గంగమ్మ పొంగళ్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. గంగమ్మను దర్శించుకుని వర్షాలు సంవృద్ధిగా కురవాలని, పాడి పంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని పూజలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, బ్రహ్మయ్య స్వామి, మాజీ సర్పంచు గుంటూరి మల్లికార్జున్, టీడీపీ నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, పంకు తాతయ్య, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించండి


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ

లింగసముద్రం, జూలై 30 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని కందుకూరు క్లస్టర్ ఏపీడీ జే.బాబూరావు చెప్పారు. మంగళవారం ఆయన లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ ఏపీవో షేక్ సమీర్‌బాషా సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పనులు గుర్తించాలని, కూలీల సంఖ్య పెంచాలని చెప్పారు. అంతకుముందు ఆయన చినపవని, అన్నెబోయినపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, మస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ చిన కోటయ్య, టీఏలు, బీఎఫ్‌టీ, తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన యువకుడిపై కేసు

అల్లూరు, జూలై 30 : మద్యం సేవించి స్నేహితుడిపై విచక్షణా రహితంగా దాడి చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు రెడ్డి కథనం మేరకు.. అల్లూరు సెటిల్మెంట్ ప్రాంతానికి చెందిన జాన్‌పాల్, బానిపాల్, రంజిత్ అనే ముగ్గురు యువకులు ఈనెల 13న విడవలూరు మండలం పొన్నపూడిలో పనికి వెళ్లారు. పని చూసుకున్న అనంతరం ముగ్గురు సముద్ర తీరాన మద్యం సేవించారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురూ ఒకే ద్విచక్ర వాహనంపై వస్తుండగా బానిపాల్ ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడపడంతో తనకు తల తిరుగుతుందని, వాహనాన్ని ఆపాలని జాన్‌పాల్ కోరినప్పటికీ వినకపోవడంతో బానిపాల్‌ను దుర్భాషలాడాడు. దీంతో వాహనాన్ని ఆపి జాన్‌పాల్‌పై బానిపాల్ విచక్షణా రహితంగా దాడిచేశాడు. పక్కనే ఉన్న రంజిత్ ఇదంతా వీడియో తీయగా మంగళవారం వైరల్ అయింది. వీడియో చూసిన జాన్‌పాల్ కుటుంబ సభ్యుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా బానిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మాట్లాడుతున్న రోటరీ క్లబ్ అధ్యక్షురాలు స్వర్ణలత

కావలి రూరల్, జూలై 30: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు స్వర్ణలత పేర్కొన్నారు. మండలంలోని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ వారి సౌజన్యంతో మంగళవారం ప్లాంటేషన్, బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. విద్యార్థులకు మొక్కలు నాటే ఆవశ్యకతను వివరిస్తూ, రక్త పరీక్షలతోపాటు గ్రూపు నిర్ధారణలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్ ప్రియ, రోటరీ క్లబ్ నిర్వాహకులు మాధవరెడ్డి, నెల్లూరు రవికుమార్, రమేష్‌రెడ్డి, సురేష్, హరినారపరెడ్డి, సాయివిఠల్, టీం సేవియర్స్ సభ్యులు ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదరకరం


హెల్మెట్‌పై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

కావలిటౌన్, జూలై 30: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని లీగల్ ఎయిడ్ మెంబర్ ఐ సాయిప్రసాద్ పేర్కొన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అడవి రాజుపాలెంలో న్యాయ విజ్ఞాన సదస్సు, హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, న్యాయవాదులు చంద్రశేఖర్ రెడ్డి, సాయికృష్ణ, ద్విచక్రవాహన దారులు పాల్గొన్నారు.

3న కలిగిరి మండల సమావేశం

కలిగిరి, జూలై 30: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆగస్టు 3న ఎంపీపీ మెట్టుకూరి శిరీష ఆధ్వర్యంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో రంగసుబ్బరాయుడు తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి శాఖలవారీగా నివేదికలతో అధికారులు హాజరు కావాలని కోరారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

అల్లూరు, జూలై 30 : అల్లూరు పట్టణంలోని చింతగుంట సమీపంలో మంగళవారం లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బాధితుల కథనం మేరకు... అల్లూరు నుంచి చింతగుంట వైపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అల్లూరుకు చెందిన మేడా రమేష్‌రెడ్డిని వెనుక నుంచి ఉప్పు లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనతో రమేష్‌రెడ్డి అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరంమెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవరు మద్యం సేవించి ఉండడంతో వేగంగా నడుపుతూ ముందు వెళ్తున్న రమేష్‌రెడ్డిని ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు లారీని, డ్రైవరును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలుషిత నీరు సరఫరా

లింగసముద్రం, జూలై 30 : రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా భారీ మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న నీరు కలుషితమై వస్తుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుడ్లూరు ఫేస్-1, ఫేస్-2, రాళ్లపాడు-రాళ్లపాడు మంచినీటి పథకాల నుంచి పురుగులతో కూడిన కలుషిత నీరు వస్తోందని మండలంలోని పెదపవని, చినపవని, వెంగళాపురం గ్రామాలకు చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిల్టర్ పాయింట్స్‌లో నీటిని సరిగా ఫిల్టర్ చేయకుండానే నీరు వస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరు పరిశుభ్రంగా వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శాకాంబరి అలంకారంలో కామాక్షి



కందుకూరు, జూలై 30: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో వెలసిన కామాక్షి సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం అమ్మవారికి శాకాంబరి అలంకారం నిర్వహించారు. ఆలయ అర్చకులు అన్నమాచార్యులు అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరణ చేయగా భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో భక్తులు, అయ్యప్పస్వామి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వెల్లటూరివారిపాలెంలో శుభ్ దిన్ భోజన్

కొండాపురం, జూలై 30: మండలంలోని సాయిపేట పంచాయతీ వెల్లటూరివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా శుభదిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్లు, బిస్కెట్లు, పండ్లు అందచేశారు. అనంతరం కొండాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పుస్తక పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఓపీ నరసయ్య, ఉపాధ్యాయని మృదుల పాల్గొన్నారు.

పాఠశాలకు ఇనుప గేటు ఏర్పాటు

బిట్రగుంట, జూలై 30: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులోని ప్రాథమిక పాఠశాలకు ఏర్పాటు చేసిన ఇనుప గేటును దాతలు మంగళవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన పసుపులేటి సాయిబాబా, లక్ష్మి దంపతులు వారి కుమారుడు పసుపులేటి హర్షభరత్ జ్ఞాపకార్థం వారు ఇనుప గేట్లు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు నరసింహారావు, జయమ్మ, పాఠశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్ మద్దులూరి ప్రసాద్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొని పసుపులేటి దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని విజయ, లూర్ధురాజు పాల్గొన్నారు.

తిమ్మారెడ్డిపాలెంలో పారిశుధ్య పనులు

లింగసముద్రం, జూలై 30 : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి షేక్ గౌస్ బాషా ఆధ్వర్యంలో మురుగు కాలువల్లో మురుగు, చెత్తాచెదారాన్ని సిబ్బంది తొలగించారు. కాలువల్లో దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించారు. ఈ పనులను ఎంపీడీవో కె శ్రీనివాసులు పర్యవేక్షించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు.